


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 2-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 214 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి ఉ.7.32, ద్వాదశి తె.5.07 వరకు, నక్షత్రం: పూర్వాభాద్ర సా.5.04 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.1.52-3.20, దుర్ముహూర్తం: సా.4.08-4.54, అమృతఘడియలు: ఉ.9.29-11.00, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 5.39 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పవిత్రమైన కార్తీక మాసం... అందులోనూ శనివారం... వెంకన్నను దర్శించుకుంటే మంచిదనే ఒక నమ్మకం! తండోపతండాలుగా జనం తరలి వచ్చారు! నియంత్రించే వారు లేరు! స్వీయ నియంత్రణా లేదు! ఫలితం... పెను విషాదం! తొక్కిసలాటలో తొమ్మిది నిండు ప్రాణాలు బలి! వీరిలో ఎనిమిది మంది మహిళలే! శనివారం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘోరమిది!

అయ్యో... దేవుడా!

తొక్కిసలాటలో 9 మంది మృతి.. దైవ దర్శనంలో పెను విషాదం

ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో దారుణం

కార్తీక శనివారం సందర్భంగా ఓ ప్రైవేటు ఆలయానికి పోటెత్తిన భక్తులు

మొదటి అంతస్తులో గర్భగుడి.. వచ్చిపోయేందుకు ఒకటే మెట్లదారి

పరిస్థితి అదుపు తప్పి తోపులాట.. స్టీల్ రెయిలింగ్ ఊడి కింద పడిన జనం

వారిని తొక్కుకుంటూ వెళ్లిన మరికొందరు.. ఏర్పాట్లు చేయని నిర్వాహకులు

మృతుల్లో ఒక బాలుడు.. మిగిలిన వారంతా మహిళలే 3

సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి.. విచారణ జరిపిస్తామని ప్రభుత్వ ప్రకటన





తొక్కిసలాట బాధితుల కుటుంబసభ్యుల రోదనలు



ఆట అదరాలి.. కప్పు కొట్టాలి

దక్షిణాఫ్రికాతో భారత్ అమీతుమీ 11

మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ నేడే

మావోయిస్టుల కీలక డేటా

ధ్వంసం

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ జాతీయ నాయకత్వం సీరియస్

అందుకే సీబీఐ విచారణకు రాష్ట్ర నేతల డిమాండ్

ప్రభాకర్‌రావు కేసులో సుప్రీంకోర్టులో ఇంప్లీడ్

ఆనాటి ఎస్ఐబీ ధ్వంసం చేసిన ట్యాపింగ్ డేటాలోనే మావోయిస్టుల సమాచారం!

ఎఫ్ఎస్ఎల్ నివేదికలో కీలక అంశాలు!?

బీజేపీ హైకమాండ్ వద్ద సమగ్ర నివేదిక!

రాష్ట్ర రాజకీయాల్లో త్వరలో కీలక పరిణామాలు?





హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మావోయిస్టులకు సంబంధించిన కీలక డేటా కూడా ధ్వంసమైందా? ఈ అంశాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుందా? రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు ఫోన్ ట్యాపింగ్ కేసు కారణం కాబోతోందా? ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ రాష్ట్ర బీజేపీ డిమాండ్ చేయడానికి ఇదే కారణమా? అంటే అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా దేశవ్యాప్తంగా మావోయిస్టుల కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో తెలంగాణలో చోటుచేసుకున్న

మిగతా 12వ పేజీలో...

సాయుధ పోరాటం.. విఫల మార్గం

పరిస్థితులు మారాయి.. ప్రధాన స్రవంతిలో కలవండి

మావోయిస్టులకు మల్లోజుల వీడియో సందేశం 14

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య

రహస్య ఒప్పందం

డిపాజిట్ పోగొట్టుకునైనా బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీజేపీ యత్నం

కేసీఆర్-మోదీ ఓవైపు.. రాహుల్-రేవంత్ మరోవైపు

జూబ్లీహిల్స్‌లో సమస్యలకు కారణం బీఆర్ఎస్సే

మైనారిటీల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు

జూబ్లీహిల్స్‌కు కిషన్‌రెడ్డి ఎన్ని నిధులు తెచ్చారు?

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి

మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది

బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు.. విగ్రహం

జూబ్లీహిల్స్ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

బోరబండ, ఎర్రగడ్డలో రోడ్‌షో.. కార్నర్ మీటింగ్



జూబ్లీహిల్స్ రోడ్ షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో నవీన్ యాదవ్

హైదరాబాద్ సిటీ/బోరబండ/ఎర్రగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఓట్లు వేయించడమే ఆ ఒప్పందమన్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లో బీజేపీ తమ డిపాజిట్ పోగొట్టుకొని బీఆర్ఎస్‌ను గెలిపించే ప్రయత్నం చేస్తోందన్నారు. మొదటి రోజు కేటీఆర్, రెండోరోజు కిషన్‌రెడ్డి మాట్లాడతారని, వీరిద్దరికీ ఫామ్ హౌజ్‌లో కూర్చున్నాయన నీతులు చెబుతున్నారని తెలిపారు. వీరి కుమ్మక్కు రాజకీయాలపై ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శనివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి నగరంలోని బోరబండ, ఎర్రగడ్డలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. బోరబండ చౌరస్తా, ఎర్రగడ్డలోని బీశంకలాల్‌నగర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రస్తుత పోటీ మాగంటి సునీత, నవీన్ యాదవ్‌ల మధ్య కాదని, కేసీఆర్, మోదీ ఒకవైపు, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మరోవైపుగా జరుగుతున్న పోటీ అని తెలిపారు. "మూడుసార్లు బీఆర్ఎస్ వాళ్లకు అవకాశమిచ్చారు. మూడుసార్లు

మిగతా 13వ పేజీలో...



ఎగిరే కారును తెచ్చేస్తున్నా

ఈ ఏడాదిలోనే డెమో కూడా చూపిస్తా 14

టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ప్రకటన

కేరళకు మరో ఖ్యాతి

అత్యంత పేదరికాన్ని రూపుమాపిన రాష్ట్రంగా రికార్డు.. అసెంబ్లీలో సీఎం విజయన్ ప్రకటన

పచ్చిమోసమన్న ప్రతిపక్ష యూడీఎఫ్ 14



బాలికపై ముగ్గురి లైంగిక దాడి

'మీ తమ్ముడు పడిపోయాడు'.. అని చెప్పి తీసుకెళ్లి దుశ్చర్య

నిందితుల్లో ఇద్దరు మైనర్లు, మరొకరు మేజర్ 10

ఖమ్మం జిల్లాలో ఘటన.. కేసు నమోదు, పరారీలో నిందితులు

తలను కోసి.. వివస్త్రను చేసి

నిజామాబాద్‌లో గుర్తుతెలియని మహిళ దారుణ హత్య 10

తల, ఎడమచేతి వేళ్లు, కుడిచేతి మణికట్టు లేకుండా మృతదేహం

కేసుపై పోలీసుల దర్యాప్తు



జూబ్లీహిల్స్‌లో రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాగంటి సునీత

కాంగ్రెస్‌తో ఫేక్ బంధం..

బీజేపీతో పేగు బంధం

సెంటిమెంట్‌పై రేవంత్ మాటలు విడ్డూరం

పథకాలు రద్దంటే.. ప్రజలే బుద్ధి చెబుతారు

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

ఆ పార్టీకి డిపాజిట్ గల్లంతుచేస్తే 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం: కేటీఆర్

హైదరాబాద్ సిటీ/ హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్‌తో ఉన్నది ఫేక్ (నకిలీ) బంధమని, ఆయనది బీజేపీతో పేగు బంధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. పిల్లనిచ్చిన మామను బండ బూతులు

మిగతా 13వ పేజీలో...

బీఆర్ఎస్, కాంగ్రెస్.. రెండూ దగా పార్టీలే

గద్దెనెక్కక ముందు ఓ మాట.. గద్దెనెక్కాక మరో మాట

మభ్యపెడుతున్న ఆ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలి

మజ్లిస్ మెప్పు కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు 13



దేశాన్నే అవమానిస్తారా?.. ఓట్లకోసం అలా మాట్లాడతారా?

సీఎంపై రాంచందర్‌రావు ధ్వజం.. ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల



11.88 కోట్లతో తుమ్మిడిహెట్టి డీపీఆర్

» సుందిళ్లకు లింక్ చేస్తూ అలైన్‌మెంట్‌తో డీపీఆర్‌కు సర్కారు పచ్చజెండా

» పరిపాలనపరమైన అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో పాటు గ్రావిటీ కెనాల్, సొరంగం, సుందిళ్ల అనుసంధానంపై రూ.11.88 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు నీటిపారుదల ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారమే జీవో 278 జారీ చేశారు. డీపీఆర్ తయారీకి టెండర్లు పిలుస్తూ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే కాంపోనెంట్‌లవారీగా ఏ మేరకు వ్యయం కానుందనే దానిపై స్పష్టత వచ్చింది. డీపీఆర్ తయారీ తర్వాత ప్రాజెక్టు వ్యయంపై పూర్తిస్థాయిలో స్పష్టత రానుంది. రోజుకు ఒక టీఎంసీ చొప్పున 80 రోజుల్లో 80 టీఎంసీలు తరలించేలా 150 మీటర్ల ఎత్తుతో ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని కట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. తొలి విడతలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీటిని అందించి, ఎల్లంపల్లికి నీటిని తరలించి... కాళేశ్వరంలోని వివిధ కాంపోనెంట్లకు నీటిని అందించనున్నారు. ఉమ్మడి రంగారెడ్డిలోని ప్రాంతాలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఉండటం... ఈ ప్రాజెక్టుకు కృష్ణా ట్రైబ్యునల్‌లో నీటి కేటాయింపులు కోరుతున్న విషయం విదితమే. ఏడాదిలోపు విచారణ కొలిక్కి వచ్చి, నీటి కేటాయింపులపై స్పష్టత వచ్చాకే మలివిడతపై స్పష్టత రానుంది. కృష్ణా ట్రైబ్యునల్‌లో పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు కలిపి 120 టీఎంసీల నీటిని కోరుతున్నారు. దాంతో ట్రైబ్యునల్ సరిపడా నీటి కే టాయింపులు చేయకపోతే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద నీటిని అందించేలా పనులు చేపట్టనున్నారు. 7న జరగనున్న క్యాబినెట్ భేటీలో తుమ్మిడిహెట్టి బ్యారేజీపై చర్చించనున్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి... అక్కడి నుంచి మైలారం దాకా గ్రావిటీతో వచ్చే నీటిని ఎల్లంపల్లిలో వేసేలా పంపింగ్ చేయాలనే ప్రతిపాదనలను విరమించుకున్నారు. తుమ్మిడిహెట్టి నుంచి 71.5 కి.మీ దూరంలో ఉన్న మైలారం దాకా గ్రావిటీలో వచ్చే నీటిని 20.06 కి.మీ మేర ఒక సొరంగాన్ని తవ్వి... టేకుమట్ల వాగులో వేయనున్నారు.ఈ వాగు 11 కి.మీ మేర ప్రవహించి చేసి, సుందిళ్లలో కలువనుంది. సుందిళ్ల బ్యారేజీ వద్ద కాసిపేట పంపింగ్ స్టేషన్ ఉంది. మోటార్లు కూడా సిద్ధంగా ఉండటంతో నీటిని ఎత్తి... ఎల్లంపల్లిలో వేయనున్నారు. ఆ తర్వాత ఆ నీటిని కాళేశ్వరంలోని వివిధ కాంపోనెంట్ల కింద సాగునీటికి అందించనున్నారు.

85శాతం సీట్లు స్థానికులకే!

పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో రాష్ట్ర విద్యార్థులకు కేటాయింపు

» రేవంత్ సర్కారు కీలక నిర్ణయం.. నేడో, రేపో జీవో విడుదల

» పదేళ్లుగా రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం.. దానికి సర్కారు చెక్

» ఇక నుంచి 318 పీజీ మెడికల్, 70 ఎండీఎస్ సీట్లు స్థానికులకే

» సీఎంకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర కృతజ్ఞతలు

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యవిద్య ప్రవేశాల్లో రాష్ట్ర విద్యార్థులకు మేలు చేకూరేలా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. పదేళ్లుగా వైద్య విద్యార్థులు పడుతున్న అసంతృప్తి, ఆవేదనకు ఫుల్‌స్టాప్‌పెట్టింది. రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య, దంత కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ కోటా (ఎంక్యూ-1) సీట్లలో 85 % సీట్లను తెలంగాణ స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు సీఎం ఈ కీలక ఫైల్ మీద శనివారం ఆమోదముద్ర వేశారు. ఇప్పటిదాకా ఈ సీట్లన్నీ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో ఉన్నాయి. దాంతో రాష్ట్ర విద్యార్థులకు నష్టం జరుగుతోంది. సర్కారు నిర్ణయంతో ఏటా 318 పీజీ మెడికల్, 70 పీజీ డెంటల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయి. ఇందుకు సంబంధించిన అధికారిక జీవోను వెంటనే జారీ చేయాలని సీఎం ఆదేశించారు. జీవో నేడో, రేపో విడుదలయ్యే అవకాశాలున్నాయి.

పదేళ్లుగా మెడికోల గోస

రాష్ట్రం వచ్చి పదేళ్లు గడిచిపోయినా పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటాలో పాత విధానమే కొనసాగుతోంది. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల్లో 100 పీజీ సీట్లుంటే.. వాటిలో 50 సీట్లు కన్వీనర్ కోటాకు వెళ్తాయి. మిగిలిన వాటిలో 25 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా (ఎంక్యూ-1), మరో 15 సీట్లు ఎన్ఆర్ఐ, ఇంకో 10 సీట్లు ఐపీఎస్ (ఇన్‌స్టిట్యూషనల్ ప్రయారటీ సీట్లు) కోటా సీట్లుంటాయి. ఇప్పటిదాకా మేనేజ్‌మెంట్ కోటా సీట్లను వంద శాతం ఓపెన్ కేటగిరీలో భర్తీ చేయడంతో దేశవ్యాప్తంగా మంచి ర్యాంకులు సాధించిన ఇతర రాష్ట్రాల విద్యార్థులు సులువుగా దక్కించుకుంటున్నారు. తెలంగాణ విద్యార్థులు ఆ సీట్లకు పోటీపడినా జాతీయ స్థాయిలో పోటీ ఉండటంతో వాటిని కొట్టలేకపోతున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో దాదాపు 60 శాతం సీట్లను ఏటా ఇతర రాష్ట్రాల విద్యార్థులే దక్కించుకుంటున్నారు. పలు రాష్ట్రాలు ఎంక్యూ-1 సీట్లలో 85 శాతం సీట్లు స్థానికులకే దక్కేలా లోకల్ రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నాయి. తెలంగాణలో మాత్రం ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. దీనిపై జూనియర్ డాక్టర్లు (జూడాలు) ఎప్పటి నుంచో సర్కారుపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదే విషయంలోనూఏపీతో సహా చాలా రాష్ట్రాలు ఎప్పుడో 85 శాతం లోకల్ రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నాయి.

సీఎం దృష్టికి తీసుకెళ్లిన వైద్య మంత్రి

తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (టీజూడా) సహా పలు వైద్య సంఘాలు ఈ అన్యాయంపై దశాబ్ద కాలంగా అడ్మిషన్ల సమయంలో ఆందోళనలు చేస్తున్నాయి. ఈ సమస్య తీవ్రతను, విద్యార్థుల ఆవేదనను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విజ్ఞప్తిపై సీఎం స్పందించారు.రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేసేలా సంబంధిత ఫైల్‌పై సంతకం చేశారు. ఈ పరిణామంపై జూడా అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. సర్కారు నిర్ణయంపై రాష్ట్ర టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ హర్షం వ్యక్తం చేశారు. సర్కారుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

చరిత్రాత్మక నిర్ణయం



ఇది వేలాది మంది తెలంగాణ మెడికోల కల నెరవేర్చిన చరిత్రాత్మక నిర్ణయం. పరిమిత సీట్లు, అఖిల భారత స్థాయిలో పోటీ వల్ల మన విద్యార్థులు ఏళ్లుగా నష్టపోతున్నారు. ఈ సంస్కరణతో మన బిడ్డలకు మరిన్ని పీజీ సీట్లు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థుల పక్షాన నిలిచి, తెలంగాణకు అనుకూలమైన నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. ఇది రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

-మంత్రి దామోదర రాజనరసింహ

లోకం తీరు



ఇంట్లో కోపైలెట్.. విమానంలో ప్రయాణికులు

» కో పైలెట్ కోసం ఆగిన విమానం

శంషాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విమానంలో ప్రయాణికులు.. ఇంట్లో కో పైలెట్..! వెరసి దాదాపు గంట విమానం ఎయిర్‌పోర్టులోనే నిలిచిపోవాల్సి వచ్చింది. ఈ ఘటన శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 9.50 గంటలకు ముంబైకి ఇండిగో 6ఈ 6263 విమానం బయలుదేరాల్సి ఉంది. 9.40 గంటలకల్లా ప్రయాణికులంతా విమానం ఎక్కారు. ప్రధాన పైలెట్ వచ్చారు కానీ కో పైలెట్ రాలేదు. ఎంతకీ విమానం కదలకపోయే సరికి సిబ్బందిని ప్రయాణికులు ఆరా తీశారు. కో పైలెట్ రాకపోవడంతో విమానం వెళ్లడం లేదని సమాధానం ఇవ్వడంతో కొద్దిసేపు సిబ్బందికి, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరిగింది. విమానం ఆలస్యంకావడంతో అజయ్‌కుమార్ అనే జనసేన నేత విమానంలో ప్రయాణికులు కూర్చున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరల్ అయింది. ఇలా కోపైలెట్ లేక విమానం ఆగడం మొదటిసారి అని తెలుస్తోంది. కోపైలెట్ రాకతో విమానం 10.50 గంటలకు ముంబై బయలుదేరి వెళ్లినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

జెద్దా నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇండిగో విమానం శనివారం బయలుదేరిన కొద్దిసేపటికే జీఎంఆర్ కస్టమర్ కేర్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన భద్రత అధికారులు వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారమివ్వడంతో విమానాన్ని ముంబైకి దారి మళ్లించారు. విమానం ముంబై విమానాశ్రయంలో ల్యాండ్ కాగానే బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించి ఎలాంటి బాంబు లేదని తేల్చడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత ముంబై నుంచి విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలి

ఆనాడు ఇందిరాగాంధీ ప్రపంచ దేశాలను శాసిస్తే.. నేడు మోదీని ప్రపంచ దేశాలు శాసిస్తున్నాయి

» మోదీ నీడలోనే కేసీఆర్, జగన్, చంద్రబాబు

» 300 ఎంపీస్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

» రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలి

» ఇచ్చిన మాటమీద నిలబడే వ్యక్తి రాహుల్


» ఆయన ప్రధాని అయితే తెలంగాణ అభివృద్ధి

» ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం పూర్తి అవుతుంది

» తెలంగాణ, ఏపీ ప్రజలు ఆలోచన చేయాలి

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనాడు ఇందిరాగాంధీ ప్రపంచ దేశాలను శాసిస్తే.. నేడు ప్రపంచ దేశాలు ప్రధాని మోదీని శాసిస్తున్నాయన్నారు. తెలంగాణలో పదేళ్లు కేసీఆర్, ఏపీలో పదేళ్లు జగన్, చంద్రబాబు ముఖ్యమంత్రులుగా ఉండి కేంద్రంలో బీజేపీకి మద్దతు ఇచ్చినా కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రెండు రాష్ట్రాల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం తీసుకువచ్చి దేశ వ్యాప్తంగా గ్రామ గ్రామాన పేదలకు ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. ఈ పదేళ్ల బీజేపీ ప్రభుత్వంలో మహిళల ఉపాధి, యువతకు ఉద్యోగాలు, పేదలకు న్యాయం జరిగిందని చెప్పగలరా అని ప్రశ్నించారు. భారతదేశం సాఫ్ట్‌వేర్, ఐటీ రంగాల్లో అభివృద్ధి సాధించిందంటే అందుకు రాజీవ్ గాంధీనే కారణమన్నారు. ఈ విషయాన్ని కూడా ప్రజలు గమనించాలన్నారు. విదేశాల్లోని నల్లధనం తీసుకువచ్చి ఒక్కొక్కరి బ్యాంక్ అకౌంట్లలో రూ. 15 లక్షలు వేస్తానని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీని దేశ ప్రజలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. మోదీ నీడలోనే చంద్రబాబు, కేసీఆర్, జగన్‌ల పాలన సాగిందన్నారు. 300 కాంగ్రెస్ ఎంపీ స్థానాలను గెలిపించి దేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని జగ్గారెడ్డి కోరారు. మాట ఇస్తే మాట మీద నిలబడే చరిత్ర రాహుల్.. ఆయన కుటుంబానికి మాత్రమే ఉన్నదన్నారు. రాహుల్ ప్రధానమంత్రి అయితే తెలంగాణ అభివృద్ధి కావడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారం, పోలవరం పూర్తవుతుందన్నారు. తెలంగాణ, ఏపీ ప్రజలు ఇప్పటి నుంచే ఆలోచన చేయాలని జగ్గారెడ్డి కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ ఆర్యవైశ్య/21y&23y&25y&27y&29y&31y&33y&35y&37y&39y&41y&43y&45y&47y&49y&51y&53y&55y&57y&59yజి. సుప్రజాగుప్త "మాసేవ" (Since 1998) PH: 9291503949 AJH-15544

★ 58y / రెండవ పెళ్ళి / విడో / రిటైర్ / GOVT ఫ్యామిలీ పెన్షనర్/ సొంత ఇల్లు రెంట్స్/ పిల్లలు లేరు / ఎలాంటి బాదరా బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 7995376608 AJH-15544

★ 58y / రెండవ పెళ్ళి / విడో / రిటైర్ / GOVT JOB పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ ప్రాపర్టీ / ఎలాంటి బాదరా బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 9030658258 AJH-15544

★ వైశ్య / 48y / రెండవ పెళ్ళి / విడో / GOVT ఫ్యామిలీ పెన్షనర్/ సొంత ఇల్లు రెంట్స్/ పిల్లలు లేరు / ఎలాంటి బాదరా బందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 8125076013 AJH-15544

★ రెడ్డి / విడో / 45y/ కుల పట్టింపు లేదు / GOVT. JOB / మంచి ప్రాపర్టీస్ / సొంత ఇల్లు గల అందమైన వధువుకి వరుడు కులెను / అన్ని వయస్సుల వారికి 1ST & 2ND మ్యారేజ్ మ్యాచెస్ కలవు. ఫోన్: 8143226625 AJH-15545

★ రెడ్డి / విడో / కుల ఆస్తి పట్టింపు లేదు /వయస్సు 35y/ Qly: Degree, PVT. JOB / గల అందమైన వధువుకి వరుడు కావలెను ఫోన్ నం : 8074131208 AJH-15545

★ 2వ పెళ్లి, CNB, వైశ్య, 54 / ఎత్తు 5.5 / BHMS/ డాక్టర్ / మంచి జీతం/ కోట్ల స్థిరాస్తులు, 20ఎకరాలు పంట పొలాలు, విల్లాలు గల అందమైన వధుకి మంచి వరుడు కావలెను. ఫోన్: 6304448107 AJH-15545

★ రెడ్డి 2ND (కుల-ఆస్తి) పట్టింపు లేదు / AGE: 32, Q: Pharmacy / సొంత ఇల్లు బిజినెస్ & మంచి ప్రాపర్టీస్ / గల వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1ST లేదా 2వ సంబంధాలు కలవు. ఫోన్: 9704783370 AJH-15545

★ బ్రాహ్మణ / 35 / 5.3 / Degree / Pvt Job అందమైన వధువుకి తగిన జాబ్ / బిజినెస్ / పౌరోహితం వరుడు కావలెను. Ph: 9701743336 AJH-15545

★ పద్మశాలి / B.Tech / Govt. Bank Asst Manager /. మంచి జీతము / 5'5" ఎత్తు / 28 సం.ల అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 9398524192 AJH-15545

★ వడ్డెర / MBA / Govt. Jr.Asst. డిస్ట్రిక్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618008271 AJH-15542

★ యాదవ / BSC / Govt. HO / హార్టికల్చర్ Dept / 5'5" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15542

★ SC మాదిగ / B.Tech / C.Govt. బ్యాంక్ P.o/ పంజాబ్ నేషనల్ బ్యాంక్ / మంచి జీతం / 5'2" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15542

★ 2వ పెళ్లి / కుల ప్రసక్తి లేదు / B.Tech MBA/ సేల్స్ మేనేజర్ / IT మంచి జీతం/ వైశ్య, / ఎత్తు 5.4 / 37సం.ల అందమైన వధుకుకి వరుడు కావలెను. ఫోన్: 9963757612 AJH-15542

★ మంచి ఆస్తి 35 సం.లు వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. అన్ని సంబంధాలు 1వ, 2వ Govt. ఎంప్లాయ్, పెన్షనర్స్ సంబంధాలు కలవు, బ్రోకరు ఫ్రీ సర్వీస్, ఫాస్ట్ సెటిల్మెంట్ ఫోన్: 6281147818 AJH-003443

★ 45/ సెకండ్ మ్యారేజ్ వధువునకు తగిన ఆంధ్రప్రదేశ్ కి చెందిన వరుడు కావలెను (నో బ్రోకర్స్) ఫోన్ నం.: 9160826515 AJH-003443

★ బ్రాహ్మణ వధువు / 26 Age / Study: 10th Class / Father Pvt Job & Mother House Wife, One Sister Married No Brothers. పౌరోహితం Also OK. శాఖ పట్టింపు లేదు. Ph: 8121031369 AJH-2654

★ రెడ్డి, కాపు, బలిజ / 10 to డిగ్రీ / వయస్సు 25 to 40 సం.లు /1వ మ్యారేజ్, 2వ మ్యారేజ్ కొరకు ఆంధ్ర, తెలంగాణ. సంప్రదాయ కుటుంబ వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ ఆచారులు, వైశ్యబ్రాహ్మిణ్స్, నాయి బ్రాహ్మిణ్స్ / మొదటి సంబంధం / వయస్సు 26 to 36 సం.లు/ 10 to డిగ్రీ ఉన్న అమ్మాయిలకు వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ పద్మశాలి, పట్టుశాలి, దేవాంగ, లింగాయతులు / 1వ మ్యారేజ్ / సొంత ఇల్లు / 10 to డిగ్రీ / వయస్సు 25 to 35 సం.లు/ అమ్మాయిలకు వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ మున్నూరు కాపు, గౌడరి / మొదటి సంబంధం, రెండవ సంబంధం / వయస్సు 26 to 40 సం.లు సొంత ఇల్లు, వ్యాపారం, ఉన్న వారికి సంప్రదాయ కుటుంబ వరులు కావలెను ఫోన్: 8374364076 AJH-003540

★ కమ్మ - కుల ఆస్తి పట్టింపులేదు, వయస్సు 30, 5.5, మంచి రంగు, MBBS, సొంత క్లినిక్, 7 ఎకరాల భూమి, 2 ఇల్లు ఉన్న వధువుకి వరుడు కావలెను. ఏదైనా ఉద్యోగం లేదా వ్యాపారం ఉయిన వారే ఫుల్ డీటైల్స్ వాట్సాప్ నెం: 9160873010 AJG-249443

★ యాదవ 33 Yrs., B.Tech. 5'.4" ప్రభుత్వ ఉద్యోగినికి (జీతం : 8 Lakhs P.A.) తగిన వరుడు కావలెను. డైరెక్ట్ : 79974 86067 AJT - 1772

వధువు కావలెను



★ Goa, Engineer, 5'-8", వధువు కావలెను. Exp: Orphan / First / wid / Div. Caste, Age No Bar, కట్నం లేదు. సంప్రదించండి: 6304751936 AJH-28217

★ Balaji Naidu / 32 years / Only Son / S.S.L.C Pass / Working in Private Company / Job / Own / House in Bangalore City / First Marriage Looking for suitable Girl From any Caste / any language / any state. Cont: 7760119455 AJH-15545

★ ముదిరాజ్ / కట్నప్రసక్తి లేదు / M.Tech / C. Govt /. అకౌంటెంట్ ఆఫీసర్ / ఇన కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9618007652 AJH-15545

★ కుల ప్రసక్తి లేని 49 సంవత్సరాల డాక్టర్‌కు ఏ బాదరాబందీలేని తగిన వధువు కావలెను. డైరెక్ట్ వాట్సాప్ సంప్ర: 7676805552 AJH-15544

★ SC మాల, ఏకైక కుమార్తె / B.Tech / Govt Asst / ఇంజనీర్ / జెన్‌కో / మంచి జీతం / 5'8" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8897389698 AJH-15542

★ యాదవ / కట్న ప్రసక్తి లేదు / B.Tech / C.Govt. Asst. ఇంజనీర్ / HPCL / మంచి జీతము / 5'7" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్: 6303439893 AJH-15542

★ రజక / కట్న ప్రసక్తి లేదు / M.Tech / C.Govt. ఇన్‌స్పెక్టర్ కస్టమ్స్ & GST / మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9550166072 AJH-15542

★ పద్మశాలి / MSc / Agri / Govt. AEO / అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8297439565 AJH-15542

★ రాజులు / 44, 5.5" Bsc / సెయిల్ మేనేజర్ / మంచి జీతము / హైదరాబాద్ / సొంత ఇల్లు గల వరునికి క్షత్రియ 1వ, 2వ బ్రాహ్మణ, కమ్మ, కాపు, రెడ్డి పద్మశాలి, 1వ వధువు కావలెను డైరెక్ట్: 8885861136 AJH-003443

★ మాల క్రిస్టియన్ సెకండ్ మ్యారేజ్ వయసు 36 సంవత్సరాలు ఎత్తు 5/7 చదువు బిటెక్ నెలకు 80,000 జీతం వరుడికి వధువు కావలెను. ఫస్ట్ సెకండ్ క్రిస్టియన్ సంబంధాలు చూడబడును. సెల్: 7794911019 AJD:244477

★ కాపు కన్వర్టెడ్ క్రిస్టియన్ సెకండ్ మ్యారేజ్ వయసు 34 సంతలు ఎత్తు 5/5 చదువు బీటెక్ జీతం లక్ష రూపాయలు వరుడికి వధువు కావలెను. క్రిస్టియన్ సెకండ్ మ్యారేజ్ సంబంధాలు చూడబడును. సెల్: 9676982230. AJD:244476

కళ్యాణ వేదిక

★ ఆర్యవైశ్య & ALL కొన్ని వేల ప్రొఫైల్స్ మా 1000 + వాట్సాప్ గ్రూపుల్లో మీ ప్రొఫైల్ పెట్టి పెళ్లి కుదుర్చబడును. (1st & 2nd) Rs.2118/- లేదా Rs.518/- అడ్వాన్స్ కట్టి సంప్ర: RK మ్యారేజ్ కన్సల్టెన్సీ - 8332000801 AJH-15544

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 AJH-15544

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE/ Govt. / Doctors/ MNC/ Matches/ Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103/ 9533608887 (Whatsapp) AJH-15544

★ కమ్మ సంబంధములు U.S, U.K, ఆస్ట్రేలియా, కెనడా మొదటి రెండవ సంబంధములు కలవు. 28Y డైవర్స్ 50cr, 26Y M.B.A 50 cr, 10cr, B.Tech 25Y 5cr, M.B.A, B.Tech 27Y అమ్మాయిలు కలరు. 200crs వరకు అబ్బాయిలు, అమ్మాయిలు కలరు. డాక్టర్స్, వ్యాపారస్తులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావలెను. డైవర్స్‌లు మా ప్రత్యేకత. కొడాలి మ్యారేజెస్, కాటేపల్లిగూడెం, సెల్: 99127 11669 AJN-242462

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921386, 9703618806, 9985921380.

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

★ వివాహాలు అందరికి సకాలంలో జరగాలి బాధ్యతతో అన్ని కులాల సంబంధాలు మంచి సర్వీస్‌తో చేస్తాము. సాఫ్ట్‌వేర్, డాక్టర్, విదేశీ, వ్యాపార, అన్ని స్థాయిల Matches. ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ WhatsApp 6304826162 AJH-648

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జ్యోస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-003473

★ స్వాతి పరిణయ మ్యారేజ్ బ్యూరో / కేవలం కమ్మ/చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. దండమూడి శ్రీనాథ్. ఫోన్: 8019658675 / 8019658675 Whatsapp. AJH-003474

★ కాకతీయ మ్యారేజెస్ వారి అన్ని బ్రాంచెస్‌లో పేదలకు ఫీజులేకుండా అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. ఫోన్ : 9391 999 999/ 709 3200 333 AJH-15543

శ్రీ శ్రీరస్తు శుభమస్తు మ్యాట్రిమోని
The Ultimate Kamma's (ELITE MATCHES)
Ch: Prabhakar : 9100404026 RKR : 9100652122
కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ : 1991/5.10/DM Medical Oncology/300 Crs. ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ Business Family నుండి వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1997/6 feet/B.Tech/ MS UK/500 Crs. ప్రాపర్టీ Indiaలో Settled/ Business వరుడికి తగిన వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1997/6 feet/ B.Tech/ Software/ 35 Lakshs P/A/ 100 Crs. ప్రాపర్టీ గల వరుడికి Software or Business వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1994/5.11/ M.S General Surgery/ 40 Crs ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1995/5.10/ M.Tech/300 Crs. ప్రాపర్టీ Own Business గల వరుడికి తగిన Good Family నుండి వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1989/5.8/B.Tech MBA/ 40 Crs. ప్రాపర్టీ/డైవర్సి Business వరుడికి తగిన వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1985/5.10/M.Tech/ 50 Crs. ప్రాపర్టీ/ Builder Own Construction/ డైవర్సీ గల వరుడికి 1వ 2వ వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1993/5.10/B.Tech/ MS USA/USD 200/ 50Crs. ప్రాపర్టీ/ గల వరుడికి India or USA వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1995/5.11/M.S USA/ USD 180 100 Crs. Indiaలో Rental Income గల వరుడికి తగిన వధువు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : డైవర్స్ 1990/6feet/ MBA 20 Crs/ Software Job గల వరుడికి తగిన 1వ 2వ వధువు కావలెను. Cont: 9100404026

వరుడు కావలెను

★ కమ్మ : 1999/5.6/B. Tech/100 Crs. ప్రాపర్టీ గల వధువుకు Software or Business Well Settled వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1996/5.7/B. Tech PGDM/ Software/ 36 Lakshs P/A/ 50 Crs ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1998/5.7/B.Com MBA/ Own Industry/ 50 Crs ప్రాపర్టీ గల వధువుకు Well Settled Business వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1992/5.4/MBA/ 36L/75 Crs ప్రాపర్టీ /Good Education Family గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1992/5.6/B. Arch / MS USA/ 3000 Crs ప్రాపర్టీ /India Settled గల వధువుకు Good Education వున్న వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1995/5.4/11 M/Fair/ 5L Month/ 75 Crs ప్రాపర్టీ /Business గల వధువుకు Business వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : డైవర్స్/1991/5.4/B.Tech/ 30L PA/ 20 Crs ప్రాపర్టీ గల వధువుకు Software or Business 1వ 2వ వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 2001/5.3/B.Tech/200 Crs/ Software Job గల వధువుకు తగిన Software or Business Well Settled వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1993/5.7/B.Arch/100 Crs ప్రాపర్టీ గల వధువుకు Job or Business వరుడు కావలెను. Cont: 9100404026

★ కమ్మ : 1996/ 5.4/M.S. in Computers USA/ USD 200/100 Crs ప్రాపర్టీ గల వధువుకు India or USA వరుడు కావలెను. Cont: 9100404026

శారద వివాహ వేదిక
Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com
EXCLUSIVE CHOWDARY COMMUNITY Hyderabad. Phone: 9849413031
కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr. B.Tech MS 31 /20 Cr. B. Tech MS / 33 / 15 Cr. B.Tech MS / 37 / 70 Cr. B.Tech MS Citizen 28 / USA వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. B.Tech MS UK return 26 / 100 Cr. B.Tech MBA UK 30 / India వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B.Tech MS Sweedon / 10 Cr B.Tech MS UK / 9 Cr B.Tech Irland / 20 Cr. Australia B.Tech MS / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. MBBS MD GM 27 / Cr MS Orthopedics 34 / 20 Cr MBBS Pediatrics / 10 Cr MBBS Radiology వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr / MBBS PG USA 30 / 100 Cr. USA Citizen Doctor 29/27 USA Doctor వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 Cr. B.Tech 28 LPA /30 B.Tech 5 Cr. 18 LPA / 7 Cr B.Tech 13 LPA 30 / 10 Cr B.Tech 80LPA 33 / వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 2వ పెళ్ళి / 34 B.Tech / MS USA 10 Cr / India Business 50 Cr, 42 / M.Tech 39 Bengalore 1.5 Cr PA Salary వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి / 20 Cr. B.Tech IIT Business 32/10 Cr MBA 12LPA 30 / 15 Cr. B.Tech 80LPA 40 /50 Cr B.Com Business 42 వరులకి తగిన వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizen Doctor 50 Cr / 20 Cr 28 USA Doctor / 30 Cr, 32 USA Doctor వరులకు వధువు కావలెను సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం (USA) : రెండో పెళ్ళి 34 B.Tech MS 20 Cr / 37 B.Tech MS 15 Cr / 20 Cr B.Tech MS 39 / 10 Cr B.Tech MS USA Citizen 45 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 38 MBBS PG Doctor / 28 MBBS ENT / 50 Cr MBBS MD Pediatrics / 10 Cr MBBS MD Pediatrics 25 / 28 MDS Vijayawada / 27 MBBS Gynaecology వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండోపెళ్ళి 500 Cr Bangalore 39 / 70 Cr MPharmacy Law 35 / 20 Cr B.Tech 34 / 100 Cr B.Tech 37 / 15 Cr B.Tech MS 38 వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 32 PG Doctor / 28 BA JD(LAW) / 23 B.Tech BCS / 28 BA Texas 70 Cr / USA Citizen వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 MBBS కార్డియాలజిస్ట్ / 28 MBBS జనరల్ మెడిసిన్ / 25 MBBS పెడియాట్రీషియన్ డాక్టర్ వధువులకు తగిన వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 35 Cr BDS MS UK 28 / 10 Cr / B.Tech MS UK వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10Cr MTech IIIT 31 / 10 Cr BE 28 / 26 B.Tech 25 LPA / 27 B.Com CA Final / 28 MPharmacy / 25 BTech 30 / B.Tech వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం రెండవపెళ్ళి : 38 B.Tech MS India / 37 B.Tech MS USA / 38 B.Tech MS USA / 28 B.Tech MS UK 28 / B.Tech MS Australia వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 28 MDs Doctor / 29 MBBS PG Doctors / 32 LLB లాయర్స్ / 32 B.Tech IIIT Swe వధువుకి వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం USA : 10 Cr. B.Tech MS 38 / 20 Cr. B.Tech MS 35 / 20 Cr. Doctor 32 / B.Tech MS 25 / B.Tech MS 30 వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10Cr. USA 27 Doctor Pediatrics. 32 USA Citizen Doctor 20 Cr వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

రాష్ట్రపతి, ప్రధాని దిగ్ర్భాంతి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50 వేలు
- ప్రకటించిన ప్రధాని కార్యాలయం

న్యూఢిల్లీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడంపై పలువురు నేతలు తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, జ్యోతిరాదిత్య సింధియా, రామ్మోహన్‌నాయుడు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ వేదికగా తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడినవారికి రూ.50 వేలను ప్రధాని కార్యాలయం ప్రకటించింది.

మృతుల కుటుంబాలకు 15 లక్షలు

- క్షతగాత్రులకు రూ.3.5 లక్షలు: లోకేశ్

శ్రీకాకుళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటనపై ఏపీమంత్రి లోకేశ్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. శనివారం హుటాహుటిన పలాస ఆస్పత్రికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతి చెందిన 9 మంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15లక్షలు, కేంద్రప్రభుత్వం రూ. 2లక్షలు కలిపి మొత్తం రూ.17 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారికి రాష్ట్రం నుంచి రూ.3లక్షలు, కేంద్రం నుంచి రూ.50వేలు కలిపి మొత్తం రూ.3.5 లక్షలు ఇస్తామన్నారు. మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల కింద తక్షణ సహాయంగా రూ.10వేల పరిహారం లభిస్తుందన్నారు. మృతుల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉన్న ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరఫున బీమా కింద అదనంగా రూ.5లక్షల చొప్పున సాయం అందుతుందని మంత్రి వెల్లడించారు. తొక్కిసలాట 17 మంది క్షతగాత్రులు కాగా, వారిలో ముగ్గురు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారని లోకేశ్ తెలిపారు. దశలవారీగా గుడి నిర్మాణం జరిగిందని, నిర్మాణంలో లోపాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

మృతులు వీరే...

1. చిన్నమ్మి(50), రామేశ్వరం, టెక్కలి మండలం. 2. రాపాక విజయ(48), పిట్టలసరి, టెక్కలి మండలం. 3.మురిపింటి నీలమ్మ(60), దుక్కవానిపేటన, వజ్రపుకొత్తూరు మండలం. 4. దువ్వు రాజేశ్వరి(60), బెల్లుపటియా, మందస మండలం. 5. చిన్ని యశోదమ్మ(56), శివరాంపురం, నందిగాం మండలం 6. రూపా (33), గుడ్డిభద్ర, మందస మండలం. 7. డొక్కర అమ్ముడమ్మ(40), పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ. 8. బోర బృందావతి(62), మందస. 9. లొట్ల నిఖిల్(13), బెంకిలి, సోంపేట మండలం




ఘటనాస్థలిలో మృతదేహాల వద్ద బంధువుల ఆర్తనాదాలు.. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న నారా లోకేశ్, రామ్మోహన్‌నాయుడు

అయ్యో... దేవుడా!

తొక్కిసలాటలో 9 మంది మృతి.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో దారుణం

శ్రీకాకుళం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుణ్యం కోసం దైవ దర్శనానికి వెళ్లిన వారిని మృత్యువు పలకరించింది. తొక్కిసలాట రూపంలో మరణం వెంటాడింది. 9 మంది అక్కడికక్కడే మరణించగా... మరో 17 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో 8 మంది మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. మరణించిన వారంతా ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే. పలాస నియోజకవర్గంలో కాశీబుగ్గలోని శ్రీనివాసనగర్‌లో హరి ముకుందపండా అనే వ్యక్తి సొంతం గా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఏడాదిన్నర క్రితం నిర్మించారు. స్థానికులు ఈ ఆలయాన్ని 'చిన్న తిరుపతి'గా పిలుస్తారు. పూర్తిగా ప్రైవేటు నిర్వహణలో ఉన్న ఈ గుడికి ప్రతి శనివారం, సోమవారం రెండు వేల నుంచి ఐదువేల మంది భక్తులు వస్తుంటారు. ఈ శనివారం కార్తీక మాసం కావడంతో పాతికవేల మంది దాకా తరలి వచ్చారు. ఇంత రద్దీని ఆలయ నిర్వాహకులు ఊహించలేదు. దీంతో... తగిన ఏర్పాట్లు చేయలేదు. వలంటీర్లను నియమించుకోలేదు. ప్రైవేటు నిర్వహణలోని ఆలయం కావడంతో పోలీసులు, అధికారులూ దీనిపై దృష్టి సారించలేదు. ఇదే పెను విషాదానికి కారణమైంది.

పది నిమిషాల్లోనే....

పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర రద్దీ నెలకొంది. ఆలయ గర్భగుడికి వెళ్లేందుకు, దర్శనం చేసుకుని తిరిగి వచ్చేందుకు ఒకే మార్గం ఉంది. పది నుంచి 12 మెట్లు ఎక్కి... మొదటి అంతస్తులోకి వెళితే గర్భగుడి వస్తుంది. పైకి వెళ్లేందుకు... దర్శనం తర్వాత కిందికి వచ్చేందుకు ఇదే మెట్ల మార్గం! 'క్యూ' కోసం మధ్యలో స్టీల్ బారికేడ్ పెట్టారు. మధ్యాహ్నం 12.05 గంటలకు ఈ మెట్ల మార్గంలోనే తొక్కిసలాట మొదలైంది. దర్శనం చేసుకుని వచ్చే వరుసలోకి... ఇటువైపు నుంచి జనాలు చొచ్చుకుపోయారు. దీంతో... పరిస్థితి అదుపు

17 మందికి గాయాలు

తప్పి, తోపులాట మొదలైంది. క్యూలలో ఉన్న వారు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. బయట పడే యత్నంలో తోపులాట జరిగి స్టీల్ రెయిలింగ్ విరిగిపోయింది. జనం ఒకరిమీద ఒకరు పడిపోయారు. కిందపడిన వారిని తొక్కుకుంటూ చాలా మంది బయటికి వచ్చా రు. అంతా తీవ్ర గందరగోళం, కేకలు, అరుపులు! ఈలోపే... నిండుప్రాణాలు బలైపోయాయి. ఇదంతా పది నిమిషాల్లోనే జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గాయపడిన వారిని పలాస, టెక్కలి, మందసలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న బాకి కళావతి (50), దువ్వు కుమారి(25) అనే మహిళలను శ్రీకాకుళం మండలం జెమ్స్ ఆసుపత్రిలో చేర్చారు.

10కోట్లతో ఏడాదిన్నర కిందటే గుడి పూర్తి

కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వ్యాపారి, రైతు హరి ముకుంద పండాకు చిన్నతనం నుంచే దైవ భక్తి ఎక్కువ. ఆయన వయసు 95 సంవత్సరాలు. శ్రీదుర్గా కళామందిర్‌ను నెలకొల్పి సినీ ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. స్థానిక చిన్నకలియాపండా నగర్‌లో దుర్గాదేవి ప్రధాన ఆలయంతోపాటు ఇతర ఉప ఆలయాలను నిర్మించారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో మరో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 'నేను నిత్యం ఆరాధించే దుర్గాదేవి కలలోకి వచ్చి వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని ఆదేశించారు' అని చెప్పి 12.22 ఎకరాల్లో ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి ఐదేళ్లకుపైగా పట్టింది. సుమారు రూ.10కోట్ల వరకూ వెచ్చించారు. ఇందులో శ్రీదేవి, భూదేవి సహిత విగ్రహాలతో పాటు మహాభారత, రామాయణ ఘట్టాలను తెలిపే వివిధ శిల్పాలను ఏర్పాటు చేశారు. వివిధ దేవతా విగ్రహాలను రాజస్థాన్, తిరుపతి నుంచి తీసుకుకొచ్చి ప్రతిష్ఠించారు. గతేడాది జూలైలో ఆలయాన్ని ప్రారంభించారు. స్థానికులు దీనిని 'చిన్న తిరుపతి'గా పిలుచుకుంటున్నారు. సోషల్ మీడియాలో బాగా ప్రచారం జరడంతో జనం రాక కూడా పెరిగింది.

మహిళలే ఎక్కువ...

శనివారం సుమారు పాతికవేల మంది భక్తులు రాగా... వారిలో అత్యధికులు మహిళలే. పూర్తిగా ప్రైవేటు ఆలయం కావడంతో అధికార యంత్రాంగం ముందస్తుగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. బందోబస్తు కోసం ఆలయ నిర్వాహకుల నుంచీ ఎలాంటి అభ్యర్థనా అందలేదు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు కూడా లేవు. తొక్కిసలాట ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీరియస్‌గా తీసుకుంటాం: చంద్రబాబు

కాశీబుగ్గలో ఆలయంలో తొక్కిసలాటపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ సంఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "కాశీబుగ్గలో ఒక ప్రైవేటు వ్యక్తి వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించారు. కార్తీకమాసం సందర్భంగా చాలా మంది దర్శనానికి వెళ్లారు. పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే బందోబస్తు పెట్టేవాళ్లం. తొక్కిసలాటలో అమాయకులు చనిపోయారు. విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశిస్తున్నా. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో జరగడానికి వీలులేదు. తొక్కిసలాటలో చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అని తెలిపారు.

బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై మానవ హక్కుల కమిషన్ సీరియస్..

- 24లోపు సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌కు ఆదేశాలు
- హాస్టల్ వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు : కలెక్టర్

గద్వాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ధర్మవరంలోని బీసీ హాస్టల్‌లో కలుషితాహారం వల్ల 55 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. వివిధ దినపత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ ఘటన ఆహార భద్రత, పరిశుభ్రత, పర్యవేక్షణలో తీవ్ర లోపాలను సూచిస్తోందని పేర్కొంది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి ఈనెల 24లోపు నివేదికను సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మానవహక్కుల కమిషన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ జయరాములును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. వసతి గృహ నిర్వహణ సజావుగా సాగేందుకు అలంపూర్ హాస్టల్ వార్డెన్ శేఖర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. చికిత్స అనంతరం 33 మంది విద్యార్థులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారని తెలిపారు. కాగా, ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలోనూ ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు ఇంటర్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని కూడా గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



సొసైటీ కార్యాలయంలో కోర్టు నోటీసులు అతికిస్తున్న అధికారులు

రుద్రమదేవి సొసైటీ పాలకవర్గం రద్దు

- రూ.7 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ
- ఆరుగురు ఉద్యోగుల తొలగింపు.. సహకార ట్రైబ్యునల్ తీర్పు

జనగామ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని రుద్రమదేవి మహిళా సహకార సొసైటీలో రూ.7.09 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు సహకార ట్రైబ్యునల్ నిర్ధారించింది. సొసైటీ పాలక మండలిని రద్దు చేసింది.. ఆరుగురు ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ గత నెల 24న తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో సొసైటీ కార్యనిర్వాహకురాలిగా జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దివ్యను నియమించగా ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. వివరాలు.. జనగామ మండలం వడ్లకొండ శివారులో భూమి కొనుగోలు పేరుతో సొసైటీ నిధుల్లో అక్రమాలు జరిగాయని గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై జిల్లా సహకార శాఖాధికారి వరంగల్ సహకార ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్రమాలు జరిగినట్లు రుజువు కావడంతో సొసైటీ సీఈవో, అధ్యక్షురాలు, కార్యదర్శి, మాజీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యుల నుంచి రూ. 7,09,87,608 మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రికవరీలో భాగంగా వారి వ్యక్తిగత ఆస్తులను అటాచ్ చేసుకోవచ్చని సూచించింది.

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్
కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్: U40109TG2000SGC034119
సంక్షిప్త టెండరు ప్రకటన నం.03/25-26.
స్పెసిఫికేషన్ నంబర్లు 13 TO 20/2025-26 of CE/P&MM/NPDCL/SE/Civil తో
పని పేరు: ఇంతకుముందు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మరియు నిజామాబాద్ సర్కిళ్లకు 8.0m/140Kg మరియు 11.0m/400kg PSCC పోల్స్ తయారీ మరియు సరఫరా. సవివరమైన టెండరు ప్రకటనకు సంబంధించి తదుపరి వివరాల కొరకు www.tgnpdcl.in & www.tender.telangana.gov.in ను దర్శించగలరు.
సం/- చీఫ్ ఇంజనీర్/P&MM NPDCL/వరంగల్
DIPR RO.No: 10102-PP/CL/ADVT/1/2025-26, తేది: 01.11.2025

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం
P.I.U. డివిజన్, మహబూబ్‌నగర్ జిల్లా
టెండరు ప్రకటన
Lr. No: TO/205-224/2025-26, తేది: 31.10.2025
మహబూబ్‌నగర్ జిల్లాలో బాలానగర్ మండలం (06), భూత్పూర్ మండలం(1), సిసి కుంట మండలం (02), రాజాపూర్ మండలం(01), మహబూబ్‌నగర్ మండలం (10), హన్వాడ మండలం (02)లో మొత్తం 21 నంబర్ల పనులు. మొత్తం ECV రూ.176.78 లక్షలు. టెండరు ప్రకటన ప్రారంభ తేది. 04.11.2025 నుండి 14.11.2025 వరకు. తెరకు తేది. 15.11.2025.
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ PIU డివిజన్, మహబూబ్ నగర్
DIPR RO.No: 10097-PP/CL/ADVT/1/2025-26, తేది: 01.11.2025

తెలంగాణ ప్రభుత్వం::పోలీస్ శాఖ
అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆపరేషన్స్ (ఆక్టోపస్ & గ్రేహౌండ్స్) కార్యాలయం, తెలంగాణ, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc. No. OCTOPU-SSEC/STRE/IETS/1/2025-S SECTION తేది:31.10.2025
తెలంగాణ, హైదరాబాద్, పోలీస్ శాఖ, ఆక్టోపస్ కు దిగువ ఐటమ్ సరఫరా కొరకు తయారీదారులు మరియు టెండరు నిర్దిష్ట అధీకృత డీలర్లు/పంపిణీదారుల నుండి ఇ-టెండరు కోరబడుచున్నది.

క్ర. సం.	గ్రూప్	ఐటమ్ కోడ్	టెండరు నం.	సరఫరా చేయవలసిన ఆర్టికల్ పేరు	అవసరమైన సరుకు పరిమాణం
1	ఆపరేషనల్ & ట్రైనింగ్ ఎక్విప్‌మెంట్	OSE/01	Rc.No.OCTOPU-SSEC/STRE/IETS/1/2025	బుల్లెట్ రెసిస్టెంట్ జాకెట్ల సరఫరా	100 సం.లు
2		OSE/02	Rc.No.OCTOPU-SSEC/STRE/IETS/2/2025	బుల్లెట్ రెసిస్టెంట్ హెల్మెట్ల సరఫరా	100 సం.లు

టెండరు విధానం మూడు-బిడ్ విధానం అనగా "ప్రీ-క్వాలిఫికేషన్ బిడ్", "టెక్నికల్ బిడ్" మరియు "వాణిజ్య / ఆర్థిక బిడ్". టెండరు షెడ్యూల్ ఫారమ్ మరియు కాంట్రాక్టు నిబంధనలు 04.11.2025/10:30 గం.ల నుండి 24.11.2025/14:30 గం.ల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (www.tender.telangana.gov.in) నుండి పొందవచ్చును. బిడ్డర్లు ఇ-టెండర్ ప్రాసెసింగ్ ఛార్జీల కోసం రూ.200/- (రూపాయలు రెండు వందలు మాత్రమే) డిమాండ్ డ్రాఫ్టును అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆక్టోపస్, తెలంగాణ, హైదరాబాద్ పేరున పంపవలెను మరియు 24.11.2025/17:00 గం.ల ముందు ఇ-టెండర్లను దాఖలు చేయవలెను.
సం/- అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆపరేషన్స్ (ఆక్టోపస్ & గ్రేహౌండ్స్) తెలంగాణ, హైదరాబాద్
DIPR RO No.10104-PP/CL/ADVT/1/2025-26 తేది:01.11.2025

ఆడ గొంతుతో వలపు వల విసిరి..

- నగదు వసూళ్లు.. క్షుద్ర పూజల పేరిట మరికొందరికి టోపీ
- సూర్యాపేటకు చెందిన ఓ ముఠా అరెస్టు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జల్సాగా తిరిగేందుకు కావాల్సిన డబ్బు కోసం అడ్డదారులు తొక్కిన ఓ నలుగురు.. యువకులతో ఆడ గొంతుతో మాట్లాడి వలపు విసిరి అందినకాడికి దోచుకున్నారు. అంతేనా.. క్షుద్ర పూజలు చేస్తామంటూ వీడియో కాల్స్ ద్వారా మరికొందరిని బురిడి కొట్టించారు. సూర్యాపేట కేంద్రంగా ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్న మాలోత్ మంజి, భూక్య గణేష్, రూపవత్ శ్రావణ్ కుమార్, మరో బాలుడిని ఆదిలాబాద్ పోలీసులు ఇటీవల ఓ కేసులో అరెస్టు చేశారు. ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డితో పాటు బెంగళూరులో కూడా వీరి బాధితులు ఉన్నట్టు తేలింది. ఇందుకు సంబంధించి ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి విలేకరులకు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన లక్ష్మీకాంత్ ఆన్‌లైన్‌లో పెళ్లి సంబంధాలు వెతుక్కుంటున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీకాంత్‌ను సంప్రదించిన శ్రావణ్ కుమార్ తానో మ్యారేజీ బ్యూరో వ్యక్తినని, తన వద్ద సంబంధాలున్నాయని చెప్పి కృష్ణవేణి అనే పేరుతో ఓ అమ్మాయి ఫొటోను పంపాడు. అనంతరం నిందితుల్లో ఒకరైన మంజి అమ్మాయి గొంతుతో కృష్ణవేణిని అంటూ లక్ష్మీకాంత్‌తో మాట్లాడి దగ్గరయ్యాడు. ఆపై, కృష్ణవేణి అనే మాయలో పడిన లక్ష్మీకాంత్ నుంచి నిందితులు విడతల వారీగా రూ.8లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన లక్ష్మీకాంత్ అక్టోబరు 25న పోలీసులను ఆశ్రయించగా వారు సూర్యాపేటకు చెందిన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మెదక్ జిల్లాకు చెందిన సంతోష్ అనే వ్యక్తితో ఫోన్‌లో అమ్మాయి గొంతుతో మాట్లాడి రూ.48వేలు కాజేసినట్టు తెలిసింది. అలాగే, కామారెడ్డి జిల్లా లింగంపేటకు చెందిన రాములు అనే వ్యక్తి దగ్గర రూ.1.08లక్షలు కొట్టేసినట్టు, బెంగళూరుకు చెందిన మరొకరిని కూడా మోసగించినట్టు తేలింది. ఇక, మంత్రగాళ్ల వేషాలు వేసుకొని ఆన్‌లైన్‌లో క్షుద్రపూజలు పేరిట మరికొందరిని మోసగించిన విషయం కూడా బయటపడింది.

సామినేని హత్య సుపారీ గ్యాంగ్ పనేనా?

- పోలీసుల అనుమానం.. దర్యాప్తు ముమ్మరం

చింతకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీపీఎం సీనియర్ నాయకుడు సామినేని రామారావు హత్య సుపారీ గ్యాంగ్ పని అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన సామినేని రామారావు శుక్రవారం తన ఇంటి వద్దే హత్యకు గురయ్యారు. ఈ కేసు విషయంలో నిర్లక్ష్యం వద్దని, హంతకులను పట్టుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కేసును సవాలుగా తీసుకున్న ఖమ్మం జిల్లా పోలీసులు.. వివిధ కోణాల్లో తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. సుపారీ తీసుకుని హత్యలు చేసే ముఠాకు చెందిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక, దర్యాప్తులో భాగంగా పాతర్లపాడుతోపాటు పరిసర గ్రామాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు కీలక ఆధారాలు సేకరించినట్టు తెలిసింది. హత్యకు రెండు, మూడు రోజుల ముందు అపరిచిత వ్యక్తుల పాతర్లపాడులో సంచరించినట్టు గుర్తించారని సమాచారం. ఇక, ఓ అపరిచిత యువకుడు పాతర్లపాడులో గంటల కొద్దీ కూర్చొని రెక్కీ నిర్వహించాడని ఆ గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా, రామారావు హత్య నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాతర్లపాడులో పోలీసు పహారా ఏర్పాటు చేశారు.


పంట దెబ్బతిన్నదని రైతు ఆత్మహత్య

- ఆసిఫాబాద్ జిల్లా చింతకుంటలో ఘటన

సిర్పూర్(టి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంట దెబ్బతిన్నదన్న మనస్తాపంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం చింతకుంట గ్రామానికి చెందిన రైతు పిట్టల కిష్టయ్య(65) బలవన్మరణానికి పాల్పడ్డాడు. కిష్టయ్య తనకు ఉన్న నాలుగున్న ఎకరాల్లో పత్తి పంట వేశాడు. మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు పంట చేనులో నీరు చేరింది. పత్తి మొక్కలు కుళ్లిపోవడంతో పంట నష్టం జరిగిందని మనస్తాపం చెందాడు. శుక్రవారం సాయంత్రం చేను వద్దకు వెళ్లిన కిష్టయ్య పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకులు కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కిష్టయ్య భార్య దుర్గమ్మ శనివారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

42% రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- ఇందుకోసం బీసీలంతా ఐక్య పోరాటాలు చేయాలి
- ఇందిరాపార్కు వద్ద 24 గంటల దీక్షలో వక్తలు
- మద్దతు ప్రకటించిన దత్తాత్రేయ, మధుసూదనాచారి



దీక్షలో పాల్గొని మద్దతు తెలియజేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరరలు

కవాడిగూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీ జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే, ఆ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో తప్పనిసరిగా చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఇందుకోసం బీసీలంతా పార్టీలకతీతంగా ఏకమై, ఐక్యంగా పోరాటాలు చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రసత్యనారాయణ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో 24 గంటల దీక్షను చేపట్టారు. ఈ దీక్షను మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి ప్రారంభించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జస్టిస్ చంద్రకుమార్, మాజీ మంత్రి రాజేషం గౌడ్, తెలంగాణ బీసీ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పలు బీసీ సంఘాల నేతలు, న్యాయవాదులు హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని, దీనికి కేవలం అసెంబ్లీ తీర్మానం సరిపోదని పార్లమెంటులో చట్టం కావాలన్నారు. తాను బీజేపీ సీనియర్ నేతగా పార్లమెంటులో ఈ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ స్పీకర్ మధుసుధనాచారి మాట్లాడుతూ, 42 శాతం రిజర్వేషన్లను బీసీలంతా ఐకమత్యంగా ఉద్యమాలు చేసి సాధించుకోవాలని, ఈ పోరాటంలో బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన స్పష్టం చేశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, దేశాన్ని పాలించే మనువాద పార్టీలు అగ్రవర్ణాలకు పెద్దపీట వేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు

నాపై ఒత్తిడి చేయడానికి ప్రయత్నించారు

- న్యాయమూర్తుల కుటుంబాలపైనా రాజకీయ కుట్రలు
- అధికారం మారినప్పుడల్లా విధానాలు మార్చరాదు
- వీఐటీ స్నాతకోత్సవంలో జస్టిస్ ఎన్‌వీ రమణ



అమరావతిలో జరిగిన వీఐటీ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ ఎన్‌వీ రమణ

తుళ్లూరు/తాడికొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): "మీ అందరికీ తెలుసు.. నా కుటుంబాన్ని ఎలా లక్ష్యంగా చేసుకున్నారో.. వారిపై క్రిమినల్ కేసులు పెట్టారు. నాపై ఒత్తిడి చేయడానికి ప్రయత్నించారు. రాజ్యాంగ సూత్రాలను సమర్థించిన న్యాయవ్యవస్థ సభ్యులు బదిలీలు, ఒత్తిడిని ఎదుర్కొన్నారు. న్యాయమూర్తుల కుటుంబాలు రాజకీయ కుట్రలకు లక్ష్యంగా మారాయి. దక్షిణ భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అతిపెద్ద ఉద్యమం అమరావతి రైతుల పోరాటం. అధికారం మారినప్పుడల్లా విధానాలకు అంతరాయం కలిగించడం తప్పు. అది అభివృద్ధిని కుంగదీస్తుంది. దేశంలో చట్టబద్ధమైన పాలన ఉన్నప్పుడే అభివృద్ధి జరుగుతుంది" అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. శనివారం రాజధాని అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ ఎన్‌వీ రమణ పాల్గొని ప్రసంగించారు. "ఐదేళ్ల పోరాడి వివిధ సవాళ్లను ఎదుర్కొని ఇక్కడ సంస్థను నిలబెట్టిన వీఐటీ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను." అని అన్నారు. "రాజకీయాల్లోనూ, సామాజిక ఉద్యమాల్లోనూ యువత చురుగ్గా పాల్గొనాలి. లేకపోతే దేశాన్ని నిజాయతీ లేని, స్వార్థపరులైన పాలకులు పాలిస్తారు. యువత కొత్త సందేశాలు, ఈ-మెయిల్‌లు, వార్తలు, నోటిఫికేషన్లు, లైక్‌ల కోసం ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి ఫోన్లు చూసుకోవడానికి పరిమితమవుతున్నారు. సోషల్ మీడియాకు బానిసలైన వ్యక్తులు ఇబ్బంది పడుతున్నారు. స్క్రీన్‌లను మితంగా ఉపయోగించాలి" అని జస్టిస్ ఎన్‌వీ రమణ సూచించారు. అనంతరం పీహెచ్‌డీ, పీజీ, డిగ్రీలు, గోల్డ్‌మెడల్స్ సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వీఐటీ వ్యవస్థాపకుడు-చాన్సలర్ డాక్టర్ జీ విశ్వనాథన్, బెంగళూరు శ్యామ్సంగ్ ఎలక్ట్రానిక్స్ సీనియర్ డైరెక్టర్ రాజీవ్‌వర్మ, వీఐటీ వైస్ ప్రెసిడెంట్‌లు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీసెల్వం, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్‌వీకోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్‌చంద్ర ముదిగంటి పాల్గొన్నారు.

పిల్లర్ గుంతలో పడి చిన్నారి మృతి

- నిర్మల్ జిల్లాలో ఘటన

పెంబి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా పెంబి మండలం వేణునగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆత్రం రేణుక, రాముల దంపతుల కూతురు పుష్ప(5) శనివారం సాయంత్రం మూడున్నర గంటల ప్రాంతంలో ఆడుకుంటుండగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ గుంతలో పడిపోయింది. ఆలస్యంగా గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

भारतीय कपास निगम लिमिटेड, शाखा कार्यालय, वारंगल
THE COTTON CORPORATION OF INDIA LTD
(A Government of India Undertaking - Ministry of Textiles)
Branch Office : #16-10-52, Yele's Heights, Shivanagar, Beside Sai Convention, Near Warangal Railway Station Gate, Platform No.3, Warangal - 506 002 (T.G.). Email : warangal@cotcorp.com
Dt:01-11-2025
పత్తి రైతులకు విజ్ఞప్తి
ప్రస్తుత పత్తి మార్కెటింగ్ సీజన్ 2025-26లో, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI) పత్తి రైతుల కోసం "కపాస్ కిసాన్ మొబైల్ యాప్"ను ప్రారంభించింది. దీని ద్వారా రైతుల మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉన్న సమీపంలోని కొనుగోలు కేంద్రం/నోటిఫైడ్ ఫ్యాక్టరీలో స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా కనీస మద్దతు ధర (MSP) పథకం కింద తమ పత్తిని అమ్మవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో, రైతుల భూమి రికార్డులను రాష్ట్ర సొంత వ్యవస్థ ద్వారా డిజిటలైజ్ చేశారు. అందువల్ల రైతులకు స్లాట్ బుకింగ్ ముందు వారి రిజిస్ట్రేషన్‌ను తనిఖీ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పత్తిలో తేమ 8% మించకపోతే, నాణ్యతా ప్రమాణాల ప్రకారం రైతులకు పూర్తి కనీస మద్దతు ధర (MSP) చెల్లించబడుతుంది. అయితే, తేమ శాతం 8% మించి 12%కి చేరుకుంటే, 8% కంటే ఎక్కువ తేమ శాతం నిష్పత్తిలో మొత్తాన్ని తగ్గించిన తర్వాత MSP చెల్లించబడుతుంది. అందువల్ల అధిక తేమ కారణంగా తగ్గింపు ఉండకుండా ఉండటానికి, పత్తిని ఎండబెట్టిన తర్వాతే కేంద్రానికి తీసుకురావాలని కార్పొరేషన్ అందరు పత్తి రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అయితే, ఎట్టి పరిస్థితుల్లోను పత్తిలో తేమ శాతం 12% కంటే ఎక్కువ తేమ వుండరాదు. ఏదైనా సహాయం అవసరమైతే, రైతులకు CCI బ్రాంచ్ ఆఫీస్, వరంగల్‌లోని వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 9440587833ను సంప్రదించవచ్చు.
Sd/- Branch Head

KUDA
హనుమకొండ-వరంగల్ నగరం (బాలసముద్రం)లో
ప్రైమ్ ల్యాండ్ బహిరంగ వేలం
Government of Telangana | Kakatiya Urban Development Authority Warangal
హైద్రాబాద్ తరువాత అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న
Heritage City
మహా నగరంలో ప్రధానమైన స్థల వేలం
Auction>>@
18°00'07"N 79°33'47"E
12,957 Sq. yds (Ac 2. 27 Gts)
అత్యంత అనువైన ప్రదేశం :
విస్తీర్ణం: 2 ఎకరాల 27 గుంటలు
లొకేషన్: బాలసముద్రం, హనుమకొండ.
Auction Date: 14-11-2025 Venue : KUDA Office
హనుమకొండ బస్ స్టేషన్‌కు అతి దగ్గరలో..
50 ఫీట్లు రోడ్డు అనుకొని వాణిజ్య, షాపింగ్ మాల్స్, హోటల్స్, హాస్పిటల్స్, విద్యా సంస్థలకు, IT కంపెనీ మరియు కార్యాలయాలకు అనువైన స్థలం
Sd/- Smt. Chahat Bajpai, IAS Vice-Chairman

For more Details: 9866514550, 9440374866, 7337222469, 7702552226 www.kuda.in

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ ఆర్కే RK

జగన్ తన గురించి ఎంత గొప్పగా ఊహించుకుంటారో.. ఆయనని అభిమానించేవారు కూడా అదే విధంగా ఆయన గురించి గొప్పగా ప్రచారం చేస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ మూక అంతా ఊహాలోకంలో విహరిస్తుంటారు. నిజానికి జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వారికి పెద్దగా ఒరిగింది ఏమైనా ఉందా అంటే అది కూడా కనిపించదు. శరభ శరభ అని కీర్తించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులపై బురద చల్లినందుకు మహా అయితే నెలవారీ చెల్లింపులు అందుతూ ఉండొచ్చు. తనను తాను జగన్ ఎలా ఊహించుకుంటారో ఆయన మద్దతుదారులు కూడా అలానే తలచుకొని పోస్టులు పెడతారు. మొత్తంగా జగన్‌రెడ్డి అనే అతను ఒక అసాధారణ వ్యక్తి అని వారంతా నమ్ముతారు. జగన్ లాంటి వాడు మళ్లీ పుట్టడని కూడా ప్రచారం చేస్తారు. ఒక రకంగా ఇది నిజమే. నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణాలు ముదిరిన జగన్ లాంటి వాడు మళ్లీ ఎప్పుడు పుడతాడో చెప్పలేం!

నార్సిసిస్టిక్... జగన్!

"ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సృష్టించిన విపత్తు ఈ మొంథా తుపాను" అని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అదే సమయంలో "ముఖ్యమంత్రిగా లేకపోయినా తుపాను నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు జగన్‌రెడ్డి" అని తన సొంత మీడియాలో ప్రచారం చేయించుకున్నారు. సాధారణ ప్రజలకు ఈ రెండు వ్యాఖ్యానాలు వింతగా అనిపిస్తాయి. మొంథా తుపానును చంద్రబాబు సృష్టించడం ఏమిటి? ప్రకృతి విపత్తు సంభవించి ప్రజలు అవస్థలు పడాలని చంద్రబాబే కాదు– జగన్‌రెడ్డి కూడా కోరుకోరు కదా! అదే సమయంలో ముఖ్యమంత్రిగా లేకపోయినా ఈ విపత్తు నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు అని తనకు తానే కితాబు ఇప్పించుకోవడం వింతల్లోకెల్లా వింత. నిజానికి తుపాను తీరం దాటినప్పుడు ఆయన రాష్ట్రంలోనే లేరు. బెంగళూరులో ఉన్నారు. తుపాను ముప్పు తగ్గిన తర్వాత రాష్ట్రానికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును కాసేపు తిట్టి మళ్లీ బెంగళూరు వెళ్లిపోయారు. గత ఏడాది బుడమేరుకు వరద వచ్చినప్పుడు కూడా జగన్‌రెడ్డి 'ఇది మనిషి సృష్టించిన విపత్తు' అని విమర్శించారు. జగన్‌రెడ్డి ప్రవర్తన చూసిన వారికి వింతగా ఉంటుంది. దీన్ని లోతుగా అధ్యయనం చేస్తే ఆయన 'నార్సిసిస్టిక్ డిజార్డర్' అనే మానసిక సమస్యతో బాధపడుతున్నట్టు స్పష్టమవుతుంది. అంతర్జాతీయంగా పేరొందిన అమెరికాలోని మెయో క్లినిక్ ఈ వ్యాధి ఉన్న వారిలో కనిపించే లక్షణాలను స్పష్టంగా నిర్వచించింది. ఈ వ్యాధి లక్షణాలలో ప్రముఖమైనది... ఒక వ్యక్తి తనకు తాను గొప్పవాడిగా భావిస్తూ అధిక ప్రాముఖ్యత ఇచ్చుకోవడం, దీనితోపాటు విపరీతమైన అహంభావం కలిగి ఉండటం! అర్హత లేని సందర్భాలలో కూడా తనను గొప్పగా ఊహించుకొని తనను తాను ప్రేమించుకుంటూ ఇతరులు కూడా తనను అభినందించాలని, సన్మానించడం ద్వారా గుర్తించాలని కోరుకుంటారు. ఇతరుల పట్ల కనీస సానుభూతి ఉండదు. తనను ప్రతి ఒక్కరూ నిరంతరం ప్రశంసించాలని కోరుకుంటూ తన గొప్పతనాన్ని అతిగా ఊహించుకుంటారు. తానొక ప్రత్యేకమైన వ్యక్తినని, ప్రత్యేక గౌరవానికి అర్హుడనని నమ్ముతూ మితిమీరిన ప్రశంసలకోసం ఎదురుచూస్తుంటారు. ఇతరులు ఏమనుకుంటారో అన్న చింత ఉండదు. అపరిమిత విజయాలను సాధించానని, అంతులేని అధికారం అనుభవిస్తున్నానని, అందగాడినని–మొత్తంగా తానొక ప్రత్యేకమైన వ్యక్తినని ఊహాలోకంలో విహరిస్తుంటారు. తాను చేసిన పనులను అసాధారణ ఘనకార్యాలుగా మిగతా వారంతా భావించాలని, తాను ఏమి చేసినా, చెప్పినా ఇతరులు ప్రశ్నించకుండా అనుసరించాలని కోరుకుంటారు. ఇతరుల అవసరాలు, మనోభావాలు వారికి పట్టవు. తనను ప్రత్యేకమైన వాడిగా గుర్తించని వారినందరినీ శత్రువులుగా భావిస్తారు. అలాంటి వారి పట్ల దురుసుగా వ్యవహరిస్తారు. తమకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించనప్పుడు వారికి కోపం వస్తుంది. సహనం నశిస్తుంది. ఇలా చెప్పుకొంటూ పోతే సాధారణ మనుషులలో కనిపించని అనేక లక్షణాలు ఈ వ్యాధితో బాధపడుతున్న వారిలో ఉంటాయి. వైద్య పరిభాషలో ఇదొక తీవ్రమైన మానసిక సమస్య. దీనికి మందులు కూడా ఉండవు. ఈ సమస్యతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండటమే మందు అని వైద్యులు చమత్కరిస్తుంటారు.


జగన్ చేతలు...

జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చే వరకు అతని గురించి ప్రజలకు తెలియదు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత అతడి ప్రవర్తనను గమనిస్తే... తనలో నార్సిసిస్టిక్ డిజార్డర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఎవరైనా అంగీకరించాల్సిందే! ముఖ్యమంత్రి అయిన కొత్తలో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనే వారితో 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసేవారు. తాను ధరించిన టోపీలపై కూడా 'సీఎం సర్' అని రాసి ఉండటం చూశాం. ఈ దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పని చేశారు. వాళ్లెవ్వరూ 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసుకోలేదు. అంటే, జగన్‌రెడ్డి మాత్రమే ముఖ్యమంత్రిగా తాను ప్రత్యేకమని, ప్రజలందరూ తనను అభిమానించి ప్రత్యేకంగా గుర్తించి గౌరవించాలని కోరుకున్నారన్న మాట! తన మాటకు ఎదురు చెప్పిన వారిని ఆయన దారుణంగా అవమానించేవారు. బహుశా ఈ కారణం వల్లనే కాబోలు అఖిల భారత సర్వీసు అధికారులు సైతం ఆయన ముందు మోకరిల్లేవారు. ఇది కూడా ఆ వ్యాధి లక్షణమే! నిన్నగాక మొన్న వైద్య కళాశాలలను పీపీపీ మోడల్లో నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శిస్తూ... అధికారంలో ఉన్నప్పుడు తాము నిర్మించిన వైద్య కళాశాల భవనాలను చూసిన వారంతా 'ఆహా' అని మెచ్చుకోవాలని, తనకు శాలువాలు కప్పి సత్కరించాలని చెప్పుకొచ్చారు. ఇది కూడా సదరు మానసిక సమస్యతో బాధపడుతున్న వారిలో కలిగే భావనే. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నంతకాలం ఇలాంటి సందర్భాలను ఎన్నింటినో చూశాం! ఇప్పుడు అధికారం కోల్పోయినప్పటికీ... తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని, ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారని తాను నమ్ముతూ, అందర్నీ నమ్మవలసిందిగా కోరుతున్నారు. ఇది కూడా నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణమే. తమాషా ఏమిటంటే, జగన్‌రెడ్డిలో కనిపిస్తున్న వ్యాధి లక్షణాలు ఆయన చుట్టూ ఉన్న వారిలోనూ కనిపిస్తున్నాయి. కాకపోతే తక్కువ స్థాయిలో! జగన్ తన గురించి ఎంత గొప్పగా ఊహించుకుంటారో.. ఆయనని అభిమానించేవారు కూడా అదే విధంగా ఆయన గురించి గొప్పగా ప్రచారం చేస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ మూక అంతా ఊహాలోకంలో విహరిస్తుంటారు. నిజానికి జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వారికి పెద్దగా ఒరిగింది ఏమైనా ఉందా అంటే అది కూడా కనిపించదు. శరభ శరభ అని కీర్తించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులపై బురద చల్లినందుకు మహా అయితే నెలవారీ చెల్లింపులు అందుతూ ఉండొచ్చు. సోషల్ మీడియాలో జగన్ మద్దతుదారులు పెడుతున్న పోస్టులను చూస్తే ఆయన తల్లి విజయమ్మకు కూడా నా బిడ్డలో ఇన్ని అసాధారణ లక్షణాలు ఉన్నాయా అన్న అనుమానం కలగకమానదు. తనను తాను జగన్ ఎలా ఊహించుకుంటారో ఆయన మద్దతుదారులు కూడా అలానే తలచుకొని పోస్టులు పెడతారు. మొత్తంగా జగన్‌రెడ్డి అనే అతను ఒక అసాధారణ వ్యక్తి అని వారంతా నమ్ముతారు. జగన్ లాంటి వాడు మళ్లీ పుట్టడని కూడా ప్రచారం చేస్తారు. ఒక రకంగా ఇది నిజమే. నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణాలు ముదిరిన జగన్ లాంటి వాడు మళ్లీ ఎప్పుడు పుడతాడో చెప్పలేం!

ఆయనేం చేసినట్లు?

ఇప్పుడు మొంథా తుపాను గురించి జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల విషయానికి వద్దాం! ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన ప్రజలను ప్రభుత్వాలు మరింత మెరుగ్గా ఆదుకోవాలని కోరడం లేదా బాధితులకు సహాయం చేయడంలోగానీ, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలోగానీ విఫలమయ్యారని విమర్శించడం సహజం. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారే ప్రకృతి విపత్తు సంభవించింది. అప్పుడు ఆయన పెద్దగా హైరానా పడలేదు. 'నేను ప్రార్థన బాగా చేస్తాను. అయినా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే మనం ఏం చేయగలం? జరిగేది ఏదో జరుగుతుంది' అని నిర్వేదంగా వ్యాఖ్యానించారు. రైతులు, ఇతర బాధితులలో మనోధైర్యం కల్పించే ప్రయత్నం కూడా చేయలేదు. అంతా విధి లిఖితం అని సరిపెట్టుకోమన్నారు. ఇప్పుడు అదే మనిషి మొంథా తుపాను ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన విపత్తు అని అలవోకగా అనేశారు. నార్సిసిస్టిక్ వ్యాధి ఉన్నవారు ఇతరులను కించపరుస్తారని వైద్యులు చెబుతారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డిలో ఆ లక్షణం ఉన్నట్టే కదా? ఏ ముఖ్యమంత్రి అయినా ప్రకృతి వైపరీత్యాలు సంభవించాలని కోరుకుంటారా? లేదా విపత్తులను సృష్టిస్తారా? ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అవినీతి జరిగిందని విన్నాం. శవాలపై పైసలు ఏరుకోవడం చూశాం. అంతేగానీ తుఫానులకు ఫలానా ముఖ్యమంత్రి కారణం అని ఇంతవరకు ఎవరూ విమర్శించలేదు. ఇప్పుడు జగన్ మీడియా, ఆయన సోషల్ మీడియా చేసిన, చేస్తున్న ప్రచారం విషయానికి వద్దాం! ముఖ్యమంత్రిగా లేకపోయినా తుఫాను నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు జగన్ అని కీర్తించుకోవడం ఏమిటి? తుపాను అనంతరం జరిగిన సహాయక చర్యలలో జగన్ పాత్ర ఏముంది? ప్రజలను ఎలా కాపాడారు? ఇలా భావించడం కూడా నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణమే. అర్హత లేకపోయినా తనకు తాను అధిక ప్రాధాన్యత ఇచ్చుకోవడం, తనను అందరూ ప్రశంసించాలని, సన్మానించాలని కోరుకోవడం ఈ వ్యాధి లక్షణాలే కదా! జగనన్న లాంటి సంకల్పం ఉంటే సూర్యుడైనా సలాం కొట్టాల్సిందేనట! మొంథా తుపానుకు ముందూ వెనుకా జగన్‌రెడ్డి పాత్ర సున్నా! తుపాను రాష్ట్రంపై విరుచుకుపడినప్పుడు ఆయన అసలు ఏపీలోనే లేరు. తుపాను తీరం దాటి శాంతించిన తర్వాత మాత్రమే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. ఒక్కరోజు అక్కడే ఉన్నప్పటికీ... అడుగు బయటపెట్టకుండా శుక్రవారం నాడే బెంగళూరు వెళ్లిపోయారు. అంటే తన పాత్ర ఏమీ లేని సందర్భాలలో కూడా ఆయన తనకు తాను భుజకీర్తులు తగిలించుకుంటారన్నమాట! ఇతరులతో కీర్తింపజేసుకుంటారన్నమాట! ఏఐ అంటే ఏమిటో జగన్ ఆ మధ్య తేల్చిపడేశారు. డేటా సెంటర్ నుంచి డేటా తీసుకొని, దానికి మైండ్ అప్లై చేస్తే అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవుతుందని చెప్పి నవ్వులపాలు అయ్యారు. దీనిపై పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారుగానీ, అలా చెప్పగలగడం కూడా ఈ వ్యాధి లక్షణమే. తనకు తెలియని అంశం ఏదీ ఉండదని, ఏ విషయమైనా అలవోకగా చెప్పేయగలమన్న మితిమీరిన ఆత్మవిశ్వాసం ఈ వ్యాధి ఉన్న వారికి ఉంటుంది.

> **మొంథా తుఫానుకు ముందూ వెనుకా జగన్‌రెడ్డి పాత్ర సున్నా! తుఫాను రాష్ట్రంపై విరుచుకుపడినప్పుడు ఆయన అసలు ఏపీలోనే లేరు. తుఫాను తీరం దాటి శాంతించిన తర్వాత మాత్రమే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. ఒక్కరోజు అక్కడే ఉన్నప్పటికీ... అడుగు బయటపెట్టకుండా శుక్రవారం నాడే బెంగళూరు వెళ్లిపోయారు. అంటే తన పాత్ర ఏమీ లేని సందర్భాలలో కూడా ఆయన తనకు తాను భుజకీర్తులు తగిలించుకుంటారన్నమాట!**



> **జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత అతడి ప్రవర్తనను గమనిస్తే... తనలో నార్సిసిస్టిక్ డిజార్డర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఎవరైనా అంగీకరించాల్సిందే! ముఖ్యమంత్రి అయిన కొత్తలో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనే వారితో 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసేవారు. తాను ధరించిన టోపీలపై కూడా 'సీఎం సర్' అని రాసి ఉండటం చూశాం. ఈ దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వాళ్లెవ్వరూ 'సీఎం సర్' అన్న ప్లకార్డులు ప్రదర్శింపజేసుకోలేదు. అంటే, జగన్‌రెడ్డి మాత్రమే ముఖ్యమంత్రిగా తాను ప్రత్యేకమని, ప్రజలందరూ తనను అభిమానించి ప్రత్యేకంగా గుర్తించి గౌరవించాలని కోరుకున్నారన్నమాట! తన మాటకు ఎదురు చెప్పిన వారిని ఆయన దారుణంగా అవమానించేవారు. బహుశా ఈ కారణం వల్లనే కాబోలు అఖిల భారత సర్వీసు అధికారులు సైతం ఆయన ముందు మోకరిల్లేవారు. ఇది కూడా ఆ వ్యాధి లక్షణమే!**

సంక్షోభాలే సోపానాలుగా...

చంద్రబాబుపై జగన్ చేసిన విమర్శల విషయానికి వద్దాం! సమకాలీన రాజకీయాలలో సంక్షోభాలను తనకు అనుకూలంగా మలచుకోవడంలో చంద్రబాబు ప్రథమ స్థానంలో ఉంటారు. 1984లో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినప్పుడు చంద్రబాబులోని శక్తియుక్తులు బయటపడ్డాయి. అదే చంద్రబాబు తర్వాత కాలంలో లక్ష్మీపార్వతి కారణంగా పార్టీ సంక్షోభంలోకి జారుకుంటున్నదని గ్రహించి అదే ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేసి పార్టీని, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకొని మూడు దశాబ్దాలుగా ఎన్నో సంక్షోభాలను అధిగమించి పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇక అధికారంలో ఉన్నప్పుడు తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే నిద్రాహారాలు మాని సహాయ పునరావాస చర్యలపై దృష్టి పెడతారు. ఇలాంటి సందర్భాలలో చంద్రబాబు ఒకింత అతి చేస్తారని కొంత మంది భావిస్తారుగానీ... ఆయన అలాంటి సందర్భాలను తనకు లభించిన అవకాశాలుగా స్వీకరిస్తారు. మొంథా తుఫాను సందర్భంలో కూడా ఆయన ఇలాగే పని చేశారు. సాంకేతిక విజ్ఞానం కూడా అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఎప్పటికప్పుడు తుఫాను సమాచారాన్ని అందిస్తూ ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, రహదారులు ధ్వంసం అవడం సర్వసాధారణం. తిరిగి సాధారణ పరిస్థితులు రావడానికి వారం పది రోజులు పట్టేది. ఇప్పుడు ఒక్క రాత్రిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రాత్రికి రాత్రి రహదారులపై కూలిన చెట్లను తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. తుఫాను తాకిడికి గురైన ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని బాహాటంగానే చెబుతున్నారు. ప్రభుత్వ సిబ్బంది నిద్రాహారాలు మాని మరీ పునరుద్ధరణ పనులు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించాలి. ప్రజాభిప్రాయం ఇలా ఉండగా... ముఖ్యమంత్రిని విమర్శించడం, ప్రకృతి విపత్తుకు ఆయనే కారణమని జగన్ నిందించడం వింతగా ఉంది. కూటమి నాయకులు కొంత కాలంగా జగన్‌రెడ్డిని సైకోగా అభివర్ణిస్తున్నారు. ఆయనలో సైకో లక్షణాలు ఉన్నాయా లేదా అన్నది వైద్యులు మాత్రమే నిర్ణయించాలి. అయితే, దాదాపు దశాబ్ద కాలంగా జగన్‌రెడ్డిని గమనిస్తున్న వారికి ఆయనలో నార్సిసిస్టిక్ డిజార్డర్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఇట్టే తెలిసిపోతుంది. అయితే, వైద్యులు ఇప్పటివరకు ఆయనలో ఈ లక్షణాలు ఉన్నాయని గ్రహించలేదు. ఎందుకంటే వారికి ఆ ఊహ కూడా రాలేదు. బహుశా ఈ వ్యాధి లక్షణాల కారణంగానే జగన్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలు కూడా అంతుబట్టకుండా ఉంటాయి. ప్రజాక్షేత్రంలో బలం ఉన్న నాయకులు కూడా ఆయన ముందు చేతులు కట్టుకొని ఎందుకు నిలబడతారో అర్థం అవుతుంది. తానొక అసాధారణ నాయకుడినని ఆయన వారందరినీ నమ్మించి ఉంటారు. ఈ కారణంగానే ఆయన మద్దతుదారులు కనీస వెరపు లేకుండా జగన్ కోసం పనిచేస్తున్నారు. తన మాటకు ఎవరు ఎదురు చెప్పినా ఆయనలో ఆగ్రహం పెల్లుబుకుతుంది. సహనం నశిస్తుంది. ఇతరులలో గొప్ప లక్షణాలు ఉంటే వాటిని గుర్తించి గౌరవించడానికి నార్సిసిస్టిక్ వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిరాకరిస్తారు. బహుశా ఈ కారణంగానే కాబోలు రాజశేఖరరెడ్డి కంటే గొప్ప పాలనను అందిస్తానని తాను అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిని గుర్తించడానికి కూడా జగన్ నిరాకరించారు. చంద్రబాబుపై ద్వేషంతో చీదరించుకుంటారు. తాను తప్ప అన్యులు మంచి చేయరని ఈ వ్యాధి ఉన్నవారు భావిస్తుంటారు కనుకే జగన్‌రెడ్డి కూడా కూటమి పాలనలో ఏపీ సర్వనాశనం అయిందని చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే విమర్శలు మొదలుపెట్టారు. చంద్రబాబు పాలనలో ఒక్కటంటే ఒక్కటీ మంచి పని జరగలేదని తాను నమ్ముతూ ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తన గొప్పతనం ముందు ఇతరులు బలాదూర్ అని నార్సిసిస్టిక్ వ్యాధి ఉన్నవాళ్లు భావిస్తారు. జగన్ విషయంలో ఇప్పుడు జరుగుతున్నది కూడా ఇదే. తాను అధికారంలో ఉన్నప్పుడు ఒక్క తప్పు కూడా చేయలేదని భావించడానికి కూడా ఈ వ్యాధే కారణం. ఉదాహరణకు కాపు, కమ్మ కులస్థుల విషయమే తీసుకుందాం. అధికారంలో ఉన్నప్పుడు ఈ రెండు కులాల వారిని వేటాడి వేధించడం గుర్తు లేదన్నట్టుగా ఇప్పుడు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు. కమ్మ వాళ్లను జాతి శత్రువులుగా భావించిన ఆయన కాపులను కూడా ఆ జాబితాలోకి చేర్చారు. జన సేనాని పవన్ కల్యాణ్ విషయమే తీసుకుందాం. కాపు సామాజికవర్గం అమితంగా ఇష్టపడే ఆయనను ఎన్ని రకాలుగా వేధించారో... పావలాగాడు, ప్యాకేజీ స్టార్ అని ఎలా కించపరిచారో చూశాం. తన మనో వికారాలను ప్రజలు గుర్తించకుండా ఉండటానికి 'క్లాస్ వార్' అని వామపక్షాల నినాదాన్ని జగన్ అందిపుచ్చుకున్నారు. కాపులను కాపులతోనే తిట్టించారు. కమ్మ వారిని కమ్మ వారితోనే తిట్టించారు. ఈ క్రమంలో పేర్ని నాని, ముద్రగడ పద్మనాభం వంటి వారిని చేరదీశారు. చివరికి ముద్రగడ పద్మనాభం తన పేరును పద్మనాభరెడ్డి అని మార్చుకోవలసిన దుస్థితి కల్పించారు. ఇక వల్లభనేని, కొడాలి నాని వంటి వారి గురించి తెలిసిందే. ఇప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నాం. అప్పుడు ఆ రెండు కులాలను వేధించిన జగన్‌రెడ్డి ఇప్పుడు ఆ రెండు కులాలను విడదీయడానికి స్కెచ్ గీశారు.

> **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తాను మాత్రమే అర్హుడినని జగన్‌రెడ్డి తనకు ఉన్న మానసిక సమస్య వల్ల బలంగా నమ్ముతున్నారు. జగన్‌లో ఉన్న నార్సిసిస్టిక్ లక్షణాల వల్లనే ఆయన ఎత్తుగడలను నాలుగున్నర దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కూడా ముందుగా పసిగట్టలేకపోతున్నారు.**

కూటమి మధ్య చిచ్చు పెట్టేందుకు...

కాపులను కూటమి నుంచి దూరం పెట్టడానికి కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారు. ఇందుకోసం కాపు సామాజిక వర్గానికి చెందిన కొందరిని చేరదీశారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా జగన్ మనుషులు అక్కడ వాలిపోతూ కులాల మధ్య కుంపట్లను రాజేస్తున్నారు. తాజాగా కాల్ మనీ వ్యాపారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న ఒక మహిళకు సంబంధించిన కేసులో ఏ సంబంధం లేని కల్లూరు శ్రీనివాస్ అనే కమ్మ సామాజికవర్గానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త పేరు బయటకు తెచ్చారు. కర్లపూడి శ్రీను అనే పేరు బదులు కల్లూరు శ్రీను అని ఆత్మహత్య చేసుకున్న శేషమ్మ వీడియోలో అన్నారు. అంతే, అక్కడ కూడా కులాల మధ్య విద్వేషాలు రగిలించడానికి జగన్ తరపున వకల్తా పుచ్చుకున్నవారు వాలిపోయారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తాను మాత్రమే అర్హుడినని జగన్‌రెడ్డి తనకు ఉన్న మానసిక సమస్య వల్ల బలంగా నమ్ముతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం తాను అధికారంలో లేనందున ఏదేదో జరిగిపోతోందని బాధపడిపోతున్నారు. జగన్‌లో ఉన్న నార్సిసిస్టిక్ లక్షణాల వల్లనే ఆయన ఎత్తుగడలను నాలుగున్నర దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కూడా ముందుగా పసిగట్టలేక పోతున్నారు. తెలుగుదేశం పార్టీకి బలమైన మద్దతుదారులుగా ఉన్న కమ్మ వారిలో కూడా చంద్రబాబుపై వ్యతిరేకత సృష్టించే ప్రయత్నం జగన్‌రెడ్డి చేయగలరని ఎవరైనా ఊహిస్తారా? ఆ సామాజికవర్గానికి చెందిన కొందరిని చేరదీసి, చంద్రబాబు పాలనలో కమ్మ వారికి అన్యాయం జరుగుతోందని... ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లాలకు అన్యాయం చేస్తున్నారని, అమరావతిని నిర్వీర్యం చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. తమాషా ఏమిటంటే, జగన్‌రెడ్డి పాలనలో వేధింపులను తట్టుకోలేక కలుగుల్లో దూరి బిక్కు బిక్కు మంటూ బతుకు వెళ్లదీసిన కమ్మ సామాజికవర్గంలో కొందరు ఈ ప్రచారాన్ని నమ్ముతున్నారు. మెయో క్లినిక్ వాళ్లు ఇచ్చిన నిర్వచనంలో ఈ లక్షణం కూడా ఉంది. విషాదం ఏమిటంటే, నార్సిసిస్టిక్ డిజార్డర్‌కు మందు లేకపోవడం. అంటే నయం కాని మానసిక సమస్యతో బాధపడుతున్న జగన్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు భరించాల్సిందే. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాబోయే భారత ప్రధాని అని ఇదే జగన్‌రెడ్డి ప్రచారం చేయించుకోవడం గుర్తుంది కదా? అంటే ఆయనలో ఈ మానసిక సమస్య తీవ్రరూపం దాల్చుతోన్నదన్న మాట. జగన్మోహన్‌రెడ్డిలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? లేవా? అన్న విషయం స్పష్టం చేయాల్సిన బాధ్యత సైకాలజిస్టుల మీద ఉన్నది. ఆయనలో ఈ వ్యాధి లక్షణాలు లేవని వారు నిర్ధారిస్తే మరేదో సమస్య ఉందని సరిపెట్టుకోవచ్చు. అంతవరకు జగన్ విషయంలోనూ, ఆయన రాజకీయాల విషయంలోనూ ప్రజలే అప్రమత్తంగా ఉండాలి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

భయం చచ్చిపోతే, అవినీతి బరితెగిస్తుంది

ఒక సీనియర్ పోలీసు అధికారి ఎప్పుడు అవినీతి పరుడవుతాడు? సమాధానం– 'అతనికి భయం లేకపోతే.'

అవినీతి లాభదాయకమని తెలిసినప్పుడు. తనను ఎవరూ పట్టుకోలేరని నమ్మినప్పుడు. తనను రక్షించేవారు ఉన్నారని తెలిసినప్పుడు. తన భాగస్వాములు తనకు భయపడతారని, చట్టానికి కాదు అని తెలిసినప్పుడు. తనను ఎవరూ బహిర్గతం చేయలేరని, ఎందుకంటే తాను వారి రహస్యాలను కూడా బయట పెట్టగలడని తెలిసినప్పుడు– అప్పుడు తెగులు ప్రారంభం అవుతుంది.

ఒకసారి అవినీతి మొదలైతే, అది మౌనంగా వ్యాపిస్తుంది. ఇటీవల ఒక డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) అవినీతిలో పట్టుబడి జైలులో ఉండటం ప్రజల నమ్మకాన్ని మరోసారి కుదిపేసింది. ఇతను ఇంతకాలం, అంత ఎలా దాచుకున్నాడు కాదు. అసలైన ప్రశ్న– ఇతని గురించి ఎంతమందికి మందికి తెలుసు? ఎవరెవరు లాభపడ్డారు?

పోలీసు వ్యవస్థలో ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాలు ఉన్నా, ఇంత పెద్ద అవినీతి ఎవరికీ తెలియకపోవడం నమ్మశక్యం కాదు. కానీ హోదాలు శాసించే వ్యవస్థలో, మౌనం ఆధారంగా నడిచే వ్యవస్థలో అవినీతి గురించి తెలియడం, దానికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడం చాలా భిన్నమైన విషయాలు.

అవినీతిపరుడు ఒంటరిగా కాదు, మౌనంగా సహకరించే వారి మధ్యలో జీవిస్తాడు. అతని సహచరులు లంచాలు పంచుకోకపోయినా, మౌనం పంచుకుంటారు. అతని సీనియర్లు అతని లోభాన్ని నమ్మకపోయినా, ప్రశ్నించకుండా ఉండటానికి ఇష్టపడతారు. జూనియర్‌లు చూస్తారు, నేర్చుకుంటారు– నిజాయితీ అనేది లాభదాయకమైంది కాదని భావిస్తారు. క్రమంగా ఒక ప్రమాదకరమైన అంచనాకు వస్తారు– వ్యవస్థలో అవినీతి మినహాయింపు కాదు, వ్యవస్థాగత యంత్రం నడవడానికి కందెన అనే నమ్మకం ఏర్పడుతుంది. అందుకే ఒక సీనియర్ అధికారి అవినీతి సొమ్ముతో దొరికిపోయినప్పుడు కలిగే విభ్రాంతి చాలా కృత్రిమంగా ఉంటుంది. పోలీస్ వ్యవస్థలో పనిచేసే వారందరికీ తెలుసు, అవినీతి దారితప్పిన వ్యక్తిది కాదు, అది లోతుగా వ్యాపించిన వ్యాధి అని.

ఐపీఎస్‌ను 'ఎలైట్ సర్వీస్'గా పిలుస్తారు. నిజంగా చాలా మంది అధికారులు ధైర్యంగా, నిజాయితీగా పని చేస్తారు. అందుకు చాలా మూల్యం కూడా చెల్లిస్తారు. కానీ ఈ 'ఎలైట్' అనే పదం కొందరికి రక్షణ కవచంగా మారింది. చట్టానికి అందనంత దూరంలో ఉన్నట్లు భావిస్తారు. రాజకీయ సంబంధాలు, బ్యూరోక్రటిక్ శక్తి, అనుచరుల విశ్వాసం కలగలిపి వారికి రక్షణ కవచం ఉన్నట్లు భావన కలిగిస్తుంది. బదిలీలు మేనేజ్ చేయవచ్చు, విచారణలు ఆలస్యం చేయవచ్చు, ఫైళ్లు మాయమవుతాయి. పర్యవేక్షణ వ్యవస్థలు తప్పు చేసిన వారిని జవాబుదారీ చేయడం కంటే కాపాడడానికే ఉపయోగపడతాయి. ఈ విధంగా శిక్షల నుంచి రక్షించే వలయం ఏర్పడుతుంది.

> **ఆరోగ్యకరమైన వ్యవస్థలో రెండు రకాల భయాలు ఉంటాయి– తప్పు చేయడం అంటే భయం... పట్టుబడడం అంటే భయం... భయపడడానికేమి లేదని ఒక సీనియర్ అధికారి భావిస్తే, అవినీతి అనివార్యం అవుతుంది. వ్యవస్థ తనను జవాబుదారీ చేస్తుందని నమ్మితే, నిజాయితీ తిరిగి వస్తుంది. ఏది ఎంచుకుంటామనేది మన చేతుల్లోనే ఉంది– మౌనంగా ఉండడమా లేక ధైర్యంతో ఎదుర్కోవడమా? మౌన అంగీకారమా లేక మనస్సాక్షితో ప్రశ్నించడమా? ఎందుకంటే చట్టాన్ని అమలు చేసేవారు దానికి భయపడకపోతే, ఆ చట్టానికి అర్థమే ఉండదు.**



ఒక ఆరోగ్యకరమైన వ్యవస్థలో రెండు రకాల భయాలు ఉంటాయి– తప్పు చేయడం అంటే భయం... పట్టుబడడం అంటే భయం. ఇవి రెండూ లేకపోతే, అవినీతి తప్పని సరిగా విజృంభిస్తుంది. నాయకత్వ స్థాయిలో ఉన్న చాలా మందికి ఈ భయాలు పోయి చాలా కాలమైంది. రాజకీయ ప్రాబల్యం ఒక రక్షణ వలయం వారికి. వ్యవస్థీకృత జడత్వం ఇంకొక రక్షణ వలయం. నిశ్శబ్దంగా లేక పంచుకున్న అవినీతి వల్ల సహకరించేవారు ఈ రక్షణ వలయాన్ని పూర్తి చేస్తారు. వ్యవస్థను తప్పుదారి పట్టించగలను, దర్యాప్తును ప్రభావితం చేయగలను, విచారణను తొక్కి పెట్టగలను అని అధికారి భావించినంత కాలం, నీతిగా ఉండడం అనేది వీలైతే పాటించే ఒక సుగుణం.

ఒక సీనియర్ అధికారి పట్టుబడితే, అది కేవలం అతని పరాభవమే కాదు– మొత్తం పోలీసు వ్యవస్థపై మచ్చ. నిజాయితీపరులైన వందలాది అధికారుల విశ్వసనీయతను అది బలహీనపరుస్తుంది. ప్రజలు పోలీసులను రక్షకులుగా కాకుండా, యూనిఫామ్‌లో ఉన్న వేటగాళ్లుగా చూస్తారు. నిజాయితీ గల ఒక కానిస్టేబుల్ లేదా ఎస్పీ తాము ఒంటరివాళ్లమై పోయామని భావిస్తారు. అవినీతి పై నుంచి కిందికి పాకుతుంది– హెడ్‌క్వార్టర్స్ నుంచి వీధిలోని రోజువారీ మామూళ్లు వసూలు చేసే బీట్ కానిస్టేబుల్ వరకు. అవినీతిని మౌనంగా భరిస్తే చెల్లించే మూల్యం కేవలం డబ్బులో కాదు– దిగజారే మనోబలంలో ఉంటుంది.

ఒకరిని సస్పెండ్ చేయడం లేదా అరెస్ట్ చేయడం సరిపోదు. వ్యవస్థను శుద్ధి చేయాలంటే లోతుగా చూడాలి– అవినీతికి సహకరించిన నెట్‌వర్క్‌లు, మౌనంగా ఉన్న అధికారులు, లాభపడిన రాజకీయ నాయకుల వైపు చూడాలి. స్వతంత్ర విజిలెన్స్, స్వేచ్ఛతో కూడిన విచారణలు అవసరం. పోలీస్ విభాగంలో ఉన్న విజిల్ బ్లోయర్లకు రక్షణ అవసరం. బదిలీలను రాజకీయ ప్రభావం నుంచి రక్షించాలి.

అత్యంత ముఖ్యంగా– పోలీస్ వ్యవస్థలో చట్టం పట్ల భయాన్ని పునరుద్ధరించాలి, రాజకీయ నాయకులు అంటే కాదు. పదవులు, హోదాలు అవినీతి పరులను రక్షించలేవనే విశ్వాసాన్ని కలిగించాలి. పట్టుబడడం అంటే పరువు పోవడమని, బేరసారాలకు తలుపులు తెరవడం కాదని తెలియజెప్పాలి. అప్పుడు మాత్రమే అతను తీసుకునే ప్రమాణం– "భయమూ, పక్షపాతం లేకుండా సేవ చేయడం"– అర్థవంతమవుతుంది.

భయపడడానికేమి లేదని ఒక సీనియర్ అధికారి భావిస్తే, అవినీతి అనివార్యం అవుతుంది. వ్యవస్థ తనను జవాబుదారీ చేస్తుందని నమ్మితే, నిజాయితీ తిరిగి వస్తుంది. ఏది ఎంచుకుంటామనేది మన చేతుల్లోనే ఉంది– మౌనంగా ఉండడమా లేక ధైర్యంతో ఎదుర్కోవడమా? మౌన అంగీకారమా లేక మనస్సాక్షితో ప్రశ్నించడమా. ఎందుకంటే చట్టాన్ని అమలు చేసేవారు దానికి భయపడకపోతే, ఆ చట్టానికి అర్థమే ఉండదు.

▪ డా. కిరణ్ బేడీ
తొలి మహిళా ఐపీఎస్ అధికారి

అనువాదం: ప్రొఫెసర్ మురళి కర్ణం (నల్సార్)

కన్నీటి ఓరుగల్లు

సీఎం సీరియస్...





అక్టోబరు 29న మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో నగరాన్ని ముంచెత్తిన వరద నీరు (ఫైల్)

ఇప్పటికైనా కదిలేనా!?

ప్రతీ ఏటా వర్షాకాలంలో చారిత్రక వరంగల్ నగరం వరదల బారిన పడి అల్లాడుతోంది. చిన్నపాటి వానలకే అనేక చోట్ల వరద పోటెత్తుతోంది. ప్రధాన రహదారులు గోదారులుగా మారుతున్నాయి. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటుండటంతో జనం చెప్పలేని కష్టాలకు గురవుతున్నారు. గత కొన్నేళ్లుగా నగరంలో చెరువులు, నాలాలు యథేచ్ఛగా కబ్జాల బారిన పడుతుండటమే ఇందుకు కారణం. ముర్కి కాలువ పక్కన ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జారాయుళ్లు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ప్రశ్నిస్తే, చేతులు తడిపి మేనేజ్ చేసుకుంటున్నారు. కబ్జాల వల్ల నగరంలోని 170 చెరువుల్లో సగం మాయమయ్యాయి. నగర పరిధిలో 16.42 కి.మీ. పొడవున్న నాలుగు ప్రధాన నాలాలను ఇరువైపులా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారు. దీంతో చిన్నపాటి వానకు కూడా నగరంలో జల విలయం సంభవిస్తోంది. ఇటీవలి మొంథా తుపాను వల్ల వరంగల్ నగరం జల కల్లోలం బారిన పడిన నేపథ్యంలో.. గత శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నాలాలు, చెరువుల అక్రమణలను ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఇప్పటికైనా అధికారుల్లో కదలిక వచ్చేనా..? అక్రమణలు తొలగేనా..? అనే చర్చ సాగుతోంది.

ఓరుగల్లులో చెరువులు, నాలాల కబ్జాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్న సీఎం

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణకు రెండో రాజధానిగా చెప్పుకుంటున్న వరంగల్ మహానగరంలో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జాలు జరుగుతున్నాయి. గ్రేటర్ పరిధిలో 170 చెరువులు, కుంటలు ఉన్నట్లుగా ఇటీవల అధికారులు గుర్తించారు. వీటిలో 80కి పైగా కుంటలు, చెరువులు వాటి స్వరూపాన్ని కోల్పోయాయి. మిగిలిన వాటిల్లో నగరం నడిబొడ్డున ఉన్న నాలుగు ప్రధాన జలాశయాల్లో ఒకటైన భద్రకాళి చెరువు 495.89 ఎకరాల్లో విస్తరించింది. 180 ఎకరాలకుపైగా చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని అంచనా. చెరువు చుట్టూ 249 అక్రమ కట్టడాలను నిర్మించారు. వీటిలో 108 అక్రమ కట్టడాలను ఇటీవల కూల్చివేయగా, మిగతా నిర్మాణాలపై చర్యలకు రాజకీయ ఒత్తిళ్ల (మిగతా 7వ పేజీలో)

- నగరంలో 170కి పైగా చెరువులు, కుంటల్లో సగం మాయం
- భద్రకాళి, బంధం, కోట, చిన్నవడ్డెపల్లి చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో 1,094 అక్రమ కట్టడాల గుర్తింపు
- మురికి కాలువలను సైతం వదలని అక్రమార్కులు.. 524కు పైగా అక్రమ నిర్మాణాలు
- నాలా స్థలాల్లో విద్య, వైద్య సంస్థలు, షాపింగ్‌మాల్స్, ఫంక్షన్‌హాల్స్, షాపులు
- చెరువులు, నాలాల ఆక్రమణలతో కాలనీల్లోకి వరదనీరు
- ఆక్రమణలపై ఉపేక్షించవద్దన్న ముఖ్యమంత్రి
- సీఎం ఆదేశాలతో అధికారుల్లో చలనంపై ఆశలు

రహదారా.. గోదారా..



గోపాల్‌పూర్ కాలనీలో ప్రజలను పడవపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

లోన్ యాప్‌ల డబ్బులు చెల్లించలేక..

- ఉనికిచర్లలో యువకుడి ఆత్మహత్య
- ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం తీసుకున్న అప్పు



రాకేష్ (ఫైల్)

ధర్మసాగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం తీసుకున్న లోన్ డబ్బులు తిరిగి చెల్లించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై జానీ పాషా శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ధర్మసాగర్ మండలం ఉనికిచర్లకు చెందిన చీమ రాకేష్ (22) అనే యువకుడు డిగ్రీవరకు చదివి కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. నిత్యం ఆన్‌లైన్‌లో మొబైల్‌లో పేకాట ఆడేందుకు వివిధ యాప్‌లలో అధిక మొత్తంలో లోన్ తీసుకున్నాడు. ఆ డబ్బులను ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లో పేకాట ఆడుతూ పెద్ద మొత్తంలో పోగొట్టుకున్నాడు. తీసుకున్న లోన్ డబ్బులు చెల్లించాలని యాప్‌ల నిర్వాహకులు రాకేష్‌పై పలు మార్లు ఒత్తిడి తెచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన రాకేష్ గత నెల 30న రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే అతన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ యగు **నల్ల పద్మారావు, తండ్రి: లేట్ కొమురయ్య,** నివాసం: వడ్డేపల్లి, హనుమకొండ గారు **తేదీ: 20-10-2025** నాడు సుబేదారి నుండి హనుమకొండ బస్‌స్టాండ్‌కు ఆటోలో వెళ్ళుతుండగా మార్గమధ్యములో ఒరిజినల్ రిజిస్టర్ దాన **దస్తావేజు నం. 2606/1998, తేదీ: 31-7-1998ను** పోగొట్టుకున్నారు. సదరు ఒరిజినల్ రిజిస్టర్ దాన దస్తావేజు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాలో ఇవ్వగలరు. ఇట్టి ఒరిజినల్ రిజిస్టర్ దాన దస్తావేజుతో ఎవరైన ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని ఒకవేళ ఎవరైనా ఏమైనా లావాదేవీలు జరిపిన నా క్లయింట్ చట్టరీత్యా తీసుకునే చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు

Sd/- S.MURALIDHAR, Advocate
H.No: 2-7-484/3, Excise Colony,
Hanamkonda. Cell: 9849710502





పంట నష్టంపై సర్వే ప్రారంభం

వారంలో పూర్తి చేయనున్న వ్యవసాయ శాఖ

హనుమకొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మిరప, పండ్ల పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తెలిపారు. పంట నష్టంపై శుక్రవారం జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించి హనుమకొండలోని కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా, నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు పరిహారం అందిస్తామని చెప్పారు. దీంతో శనివారం వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట నష్టం జరిగిన గ్రామాలలో క్షేత్రస్థాయిలో సందర్శించారు. 30 శాతంపైగా పంట నష్టం జరిగిన రైతుల వివరాలు తెలుసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. కాగా పంట నష్టంపై వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని పేర్కొన్నారు.


పోలీసుల అదుపులో గన్ గ్యాంగ్

గన్‌తో బెదిరించి లారీ డ్రైవర్‌పై దాడి

శాయంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గన్‌తో బెదిరించి లారీడ్రైవర్‌పై దాడికి పాల్పడిన గన్ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మాందారిపేట జాతీయ రహదారిపై ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలపై మద్యం మత్తులో ఉన్న యువకులు లారీని ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో లారీడ్రైవర్‌తో గొడవ పడి గన్ చూపి బెదిరించి దాడి చేశారు. దీంతో లారీడ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడి నుంచి పారిపోవడమే గాకుండా ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండా గన్‌తో బెదిరించినట్లు సమాచారం. లారీడ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గన్‌తో హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు. అతనిపై ఇదివరకే చాలా కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉన్నట్లు తెలిసింది. విచారణలో భాగంగా మరో నిందితుడు ములుగు జిల్లా కేంద్రంలో గన్‌తో పట్టుబడగా, అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఇద్దరి వద్ద ఉన్న గన్‌లు వేరే రాష్ట్రంలోని ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడికాగా, ఆ వ్యక్తిని కూడా టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హనుమకొండ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్

హనుమకొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకోరారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్‌బాబుతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎర్ర బెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల బాధలు తెలువవని విమర్శించారు. సమయానికి యూరియా అందించలేదని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వేలాది ఎకరాలు వర్షాలతోనీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. ఎకరానికి రూ.20వేల పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందించే వరకు బీఆర్ ఎస్‌పార్టీ అండగా ఉంటుందని, రైతులు అధైర్యపడొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, వివిధ మండలాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు...

- మానసిక వేదనతో ఎస్‌బి ఎస్సై హఫీసుద్దీన్ ఆత్మహత్య
- మరో నాలుగు నెలల్లో రిటైర్‌మెంట్ ఉండగానే తీవ్ర నిర్ణయం



నర్సంపేట టౌన్/చెన్నారావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఎస్.బి. ఎస్సై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణంలోశనివారం చోటుచేసుకుంది. నర్సంపేట ఎస్సై అరుణ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎమ్డీ. హఫీసుద్దీన్(60) స్పెషల్ బ్రాంచి ఎస్సైగా ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లో గత మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు, ఆర్థికపరమైన ఇబ్బందులతో కొంతకాలంగా ఆయన మానసికంగా కలత చెందుతున్నారు. ఈ సమస్యకు కుటుంబ కలహాలు తోడయ్యాయి.

శుక్రవారం ఆయన యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఏం జరిగిందో తెలియదుగానీ డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి సమయంలో గడ్డి మందు తాగాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. హఫీసుద్దీన్ ఆత్మహత్యతో పోలీసు వర్గాల్లో విషాదం నెలకొంది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన హఫీసుద్దీన్ 1984లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. అనంతరం ఎస్సైగా పదోన్నతి పొందారు. 2026 ఫిబ్రవరిలో ఆయన రిటైర్ కావాల్సి ఉంది.



వరంగల్‌లోని రఘునాథ్ కాలనీలో మేయర్ సుధారాణి...



హనుమకొండలోని సమ్మయ్యనగర్‌లో కమిషనర్ చాహత్ బాజ్‌పేయి..

వరద బాధితులను ఆదుకుంటాం

- నష్టపోయిన వారు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి
- అర్హులైన బాధితులకు నెల రేషన్, రూ.15వేల సాయం
- మేయర్ గుండు సుధారాణి

6

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్
హన్మకొండ శాఖ (0173)
(2-5-614, డి-మార్ట్ లేన్ ప్రక్కన, సుబేదారి, హన్మకొండ-506001.
ఫోన్ నం: 0870-2501513, ఇ- మెయిల్ : iob0173@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నం.54 ఆఫ్ 2002) క్రింద బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల అమ్మకం.

బ్యాంక్ బకాయిలు ప్లస్ దిగువ వివరించిన విధంగా వడ్డీ మరియు వ్యయాలు చెల్లించుటలో విఫలమైన మీదట బకాయిలు వసూలు కొరకు **"ఎక్కడ ఎలా ఉన్నది అలా"** మరియు **"అక్కడ ఏమి ఉన్నదో అది"** ప్రాతిపదికన దానిని విక్రయించు హక్కుతో పాటు దిగువ రుణ ఖాతాలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన ప్రకటనకు అనుగుణంగా దిగువ ఆస్తిని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు సదరు ఆస్తి/లు అమ్మకం ద్వారా బ్యాంక్ బకాయిలు వసూలు కొరకు ప్రతిపాదిస్తున్నారు. **వెబ్‌పోర్టల్ (https://www.baanknet.com/eauction-psb/home) or https://baanknet.com** వద్ద ఏర్పాటు చేయబడిన ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా దిగువ సంతకందారుచే అమ్మకం నిర్వహించబడును.

రుణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ రూప సాయి ఏజెన్సీస్ (రుణగ్రహీత), ప్రాతినిధ్యం వహిస్తున్న దీని యజమాని : శ్రీ శివ్వ రేవంత్ కుమార్, చిరునామా: 1: డి.నం.10-9-7, చార్‌బౌలి, వరంగల్, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం- 506002. చిరునామా-2: ఇం.నం.15-11-183/37, రామన్నపేట, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506002. 2) శ్రీ శివ్వ రేవంత్ కుమార్, (రుణగ్రహీత/తనఖాదారు) తండ్రి శివ్వ రమేష్, నివాసం ఇం.నం.9-10-157, విశ్వకర్మ స్ట్రీట్, వరంగల్, తెలంగాణ రాష్ట్రం-506002. 3) శ్రీమతి శివ్వ రాధిక (హామీదారు/తనఖాదారు), భర్త శివ్వ రమేష్, నివాసం ఇం.నం.9-10-157, విశ్వకర్మ స్ట్రీట్, వరంగల్, తెలంగాణ రాష్ట్రం-506002.

ఎన్‌పిఎ తేది: 30.09.2020, , **డిమాండ్ ప్రకటన తేది:** 28.05.2021
డిమాండ్ ప్రకటనలో క్లెయిం చేసిన బకాయి మొత్తం: 89,78,365/-.
స్వాధీనతా ప్రకటన తేది: 12.05.2023.
స్వాధీనతా ప్రకటనలో క్లెయిం చేసిన బకాయి మొత్తం: 87,38,106/-
అమ్మకం ప్రకటన తేది: 18.09.2025

- స్థానిక స్వీయ ప్రభుత్వ బకాయి మొత్తాలు (ఆస్తి పన్ను, నీటి పారిశుధ్యం, విద్యుత్ బిల్లులు వగైరా) : లేవు

స్థిరాస్తి వివరణ మరియు ఇ-వేలం వివరాలు:

శ్రీ శివ్వా రేవంత్ కుమార్ తండ్రి శివ్వా రమేష్ పేరున కలిగిన తెలంగాణ రాష్ట్రం-506151, వరంగల్ జిల్లాలో ధర్మసాగర్ మండలం, రాంపూర్ రెవెన్యూ గ్రామంలో సర్వే నం.358 వద్ద గల 312 చ.గజాలు విస్తీర్ణం కలిగిన ప్లాట్ నం.9 కలిగిన ఖాళీ ప్లాట్ ఆస్తి యావత్తు. డాక్యుమెంట్ నం.5322 ఆఫ్ 2014 ప్రకారం సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.8, దక్షిణం: ప్లాట్ నం.10, తూర్పు: ప్లాట్ నం.27, పశ్చిమం: 40 అడుగుల వెడల్పు రోడ్.

రిజర్వు ధర : రూ.21,22,000/-, **వేలం తేది మరియు సమయం:** 18.11.2025 (మంగళవారం) ఉ.11 గం. నుండి మ.1.00 గం.మధ్యన,
బయానా : రూ. 2,12,200/-, **బిడ్ పెరుగుదల మొత్తం:** రూ.20,000.00, **ఆటో ఎక్స్‌టెన్షన్ సమయం:** 10 నిమిషాలు.
ఏవేని తెలిసిన తాకట్టు రుణభారాలు: లేవు, **తనిఖీ తేది మరియు సమయం:** ముందస్తు అపాయింట్‌మెంట్‌తో అన్ని పని రోజుల్లో ఉ.10.00 గం.మరియు సా.5.00 గం.మధ్యన.
బయానాతో బిడ్ ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు :03.11.2025 నుండి.
బయానాతో బిడ్ కొరకు దరఖాస్తు దాఖలుకు ఆఖరి తేది : 17.11.2025

చట్టబద్ధ బకాయిలపై బ్యాంక్ బకాయిలకు ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది.

నియమనిబంధనల కొరకు (https://www.baanknet.com/eauction-psb/home) or https://baanknet.com ను దర్శించగలరు (ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ వెబ్ పోర్టల్) లేదా బిడ్డర్లు అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారిని కార్యాలయ పని వేళల్లో ఫోన్ నం.0870-2577083, మొబైల్ నం.: 8925950173, 9551917219 ను లేదా బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s. PSB Alliance Pvt Ltd, చిరునామా: యూనిట్ 1, 3వ అంతస్తు, VIOS కమర్షియల్ టవర్స్, వడాలా ట్రక్ టర్మినల్ సమీపాన, వడాలా ఈస్ట్, ముంబయి-400037, ఫోన్ నం. 8291220220, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com ను సంప్రదించవచ్చును.

(https://www.baanknet.com/eauction-psb/home) or https://baanknet.com

తేది: 31.10.2025 సం/-
ప్రదేశం: హన్మకొండ, అధీకృత అధికారి

సి ఇన్ సెంట్ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హనుమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన యువ ప్రతిభావంతుడు గుండు ఆరవింద్ సి ఇన్ సెంట్ అనే పుస్తకాన్ని రాశాడు. అలాగే తాను ఏడాది పాటు శ్రమించి రూపకల్పన చేసి మిషన్ తేజస్‌కు సంబంధించిన పోస్టర్ కూడా రూపొందించాడు. ఈ రెండింటిని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో ఆవిష్కరించగా ఎంఎల్‌సీ శ్రీపాల్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. సి ఇన్ సెంట్ పుస్తకం సి ప్రోగ్రామింగ్‌లోకి సులభమైన ప్రవేశ ద్వారం లాంటిదని, ప్రోగ్రామింగ్ ప్రపంచంలోకి ప్రవేశించాలనుకునే ఆరంభ దశ విద్యార్థులకు అలాగే సి ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను మెరుగు పరుచు కోవాలనుకునే వారికి అద్భుతమైన మార్గదర్శి అని అనిరుధ్ తెలిపాడు.

మిషన్ తేజస్

అనిరుధ్ రూపకల్పన చేసిన తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకల్పం (మిషన్ తేజస్) పోస్టర్ మిషన్ తేజస్ వరంగల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలలు వేదికగా విద్యార్థుల సర్వతోముఖ వికాసం లక్ష్యంగా రూపొందించిన ఈ మిషన్ పైలెట్ ప్రోగ్రాం.. వర్చువల్ టింకరింగ్ ల్యాబ్ (వీటీఎల్) ద్వారా సాంకేతికతతో కూడిన నూతన ఆవిష్కరణల కోసం ఉద్దేశించింది. మిషన్ తేజస్ గురించి విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు రూపొందించిన ఈ పోస్టర్‌ను శ్రీధర్‌బాబు ప్రశంసించారు. అనిరుధ్ ప్రస్తుతం పెద్ద పెండ్యాలలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్నాడు.

జీవాంజీ దీప్తిపై సర్కారు నిర్లక్ష్యం

మాజీ మంత్రి దయాకర్ రావు


కల్లెడలో దీప్తిని సన్మానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పర్వతగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రపంచ స్థాయి పారా అథ్లెట్ జీవాంజీ దీప్తి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. శనివారం పర్వతగిరి మండలంలోని కల్లెడలో జీవాంజీ దీప్తికి ఇంటికి వెళ్లి ఆయన మాటాడారు. ఇటీవల దేశానికి రెండు బంగారు పథకాలు సాధించిన సందర్భంగా శాలువాతో సత్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రూప్-2 ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థలం ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపిం చారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే వాటిని ఇప్పించాలని డిమాండ్ చేశారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

వరంగల్ కలెక్టర్ సత్యశారద


వెంకటాపురం సమీపంలో దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్

నెక్కొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల సమయంలో అధికారులు ప్రజలకు అత్యవసర సేవలను అందించి ఆస్తులు, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మొంథా తుఫాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇళ్లను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్లవాడ గ్రామం పరిసర తండాలలో భారీ వర్షాలకు దాదాపు 38 ఇళ్ల వరకూ పాక్షికంగా ధ్వంసమైన విషయాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ ఇంటి మరమ్మతులకు ప్రభుత్వం నుంచి ఆర్థికసహాయం అందిస్తామన్నారు.

మండలంలో వేల ఎకరాల్లో వరి, పత్తి, అరటి పంటలు దెబ్బతిన్నాయని సంబంధితాధికారులు మూడు రోజలు నిరంతరం సర్వే జరిపి పంట నష్టాలపై వివరాలు అం దించాలన్నారు. వరంగల్-నెక్కొండ ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గోతు లు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు జరిపించాలని ఆదేశించారు. ఇటీవల కురసిన భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపించామని, ఈ రోడ్ల శాశ్వత నిర్మాణానికి గాను ఇండియన్ గవర్నమెంట్ నుంచి త్వరలో నిధులు మంజూరు అవుతాయన్నారు.

రెడ్లవాడ ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

రెడ్లవాడ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేయగా, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యంలేని విషయం వైద్య సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కనీస సౌకర్యాలు లేకుండా ప్రజలకు ఎలా వైద్య సేవలు అందిస్తున్నారంటూ సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే విద్యుత్, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సాంబశివరావు, ఐబీ, పీఆర్ డీఈలు సంతోష్, మోహన్‌రావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో లావణ్య, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, రాజ్ ఎస్సై మహేందర్, నెక్కొండ పీఏహెచ్‌సీ డాక్టర్ మౌనిక, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల వేలం నిలిపివేయాలి


కుడా వీసీకి వినతి పత్రం అందిస్తున్న చీకటి రాజు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని ప్రభుత్వ భూములను కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అభివృద్ధి పేరుతో అడ్డగోలు విక్రయాలకు తెరదింపాలని, లేదంటే అడ్డుకుంటామని తెలుగుదేశం పార్టీ వరంగల్ పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యులు చీకటి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్లకార్డులతో కుడా కార్యాలయం ముందు కార్యకర్తలతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కుడా వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. హనుమకొండ బాలసముద్రంలో సర్వే నెంబర్ 1066లో 34 ఎకరాల ప్రభుత్వ భూమి జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఉందని, దాస్యం ప్రణయ్‌భాస్కర్ 3000 గజాల స్థలం ముందు చూపుతో క్రీడా హబ్‌కు కేటాయించారని అన్నారు.

కానీ కుడా అధికారులు అభివృద్ధి పేరుతో కమిర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని అన్నారు. ఇదే ప్రాంతంలో ఇటీవల కుడా అధికారులు ప్రభుత్వ భూములను వేలం వేయాలని చూస్తున్నారని, అదే చేస్తే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో క్రీడాకారుల సౌకర్యం కోసం స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటు చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదని రాజు తెలిపారు. వీసీని కలిసిన వారిలో టీడీపీ నాయకులు ఉన్నారు.

టెక్స్‌టైల్‌పార్కుకు యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధులు


టెక్స్‌టైల్ ఉత్పత్తుల యూనిట్‌లో కంపెనీ చైర్మన్, ప్రతినిధులు

గీసుగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేటహవేలి శివారులో గల కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కులో నిర్మిస్తున్న దక్షిణ కొరియా యంగ్‌వన్ కంపెనీకి ఆ కంపెనీ చైర్మన్ కిహాక్ సూంగ్, వైస్ చైర్మన్ మిన్ సుక్‌లీలు శనివారం ప్రత్యేక చాపర్‌లో వచ్చారు. పార్కులో టీజీఐఐసీ యంగ్‌వన్ కంపెనీకి 297 ఎకరాలు కేటాయించగా అందులో పలు యూనిట్‌లు నిర్మాణంలో ఉన్నాయి. నిర్మాణ పనులతో పాటు ఇప్పటికే ప్రారంభమైన యూనిట్‌లో టెక్స్‌టైల్ ఉత్పత్తులను, వాటి తయారీ, నాణ్యతను పరిశీలించేందుకు వచ్చారని తెలిసింది. కాగా, మొంథా తుఫాన్‌తో పార్కులో గల నదీనాల వరద ఉధృతికి పలు రోడ్లు ధ్వంసం కావటంతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో కంపెనీకి వరద ఉధృతి వల్ల భవిష్యత్‌లో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందా అని వారు ఆరా తీసినట్లు సమాచారం. కాగా, కంపెనీ చైర్మన్ రాకతో ఎవరిని లోపలికి అనుమతించలేదు. స్థానిక తహసీల్దార్ రియాజుద్దిన్, సీఐ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

100 ఫీట్ల రోడ్డు డ్యామేజ్‌తో బస్సుల మళ్లింపు

హనుమకొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో హనుమకొండ నగరం అతలాకుతలమైంది. తులసీ బార్ వద్ద రోడ్లు ధ్వంసం కావడంతో నాలుగు రోజుల నుంచి మరమ్మతులు చేస్తున్నారు. దీంతో శనివారం ఆర్టీసీ అధికారులు వంద ఫీట్ల రోడ్డు రోడ్డుకు వెళ్లే బస్సు సర్వీస్‌లను దారిమళ్లించి కాజీపేట నుంచి వయా ఫాతిమానగర్, అదాలత్, అంబేద్కర్ జంక్షన్, పెట్రోల్ బంక్, యూనివర్సిటీ, పెగడపెల్లి డబ్బాలు, పెద్దమ్మగడ్డ వరంగల్ వరకు బస్సు సర్వీస్‌లు నడుపుతున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ ధరంసింగ్ తెలిపారు. భారీవర్షాల కారణంగా హనుమకొండ డిపోలోని గ్యారేజీలో వరదనీరు చేరడంతో బస్సు రిపేర్లకు అంతరాయం ఏర్పడుతోందని, నీటిని తొలగించిన కొద్ది ఊట నీరు రావడంతో పనులకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. హనుమకొండలో మొత్తం 35 సర్వీస్ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.

బంగారు బ్రాస్‌లెట్ అప్పగింత

వరంగల్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన బంగారు బ్రాస్‌లెట్‌ను హనుమకొండ పోలీసులకు ఓ యువకుడు అప్పగించాడు. వివరాల్లోకి వెలితే.. బొక్కలగడ్డకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఈద వంశీయాదవ్ అక్టోబరు 30న ఆఫీస్‌కు వెళుతుండగా యాదవనగర్ క్రాస్ వద్ద బంగారు బ్రాస్‌లెట్ కనిపించింది. బ్రాస్‌లెట్ తీసుకున్న వంశీ.. సీఐ శివకుమార్‌కు ఫోన్‌చేయగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని తెలుపడంతో వెంటనే హనుమకొండ చేరుకుని పోలీసులకు బ్రాస్‌లెట్‌ను అందజేశాడు. దీంతో వంశీని పోలీసులు అభినందించారు.



WANTED
★ Wanted Ward Boy 9 am to 9pm and Op Girl 11 am to 8 pm for Balaji Hospital, Opp Ram Laxman Theater SVN Road, Warangal. Cell.No : 9849070601, 9700334443, 8522807243
AJW-17970

WANTED
★ Wanted Teachers to Teach Primary, Eng, Maths, Wardens M/F, PET, Watchman, AVSHS Dharmaram, Warangal, Cell.No: 9848672108, 9848181976
AJW-6658

WANTED
★ Sai Manikanta RMC Required Marketing Staff And Accountants, Supervisor with in Warangal & Hanamkonda. Cell:- 7330871166, 7330841166
AJW-436

WANTED
★ Wanted Teachers to Teach Maths Physics VI to X Classes Contact ST-George School (E/M), Kadipikonda, Cell.No:- 9440325590
AJW-257067

WANTED
★ Lab-Technicians (Exp), Computer Operators (Exp), Dialasis Technicians (Exp) Contact : Guardian Hospital Mulugu 'X' Road Warangal. 2-3pm
AJW-579

WANTED
★ హనుమకొండ స్వచ్ఛంద సంస్థ నందు డిగ్రీ చదివి వార్డెన్‌గా పనిచేయుటకు మహిళలు కావలెను. ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వబడును. సం॥ప్ర॥ 7981833133, 8074465703
AJW-436

WANTED
★ హనుమకొండ స్వచ్ఛంద సంస్థ నందు Watchmen పనిచేయుటకు భార్య భర్తలు కావలెను. ఉచిత వసతి మరియు భోజనం. జీతం: 15,000 ఇవ్వబడును. సం॥ప్ర॥ 7981833133, 8074465703
AJW-438

PLOT FOR SALE
★ 200ft, NH-163 & 30ft రింగ్‌రోడ్ ఫేసింగ్ GWMC వరంగల్ పరిధిలో ఫుల్ డెవలప్, రాంపూర్ వెంచర్-1లో 16 ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ Ready to Construction. Bank లోన్ సౌకర్యం కలదు. సం॥ప్ర॥ 9010005556(రమేష్)
AJW-243545


PLOTS FOR SALE
★ మడికొండ హిల్స్‌కాలనీలో 200 చ॥గ॥ 5(E/F) 30X60 కొలతలతో శర్మలు ఇల్లు కట్టుటకు ఇండ్లు ధ్వరలో ప్లాట్లు అమ్మబడును. (LRS గలదు) డెవలపర్స్ ఇల్లు కట్టి అమ్మబోవచ్చు. సం॥ప్ర॥ 9010005556(రమేష్)
AJW-243545

PLOT FOR SALE
★ HNK నుండి కేవలం 2 కి.మీ దూరంలో 300చ॥గ॥ E/F ప్లాటు. LRS కట్టినది చుట్టూ కాంపౌండ్ వాల్‌తో గేటు, ఒక రూము కట్టిన # 28-5-474/2 అమ్మబడును. సం॥ప్ర॥ 9395561655
AJW-243524

PLOT FOR SALE
★ 300 గజాలు, East Facing, LRS Total Paid, Single Room with H.No: 28-5-474/2, చుట్టూ కాంపౌండ్ వాల్ With Gate సాయిక్రుప కాలని రెడ్డిపురం ప్రాపర్టీ అమ్మకానికి కలదు. సం॥ప్ర॥ 9395561655
AJW-243538

PLOT FOR SALE
★ Main Road 2nd bit west Facing Plot for Sale (Area 166/spy), 1/2Km Near to Mamnoor Airport, Govt Proposed 200ft Raod, Please Contact:- 6301315885
AJW-257022

PLOT FOR SALE
★ వరంగల్ గిర్మాజిపేట చాపలబండ రోడ్‌లో కమర్షియల్‌ప్లాట్ తూర్పురోడ్ 176 గజములు అమ్మబడును. సం॥ప్ర॥ 9989492264
AJW-257021

BUILDING FOR SALE

హన్మకొండలో 1126 గజాలలో 36,000 Sqft's మరియు G+3 నిర్మితమై, నెలకు 5లక్షల కిరాయిలు రాగల భవనము అమ్మబడును. స్కూల్/కళాశాలలకు అనుకూలం.
CELL.NO :8328484557

PLOT FOR SALE
★ వరంగల్ ఉర్సు ప్రతాప్ నగర్ కాలనీలో పశ్చిమ ముఖం కలిగిన 256 గజాలు గల ప్లాట్ ఇల్లుతో సహా అమ్మకానికి కలదు. సం॥ప్ర॥ 9948923577
AJW 257110

FLAT FOR SALE
★ 3 BHK Flat, 3rd Floor ANR అపార్ట్‌మెంట్స్, రిలయన్స్ ఫ్రెష్ దగ్గరలో Beside Risingsun school పోచంమైదాన్ వరంగల్, For Sale సం॥ప్ర॥ 9849351005
AJW-243544

HOUSE FOR SALE
★ ఉర్సు గుట్ట నుండి భూపాల్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Independent Houses అమ్మకానికి కలవు. సం॥ప్ర॥ 7660008666 / 8309035091
AJW-27939

HOUSE FOR SALE
★ At Adalath, Subedari, Postal Colony Lane, G+1, House is for sale 416 Sq.Yrds. Cont: 9676082226
AJW-4364

TO-LET
★ #1-7-1589 శ్రీనివాస నగర్, కాళోజీ క్షేత్రం దగ్గర, 2BHK 1st floor 8,500/-, 3rd floor 6000/- 24/7 CCTV అన్ని వసతులతో కిరాయికి కలదు. సం॥ప్ర॥ 9395561655
AJW-213537

ADMISSIONS
★ Paramaedical-DMLT, DOA, DOM, DMPHA, DMIT, DANS, DDIALY, DECG&DMST Limited Seats Only @PJPMC-Jangaon, Ph: 9515137392.
AJW-243367

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

FLATS FOR SALE
★ Kuda కాలనీ 100 ఫీట్ల రోడ్ SPR School దగ్గర Stilt Puls 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్ గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మబడును. సం॥ప్ర॥ 7660008666 / 8309035091
AJW-27987

FOR SALE
★ మంచి రన్నింగ్ కండిషన్లో ఉన్న బుక్, స్టేషనరీ మరియు గిఫ్ట్ సెంటర్ అమ్మబడును. లేబర్ కాలనీ, వరంగల్. సం॥ప్ర॥ 8919215394
AJW-257108

HOUSE FOR SALE
★ KU"X" Road Tata Motors Dream Land ఫంక్షన్‌హాల్ ఎదురుగా విశాల్ మార్ట్ ప్రక్కన అక్షర కాలని మెయిన్ రోడ్డుకు 200చ॥గ॥ G+2 నూతనంగా నిర్మించబడుతున్న అన్ని వసతులు గల ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును. సెల్: 9849007864
AJW-213439

FLAT FOR SALE
★ హన్మకొండ, నయీంనగర్, 5-11-116, తేజస్వి స్కూల్ ప్రక్కన, కల్లెడ అపార్ట్మెంట్, 404 ఫ్లాట్, 3 BHK, 1620 Sft, East Facing, With all Furnishinings అమ్మబడును. సం॥ప్ర॥ 9849142641.
AJW-243446

సైనసైటిస్ సతాయిస్తుందా...
★ నిరంతరం ముక్కు కారడం, తలనొప్పి, తుమ్ముల రావడం శ్వాసకు ఇబ్బంది ఉంటే సంప్ర॥ డా॥ పాపశెట్టి శ్రీధర్, హోమియోపతిషియన్, హన్మకొండ బస్టాండ్, బాలసముద్రం రోడ్, ఫైర్ స్టేషన్ ఎదురుగా, హన్మకొండ. సం॥ప్ర॥ 9959638214
AJW-7665

ఎంతటి అసాధ్యమైన వ్యాధులకైనను హోమియో
★ వైద్య చికిత్సకై సం॥ప్ర॥ 36 సం॥ల Exp. డా॥ CH. జితేందర్ BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్ OPP: న్యూ బస్టాండ్, హన్మకొండ. సం॥ప్ర॥ 9849117394
AJW-7690

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

ప్రజల కష్టాలు పట్టని వారికి పదవులెందుకు?

మంత్రి కొండా సురేఖపై ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల కష్టాలు పట్టని కొండా సురేఖకు మంత్రి పదవి ఎందుకని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రశ్నించారు. శనివారం ఓసిటీలోని తన నివాసంలో ఆయన మీడి యాతో మాట్లాడారు. మొంథా ప్రభావంతో వరంగల్‌లో పలు కాలనీలు నీట మునిగినా పట్టించుకోని మంత్రి సురేఖకు మంత్రి పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. మైసయ్యనగర్, బీఆర్‌నగర్, ఎన్‌ఎన్‌నగర్, శివనగర్, పెరుకవాడ, సంతోషిమాత కాలనీ తదితర ప్రాంతాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఓ వైపు వరదబాధితులు వారికి జరిగిన నష్టాన్ని వివరిస్తుంటే పక్కనుంచి ఫొటోలకు ఫోజులివ్వడం ఏంటని ఎద్దేవా చేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఆమె మంత్రి పదవి తీసుకొని వారికి చేసిందేమిటో చెప్పాలన్నారు.

ముఖ్యమంత్రి హనుమకొండను సందర్శించి వరంగల్‌ను విస్మరించడంలోనే మంత్రి సురేఖ పరపతి అర్థమవుతోందని విమర్శించారు. వర్షంతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందజేయాలన్నా రు. వరంగల్ తూర్పులో వరద ముంపునకు గురైన కాలనీవాసులకు కుటుంబానికి రూ. 25 వేల తక్షణ సహాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, నాయకులు సముద్రాల పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


హరీష్ చంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా హరీష్ చంద్రారెడ్డి బాధ్యతలు

వరంగల్ మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన హరీష్ చంద్రారెడ్డికి డాక్టర్ చిలుక మురళి, డాక్టర్ వసంతరావు, డాక్టర్ శశికుమారి, డాక్టర్ అశ్విని కుమార్, డాక్టర్ మమతలు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

గిర్మాజిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్- చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య వంచనగిరి రైల్వేగేటు సమీపంలో శనివారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. తను ఐదున్నర అడుగుల ఎత్తు, చామన చాయ రంగులో ఉన్నాడని, కడుపు ఎడమ వైపు పుట్టుమచ్చ ఉందని జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. అతడి వద్ద 3 విమల్ గుట్కా ప్యాకెట్‌లు మినహా ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురిలో భద్రపరిచామని, ఇతర వివరాలకు 9701747014/8712658585 జీఆర్‌పీ నెంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

గోడ కూలి బాలుడి మృతి


నవదీప్(ఫైల్)

సంగెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాత్రూమ్ గోడ కూలి బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని చింతలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. వేల్పుల సాంబరాజు కుమారుడు నవదీప్ (10) మచ్చాపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదుతున్నాడు కాగా, జనగామ జిల్లా బచ్చన్నపేటలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో సీటు వచ్చింది. నవదీప్‌ను సోమవారం సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో జాయిన్ చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి సాంబరాజు తండ్రి లచ్చయ్య దగ్గర నవదీప్‌ను వదిలి వెళ్లారు. స్థానికంగా ఉన్న కిరాణ షాపులో తినుబండారాలు కొనుగోలు చేసేందుకు నవదీప్ వెళ్తుండగా బన్న రమేశ్‌కు చెందిన బాత్రూమ్ కూలి బాలుడిపై పడడంతో తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతిచెందాడు. బాలుడి తాత లచ్చయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని సంగెం ఎస్సై వంశీ కృష్ణ పరిశీలించారు.

వరదపాలైన పురాతన వస్తువులు


వరద నీటిలో మునిగి అస్తవ్యస్తమైన మ్యూజియంలోని పురాతన వస్తువులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలోని మ్యూజియంలోని పురాతన వస్తువులు వరదల పాలయ్యాయి. వరద తాకిడితో నీటమునిగిన విజ్ఞానపీఠంలో 30ఏళ్లుగా సేకరించి భద్రపరిచిన పురాతన వస్తువులు నీటమునిగి అస్తవ్యస్తం అయ్యాయి. మ్యూజియం నీట మునిగిపోయి వస్తువులు పాడైపోయాయని, మ్యూజియాన్ని పునర్ధరించేందుకు ప్రభుత్వం చేయూతనివ్వాలని పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న కోరారు.

వరద బాధితులను ఆదుకుంటాం

- నష్టపోయిన వారు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి
- అర్హులైన బాధితులకు నెల రేషన్, రూ.15వేల సాయం
- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో మేయర్.. అధికారులతో కలిసి పర్యటించారు. పలు కాలనీల మహిళలు, వరద బాధితులతో కలిసి మాట్లాడారు. 29వ డివిజన్‌లోని ఎస్‌సీ కాలనీ, బాబీ ఫంక్షన్ హాల్, రఘునాథ్ కాలనీ, పోతననగర్ ప్రాంతాల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కాలనీలలో నీరు నిలిచిన ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, సంబంధిత అధికారులను పురమాయించామన్నారు. కాలనీలలో యుద్ధప్రాతిపదికన శానిటేషన్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావం వల్ల రోడ్లు ధ్వంసం అయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వరద బాధితులను గుర్తించి ఒక నెల రేషన్‌తో పాటు ఇండ్లు కూలిపోయిన వారికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అర్హులైన బాధితులు సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలని, విచారణ తర్వాత పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రవికుమార్, ఆర్‌వో శ్రీనివాస్, డీఈ శ్రీకాంత్, ఆర్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రామన్నపేటలో పర్యటన...

మేయర్ గుండు సుధారాణి శనివారం భద్రకాళి బండ్ రామన్నపేట ప్రాంతంలో గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసిన పర్యటించారు. సమర్థవంతంగా పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తుఫాను ప్రభావం వల్ల 29వ డివిజన్ పరిధిలోని రామన్నపేటతో పాటు చుట్టు పక్క ప్రాంతాలు నీట మునిగాయన్నారు. భద్రకాళి చెరువులో నీటి ప్రభావం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తగు ప్రత్యమ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు తక్షణ పనులు ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ రవికుమార్, డీఈ శ్రీకాంత్‌రెడ్డి, శానిటరి సూపర్‌వైజర్ శ్రీనుతో పాటు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై బురదను త్వరగా తొలగించాలి..

మొంథా తుఫాను కారణంగా రోడ్లపై చేరుకున్న బురదను వేగవంతంగా తొలగించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ పరిధిలోని వాజ్‌పాయ్ కాలనీ, టీవీ టవర్ కాలనీ, ప్రగతి నగర్, వివేక్ నగర్ కాలనీ, అమరావతి నగర్, సమ్మయ్యనగర్ వరద ప్రభావిత ప్రాంతాలలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరద ప్రభావం వల్ల దెబ్బతిన్న ఇండ్లతోపాటు ఏర్పడిన నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. ఇండ్లతో పాటు రోడ్లపై నిలిచిన చెత్త, బురదను యాంత్రిక పరికరాలతో పాటు శానిటేషన్ సిబ్బంది ద్వారా శుభ్రం చేయించాలన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీలో సరఫరా అవుతున్న మంచినీటిని పరిశీలించారు. మంచి నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రాజ్‌కుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.



భళా లోకేష్

- పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న యువకుడు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో 16 బంగారు, 6 రజత, 3 కాంస్య పతకాలు కైవసం
- దివ్యాంగుడైనప్పటికీ బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి
- కోచ్ వేణు శిక్షణలో పరిమళిస్తున్న ప్రతిభ
- పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కు ఎంపిక



13వ నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం అందుకుంటున్న లోకేష్ (ఫైల్)

ఖానాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అతడు పుట్టుకతోనే దివ్యాంగుడు... కానీ తనలోని లోపాన్ని చూసి అధైర్యపడలేదు. చిన్ననాటి నుండే క్రీడల పట్ల మక్కువ పెంచుకున్నాడు. ఆటలపై ఇష్టం అతడిని పాఠశాల స్థాయిలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేలా చేసింది. పాఠశాల స్థాయిలో కబడ్డీతో మొదలైన అతడి ప్రస్థానం అథ్లెటిక్స్, త్రైక్వాండో పోటీలలో దేశానికి ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదిగాడు. డిసెంబర్‌లో దుబాయ్‌లో



తల్లిదండ్రులతో లోకేష్

జరగబోయే పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కి ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. అతడే. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన పారా అథ్లెట్ ఆకుల లోకేష్.

నేపథ్యం..

ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఆకుల ఉప్పలయ్య -మంజుల దంపతుల చిన్నకుమారుడు లోకేష్ పుట్టుకతోనే దివ్యాంగుడు. అతడికి ఎడమచేయి లోపం ఉంది. చిన్ననాటి నుంచి అతడికి ఆటలంటే ఎంతో మక్కువ. 7వ తరగతి చదువుతున్నప్పుడు పాఠశాల స్థాయి పోటీలలో పాల్గొని షాట్‌పుట్‌లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పొందాడు. 2016లో పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికై బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ఆడాడు. 2017లో పాఠశాల స్థాయిలో హైద్రాబాద్‌లో జరిగిన స్టేట్‌మీట్ అథ్లెటిక్స్‌లో పోటీలలో పాల్గొని షాట్‌పుట్, రన్నింగ్ (200 మీటర్ల విభాగంలో)పోటీలలో బంగారు పతకాలు గెలుచుకున్నాడు. వీటితో పాటుప్రతి ఏటా ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని ప్రతిభ చూపి పతకాలు సాధించాడు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో..

లోకేష్ 2021లో భువనేశ్వర్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నాడు. ప్రతిభ ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో రాణించలేకపోయాడు . అక్కడే లోకేష్‌లోని ప్రతిభను గుర్తించిన పారా అథ్లెట్ కోచ్ వేణు హైదరాబాద్ స్పోర్ట్స్ హాస్టల్‌లో సదుపాయం కల్పించాడు. కఠిన శిక్షణ ఇచ్చి గొప్పగా తీర్చిదిద్దాడు . ఈ క్రమంలో 2021లో గుజరాత్‌లో జరిగిన 12వ నేషనల్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ పోటీలలో లోకేష్ పాల్గొని షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించాడు. వెంటనే లోకేష్‌కు ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీలో చోటు కల్పించారు. 2024 జులైలో బెంగుళూరులో జరిగిన 13వ నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్ (19)విభాగంలో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించి ఔరా అనిపించాడు. లోకేష్ దేహదారుఢ్యం బలంగా ఉండడంతో కోచ్ వేణు అథ్లెటిక్స్‌తో పాటు త్రైక్వాండో పోటీలకు శిక్షణ ఇచ్చారు. దీంతో సెప్టెంబర్‌లో పంజాబ్‌లో జరిగిన పారా యూత్ ఏషియన్ గేమ్స్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి డిసెంబర్‌లో దుబాయ్‌లో జరుగబోయే పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కి ఎంపికయ్యాడు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో 16 బంగారు పతకాలు,6 రజత పతకాలు,3 కాంస్య పతకాలు సాధించాడు.

పారా ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

- అవుల లోకేష్, పారా అథ్లెట్

పారా ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే నా జీవిత లక్ష్యం. ముందుగా యూత్ ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించడానికి కష్టపడుతున్నా. కోచ్ వేణు పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నాను. తప్పక పతకం సాధిస్తానన్న నమ్మకం ఉంది. పోటీలకు వెళ్లడానికి నా ఆర్థిక పరిస్థితి సరిపోవడం లేదు. దాతలు, ప్రభుత్వం స్పందించి దుబాయి వెళ్లడానికి సహకరించాలి.



కొంకపాకలో పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే మంజూరు చేయాలి
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్

పర్వతగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొంకపాక గ్రామంలో పంట నష్టపోయిన క్షేత్రాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల భారీ తుఫాన్‌తో లక్షలాది ఎకరాల్లో పంటల నష్టం జరిగి రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి ఎకరాకు రూ.30 వేలు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు మంజూరి చేయాలని, చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన తుఫాన్ బారిన పడిన పంటల వివరాలు సేకరించాలన్నారు. తాత్కాలికంగా రూ.20 వేలు, 50 కిలోల బియ్యం, బెట్ షీట్లు, చెద్దర్లు, బట్టలు ఇవ్వాలని కోరారు. పశువులు కోల్పోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. అనంతరం రావూరు గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ దొమ్మటి లక్ష్మీ నారాయణ బైక్ ప్రమాదంలో గాయాలపాలు కాగా, ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, చింతపట్ల సోమేశ్వర్ రావు, మాడుగుల రాజు, చిన్నపాక శ్రీనివాస్, రంగు కుమార్, మోహన్ రావు, మేరుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రీడా సందడి

ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 ఎంపిక పోటీల షురూ



జిమ్నాస్టిక్స్ పోటీల్లో తల పడుతున్న క్రీడాకారిణి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కఠోర సాధన, పట్టుదలతో శ్రమించడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు చేరుకోవచ్చని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ లోని జిమ్నాస్టిక్స్ హాల్లో శనివారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి అండర్-14, 17బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో క్రీడా పోటీలను అడిషనల్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు అవసరమన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎదగాలంటే జిల్లా స్థాయి నుంచే ఆటల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని సూచించారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారులు తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పథకాలు సాధించి జిల్లాకు కీర్తి, ప్రతిష్టలు తీసుకరావాలని ఆకాక్షించారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి అండర్-14, 17బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో క్రీడాంశాల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఈ క్రీడా పోటీలు 3రోజుల పాటు కొనసాగుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో త్వరలో నిర్వ హించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు (టీజీపేట) శీలం పార్థసారథి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసి యేషన్ (ఎస్ఏపీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రభాక ర్‌రెడ్డి, డి.కుమార్, కన్వీనర్లు సీహెచ్. పెద్దిరాజు, ఎం.సురేష్‌బా బు, వి.రాణి, ఎస్.శ్రీలత, జూడో అబ్జర్వర్ సత్యనారాయణ, కోచ్‌లు నీలం సురేష్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్.సుభాష్, జి. రవీంద్రప్రసాద్, రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి, రోడ్డును పునఃనిర్మించాలి

» స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి » ధ్వంసమైన పంటలు, రహదారుల పరిశీలన » ఇరిగేషన్ అధికారులపై రైతుల ఆగ్రహం

ధర్మసాగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. ధర్మసాగర్ మండలంలో దేవునూర్ గ్రామంలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరి పంటలను, ధ్వంసమైన బ్రిడ్జి, రోడును శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. దేవునూర్ బ్రిడ్జి నుంచి రాపాకపల్లి గ్రామానికి వెళ్లే బ్రిడ్జి వరకు కాలినడకన వెళ్లి నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారుల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయామని రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన తమ పంటలు నీటిలో మునిగి నష్టపోయామని దేవునూర్ గ్రామానికి చెందిన రైతులు నార్లగిరి సమ్మయ్య, చిట్టి రవి పురుగుల ముందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని పురుగుల మందు డాబ్బాలను లాక్కుని సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మరో రైతు మోరే మహేందర్ సాగు చేసిన మూడు ఎకరాల వరి పంట పూర్తిగా నష్టం వాటిళ్లడంతో మన స్తాపం చెంది పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా వారించారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. వర్షం వల్ల నష్టం జరిగితే రైతుల అదృష్టం బాగాలేదని అనుకుంటాం.. కానీ, దేవాదుల ప్రాజెక్ట్ కాలువ గేట్ల వరద వల్ల రైతుల పంటలు మునిగిపోతే పరిహారం ఎవరు చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. దేవునూర్ బ్రిడ్జి మరమ్మతు, రోడ్డు పనులను 15 రోజుల్లో పూర్తిచేసి నిలిచిపోయిన రాకపోకలను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. దేవునూర్ బ్రిడ్జి, రోడ్డు తాత్కాలిక మరమ్మతు పనుల కోసం సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసి త్వరితగతిన పనులను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వపరంగా మంజూరు చేసిన నిధులు సరిపోకుంటే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఈజీఎస్ నిధులు మంజూరు చేయిస్తామని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వరద వల్ల రైతుల పంటలు నష్టపోకుండా ఉండాలంటే వాగును వెడల్పు చేయాలని, ఇందుకోసం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులను గుర్తిస్తే ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పనులను చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రైతులు సహకరించాలని, పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఏదో విధంగా ఆర్థిక సాయం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, మండల నాయకులు పాషా, రఘు, కుమార్, మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి రాజేష్, ఆర్ఐ అనిత తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి





పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

నేడు శాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష శాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఈ నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం శాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ తన 50 ఏళ్ల విద్యా ప్రావీణ్య సంప్రదాయాన్ని కొనసాగిస్తుందన్నారు. దేశంలోనే ఉత్తమ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా శాట్ క్యూ పరీక్షను నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకొని ఉత్తమ స్కాలర్‌షిప్ అవకాశాలను పొందాలన్నారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



శాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న వరదారెడ్డి

ఇప్పటికైనా కదిలేనా!?

(5వ పేజీ తరువాయి)

అడ్డు వస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో మరో 321కి పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు సమాచారం. ఈ అక్రమ కట్టడాల వల్ల హంటర్‌రోడ్డులో పలు కాలనీల్లోకి వరద నీరు చేరుతోంది.

అలాగే వరంగల్ దేశాయిపేటలోని చిన్నవడ్డేపల్లి చెరువు 70.74 ఎకరాల్లో విస్తరించి ఉండగా, సుమారు 35 ఎకరాలకు పైగా చెరువు భూమి కబ్జాకు గురైంది. చెరువు శిఖంను అక్రమించుకుని 329 అక్రమ నిర్మాణాలు చేపట్టగా, కేవలం 12 అక్రమ కట్టడాలనే అధికారులు కూల్చివేసి, 110 కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇంకా 211 అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. అలాగే కాజీపేటలోని నిట్ వెనకాల ఉన్న బంధం చెరువు సుమారు 65.20ఎకరాల్లో విస్తరించి ఉంది. దాదాపు ఈ చెరువులో 366 అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లుగా అధికారులు గుర్తించారు. అయితే కేవలం పాతిక అక్రమ కట్టడాలనే కూల్చివేసిన అధికారులు.. మరో 125 అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చి మరిచిపోయారనే విమర్శలు ఉన్నాయి. మిగతా 220 అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు లేకపోవటం వెనుక మతలబేమిటనే చర్చ జరుగుతోంది.

అలాగే పైడిపల్లి శివారులో హనుమాన్ జంక్షన్ సమీపంలోని కోటచెరువు 172.40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 70ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లుగా గుర్తించారు. ఈ చెరువు భూముల్లో 150 అక్రమ కట్టడాలు నిర్మించారు. అధికారులు 4 అక్రమ నిర్మాణాలను తొలిగించి, 50మందికి నోటీసులు ఇవ్వగా, మిగతా 96 అక్రమ నిర్మాణాలపై దాటవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హనుమకొండలోని వడ్డేపల్లి చెరువు 556.32 ఎకరాల్లో విస్తరించి ఉండగా, దీనిలో సుమారు 100 ఎకరాల వరకు భూమి అక్రమణకు గురైనట్లుగా ఆరోపణలున్నాయి. చెరువు కట్టను అక్రమించుకుని ఫంక్షన్ హాల్స్, అపార్ట్‌మెంట్స్ నిర్మించారని ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలున్నాయి. అలాగే గోపాల్‌పూర్ చెరువు నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిల్లో కరిగిపోయిందనే విమర్శలు ఉన్నాయి. అక్రమాలతో గోపాల్‌పూర్ చెరువు నీళ్లు కాలనీలను ముంచెత్తింది. ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల్లో కబ్జారాయుళ్లు తిష్టవేసి చెరువులనే మింగేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మురికిలోనూ కబ్జాలే..

మురికి కాలువలను కూడా కబ్జాకోరులు వదలటం లేదు. నయీంనగర్ నాలాకు ఇరువైపులా భారీగా కబ్జాలు చేశారు. 5.55 కిలోమీటర్లు ప్రయాణించే నయీంనగర్ నాలాకు వడ్డేపల్లి చెరువు నుంచి గోపాలపూర్ ఊర చెరువు వరకు 136 అక్రమ కట్టడాలు నిర్మించారు. వీటిలో అధికారులు కేవలం 36 అక్రమ నిర్మాణాలనే తొలగించగా, మిగతా అక్రమ నిర్మాణాలను తొలిగించటంపై కార్పోరేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో పలువురు కోర్టును ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలాగే నయీంనగర్ నాలాలో మరో భాగం రాజాజీనగర్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ బ్రిడ్జి వరకు 147 అక్రమ కట్టడాలు ఉన్నాయి. వీటిలో 56 అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించగా, 33 నిర్మాణాలపై కోర్టు నుంచి స్టే అర్డర్ తెచ్చుకున్నారు. మిగిలినా అక్రమ నిర్మాణాలను తొలగించటంలో అధికారులకు రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నాయి. అలాగే భద్రకాళి నాలా 3.63కిలో మీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో పోతననగర్, అంలకార్ బ్రిడ్జి, అలాగే కాపువాడ, భద్రకాళి మత్తడి, అలంకార్ బ్రిడ్జి వరకు మొత్తం 101 అక్రమ కట్టడాలు ఉన్నట్లుగా గుర్తించారు. అలంకార్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ వరకు 30 అక్రమ నిర్మాణాలు ఉండగా, 11 నిర్మాణాలను తొలగించారు. మిగతా 19 అక్రమ కట్టడాల వైపు చూసేందుకు అధికారులు జంకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక హంటర్‌రోడ్డులో బొందివాగు నాలా 0.84కిలో మీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో బెస్తం చెరువు నుంచి జక్కలొద్ది వరకు 8 అక్రమ నిర్మాణాలు ఉండగా, నాలుగు కట్టడాలపై కోర్టులో కేసు నడుస్తున్నది. సాకరాశికుంట నాలా 6.40కిలో మీటర్లు నగరంలో ప్రవహిస్తోంది. ఈ నాలాకు ఇరువైపులా 102 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించేందుకు అధికారులు ముందుకు రాకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

మొత్తం వరంగల్ మహానగరంలో నాలుగు ప్రధాన నాలాలకు ఇరువైపులా 524 అక్రమ కట్టడాలను గుర్తించారు. ములుగురోడ్డు సమీపంలో కొందరు అక్రమార్కులు 40 ఎకరాల భద్రకాళి నాలా భూములను అక్రమించుకుని దర్జాగా వ్యాపార నిర్మాణాలు చేపట్టారు. వేల కోట్ల విలువైన నాలా భూములు కబ్జాకోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. భద్రకాళి నాలా వద్ద ఎల్‌బీ కాలేజీ సమీపంలో 60మంది రజక కులస్తులకు కేటాయించిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించుకుని దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ఆ కులస్థులు పదేళ్లకు పైగా పోరాటం చేస్తున్నారు. నాలాల ద్వారా బయటకు వెళ్లాల్సిన వరద నీరు రోడ్డెక్కుతోంది.

అయితే సీఎం ఆదేశాలను అమలు చేసేందుకు అధికారులు ముందుకు వస్తారా..? వస్తే రాజకీయం అడ్డు తగలకుండా ఉంటుందా అనే చర్చ జరుగుతోంది. గోపాల్‌పూర్ చెరువు అక్రమణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధులే కాకుండా, ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలు ఉన్నారనే ప్రచారం ఉంది. అలాగే చిన్నవడ్డేపల్లి చెరువుల, బంధం చెరువు, కోటా చెరువు, భద్రకాళి చెరువు శిఖం అక్రమణలో అన్ని పార్టీల్లోని కొందరు కీలక నేతలు, వారి అనుచరగణం ఉంది. రాజకీయ బెదిరింపులను తట్టుకుని అధికారులు కబ్జాలపై కన్నెత్తి చూడగలరా? అనే చర్చ నడుస్తోంది.

అధికారుల్లో కదలిక వచ్చేనా ?

మొంథా తుఫాన్‌కు వరంగల్ జలమయం కావటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. వరంగల్ నగరానికి ప్రధానంగా ఉన్న గొలుసుకట్టు చెరువుల అక్రమణ, నాలాల కబ్జాలే వరద ముంపునకు కారణంగా గుర్తించారు. దీంతో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో నాలాల కబ్జాలు, చెరువుల అక్రమణపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, పది మంది కోసం వేల మందిని ఇబ్బంది పెట్టడం సరికాదని సీఎం అన్నారు. కబ్జాల్లో ఎంతటి వారు ఉన్న వదలకుండా చర్యలకు దిగాలని ఆదేశాలు జారీ చేశారు.

చోరీల నిందితుడి అరెస్టు

- రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి రూ.6 లక్షల విలువ చేసే 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. శనివారం కేయూ పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేరుల సమావేశంలో నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. కొమురంభీం అసిఫాబాద్ జిల్లా వాంకిడి, తేజిగూడకు చెందిన సెండె అరుణ్‌కుమార్ 2022లో వరంగల్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ పూర్తి చేసిన తరువాత ఒక సంవత్సరం ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ తల్లిదండ్రులతో జీవనం సాగించాడు. 2024లో ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు హనుమకొండకు వచ్చి గది అద్దెకు తీసుకొని చదువుకునేవాడు. ఈ క్రమంలోనే అరుణ్‌కుమార్ బెట్టింగులకు బానిసై చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గోపాల్‌పూర్, భీమారం ఏరియాలలో ఇంటికి తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి పూట తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లేవాడు. నిందితుడు సుమారు 10 నేరాలు చేసినట్లు అంగీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా నిందితుడి వద్ద 10 కేసులలో మొత్తం రూ.6 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కేయూసీ ఎస్సైలు పి.శ్రీకాంత్, కె.నవీన్‌కుమార్, క్రైం సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖ ర్, జితేందర్, సీసీఎస్ వరంగల్ సిబ్బంది టి. మధు, బి.చందులను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు

- బతికున్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో చర్యలు
- విధులను నిర్లక్ష్యం చేయొద్దు : ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మానుకోట జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెహ్రూ సెంటర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు విధులను నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, అలా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆస్పత్రిలో నర్సులు.. కాలక్షేపం చేస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పనిచేయిస్తున్నారన్న విషయం కూడా తెలిసిందని పేర్కొన్నారు. ఈ విషయంపై మరోసారి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. ఆదివారం నుంచి ఏ ఒక్క ఉద్యోగి ఆస్పత్రిలో విధుల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ ఉపయోగించవద్దన్నారు. అత్యవసరమైతే స్మార్ట్ ఫోన్‌లకు బదులుగా కీప్యాడ్ ఫోన్‌లను ఉపయోగించాలన్నారు. ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సీహెచ్.వెంకన్న (సెక్యూరిటీ గార్డు), రాజన్న (శానిటేషన్ సూపర్‌వైజర్)లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆదే శించారు. కాగా, ఇరువురిని విధుల నుంచి తక్షణమే తొలగించినట్లు ఆస్పత్రి సూపరిం డెంట్ బత్తుల శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ లకావత్ వెంకట్, జిల్లా ఆస్పత్రి ఆర్ఎంవో బానోత్ జగదీష్ ఉన్నారు.

ఘనంగా అళ్వారుస్వామి జయంతి

కేయూ క్యాంపస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, కవి వట్టికోట అళ్వారుస్వామి జయంతిని శనివారం కేయూ తెలుగు విభాగంలో ఘనంగా నిర్వహించారు. విభాగాధిపతి మామిడి లింగయ్య ఆధ్వర్యంలో అళ్వారుస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. అళ్వారుస్వామి ప్రజలను చైతన్యవంతం చేసే రచనలు చేశారని గుర్తు చేశారు. తెలుగు బీవోఎస్ చైర్మన్ చిర్రా రాజు గౌడ్ మాట్లాడుతూ.. అళ్వారుస్వామి సాహిత్యాన్ని అధ్యయనం చేసి చైతన్యం పొందాలన్నారు. అళ్వారుస్వామి గొప్ప రచయిత అని డాక్టర్ సదాశివ చెప్పారు. పీడీఎఫ్ స్కాలర్ స్వామినాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.


అళ్వారు స్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు


సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్

సేంద్రియ, గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- వాటి వినియోగంతో ఆరోగ్యం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేచురల్ జాతీయ సేంద్రియ గ్రామీణ ఉత్పత్తుల రైతుల సంతను శనివారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల వినియోగం వలన మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. గ్రామీణ రైతులు ఉత్పత్తి చేసే సేంద్రియ ఆహార పదార్థాలు, మారుతున్న మోడరన్ ఫుడ్ కంటే ఎంతో మెరుగైనవన్నారు. రైతులు ఏర్పాటు చేసుకున్న ఈ ఉత్పత్తుల సంత ద్వారా వారికి కొంత మేరకు మార్కెట్ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వినియోగదారులు నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తులను నేరుగా రైతుల వద్ద నుంచే పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నేచురల్ సేంద్రియ రైతుల సంత నిర్వాహకులు బయ్య సారయ్య, నిమ్మల శ్రీనివాస్, అగ్రి హార్టికల్చర్ సొసైటీ అడ్వయిజర్ నల్లమాల వెంకటేశ్వర్‌రావు, ఖమ్మం పట్టణ సంత నిర్వాహకురాలు మాధవి, మహిళా రైతు చిన్నాల అనిత, చిలుకమారి సంజీవరావు, కుసుమ సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన


మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కారణంగా పలు కాలనీల్లో వరద నీరు చేరడంతో ప్రజలకు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. శనివారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య 49వ డివిజన్ పరిధిలోని రైల్వే ట్రాక్ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ, బొడగుట్ట తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించి పలు సూచనలు చేశారు. వైద్యాధికారి, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఒక్కో బృందంలో ఇద్దరి చొప్పున ఏఎన్‌ఎంలు, ఆశాలతో ఐదు బృందాలను ఏర్పాటు చేసి కాలనీలలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం మొత్తం 125 ఇళ్లను సందర్శించి, అవసరమైన వారికి మందులను అందజేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సృజన, డెమో వి.అశోక్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రాజశ్రీ, స్వరూప, హెల్త్ అసిస్టెంట్లు ప్రసాద్, మధు, అరుణోదయ, సరిత, శారద, పూజ, అనిత, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏకతా దివస్‌లో వరంగల్ కళాకారులు

స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద నృత్య ప్రదర్శన


గుజరాత్‌లో జరిగిన ఏకతా దివస్‌లో పాల్గొన్న కళాకారులు

హనుమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఏకతా దివస్‌ను పురస్కరించుకొని గుజరాత్‌లోని ఏకతానగర్ కెవాడియా వద్ద ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో ఘనంతా నిర్వహించిన వేడుకల్లో హనుమకొండకు చెందిన సద్గురు శివానంద నృత్యమాల సంస్థ కళాకారిణులు త్రిపాద, మనస్విని, సాత్విక, రుతికా, హరిప్రియ రెడ్డి, వైష్ణవి, శృతి సమన్వి, వినయా రెడ్డి పాల్గొన్నారు. తమ నృత్య ప్రదర్శనతో ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కళాకారుల బృందానికి నృత్యమాల వ్యవస్థాపకుడు, ప్రముఖ నృత్య గురువు సుధీర్‌రావు నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొని దేశ ప్రజలచేత ఏకతా ప్రతిజ్ఞ చేయించారు. జాతిని ఉద్దేశించి ప్రసంగించారు.

నిట్‌లో ఐక్యతా పరుగు

పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు


ఐక్యతా పరుగులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

హనుమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎన్ఐటీలోని ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఐక్యతా పరుగును నిర్వహించారు. జాతీయ ఏకతా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని గుర్తు చేసుకుంటూ ఈ పరుగును నిర్వహించారు. నిట్‌లోని పరిపాలనా భవనం ముందు ప్రారంభమైంది. విద్యార్థులు, అధ్యాపకులు, ఐక్యత, సౌభ్రాతృత్వం, జాతీయ సమైక్యత పట్ల అంకితభావాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్, అకడమిక్ డీన్, స్టూడెంట్ అక్టివిటీ సెంటర్ అధ్యక్షుడు, ఈబీఎస్‌బీ క్లబ్ ఫ్యాకల్టీ అడ్వైజర్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

నాలాల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాలాల ఆక్రమణపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శనివారం గ్రేటర్ 56వ డివిజన్ పరిధి భీమారం శ్యామల చెరువు మత్తడితో పాటు నాలాను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. శ్యామల చెరువు మత్తడి నుంచి వచ్చే వరద నీరు వెళ్లేందుకు నాలా సౌకర్యం లేక వరద


భీమారం శ్యామల చెరువు నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

చెరువు కట్టను ఆనుకొని చింతగట్టు క్యాంపులోని ప్రధాన రహదారిపైకి చేరడంతో పాటు గ్రామంలోని పలు కాలనీలు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. శ్యామల చెరువు మత్తడి నీరు వెళ్లే నాలాను స్థానిక నాయకుడు సురేందర్‌గౌడ్‌తో పాటు పలువురు కబ్జా చేసి వరద నీరు సాఫీగా వెళ్లకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. దీంతోనే భీమారంలోని పలు కాలనీల్లోకి చెరువు మత్తడి నీరు చేరి గ్రామం ముంపు ప్రాంతంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నాలాలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ప్రజల ఇబ్బందులకు కారణమైన నాలాల కబ్జాపై సత్వర చర్యలు తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, నాయకులు గడ్డం శివరాం, ఆకుల కుమార్, అటికం రవీందర్‌గౌడ్, నాతి రమేష్, శ్రీధర్, రమేష్, సంగాల విక్టర్‌బాబుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండ

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో హనుమకొండ 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్ ఊర చెరువు కోతకు గురైన ముంపు ప్రాంతాలు టీఎన్జీవోస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జవహర్ కాలనీలలో శనివారం ఆయన క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ నీట మునిగిన ప్రతీ ఇంటిని ప్రభుత్వం ద్వారా సర్వే నిర్వహించి రూ.15వేలతో పాటు రేషన్ బియ్యం అందిస్తామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాంప్రసాద్, పెసరు శ్రీనివాస్‌రెడ్డి, పల్లకొండ విజయ్‌సూర్య, స్వరూప ఉన్నారు.

టీఎన్జీవోస్ నేతకు పరామర్శ

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కార్యదర్శి, జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య గుండెకు సంబంధించి స్టంట్స్ వేయించుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం హనుమకొండ 56వ డివిజన్ జవహర్ కాలనీలోని నివాసంలో సోమయ్యను కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకుని సమాజానికి సేవ చేయాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఎమ్మెల్యే వెంట 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింత రమేష్ గౌడ్, రుద్రోజు మణీంద్ర నాథ్, గుగులోత్ స్వరూప, లావుడ్య రవి నాయక్, బూర్ల శ్రీను, మోరె అనిల్, పల్లకొండ విజయ్, జిల్లపల్లి చిరంజీవి తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు డిమాండ్ చేశారు. మొంథా తుఫాన్ నష్టంపై హసన్‌పర్తి సీపీఎం మండల కమిటీ సభ్యులు పుల్ల అశోక్ ఆధ్వర్యంలో కమిటీ బృందం మండలంలోని పంట క్షేత్రాలను శనివారం సందర్శించి సర్వే చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రాములు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.80వేల పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వేలు రజిత, జోరిక మొగిళి, తాళ్లపల్లి జయ, ఐలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.


నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో డిసెంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కలెక్టర్ స్నేహ శబరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చెకుముకి నిర్వహణకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అర్థించారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చెకుముకి సైన్స్ పత్రికలు ప్రతి ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవలసిందిగా నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాములు, ఉమామహేశ్వర్ రావు, మురళి, ఫైజుల్ రెహమాన్, అమన్‌లు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి లక్ష బిల్వార్చన


బిల్వార్చనలో రుద్రేశ్వరుడు

హనుమకొండ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీకశుద్ధ ఏకాదశి వేళ శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. నిత్యాహ్నికం అనంతరం రుద్రేశ్వరుడికి పాశుపత రుద్రాభిషేకం అనంతరం భక్తుల గోత్ర నామాలతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ప్రభాకర్, స్వరూప దంపతుల సౌజన్యంతో శివప్రీతికర ప్రకృతి సహజమైన మారేడుదళాలతో శివనామాలు స్మరిస్తూ ఏకబిల్వం, శివర్పణం అంటూ బిల్వార్చనను నిర్వహించారు. ప్రణవ్, శ్రవణ్ కుమార్, మణికంఠ శర్మలు వేదోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నారాయణస్వామి కల్యాణోత్సవంతో పాటు లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఈవో అనిల్ కుమార్ చెప్పారు.

అండగా ఉంటాం

అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి

వడ్డెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన అపార్ట్‌మెంట్ల ఓనర్లకు తమ సంఘం అండగా నిలుస్తుందని వరంగల్ ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రెంటాల కేశవరెడ్డి అన్నారు. హనుమకొండ కేయూ వంద ఫీట్ల రోడ్డులోని అమరావతి నగర్‌లో గల శ్రీహోమ్స్ అపార్ట్‌మెంట్‌ను ట్రైసిటీస్ అసోసియేషన్ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ శ్రీహోమ్స్ అపార్ట్‌మెంట్స్‌లో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట వరంగల్ ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నడుముల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, ఉపాధ్యక్షుడు బొప్ప శివశంకర్, శ్రీహోమ్స్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు పిండి నరేందర్‌రెడ్డి, కార్యదర్శి బండారి శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మడికొండలో కూలిన ఇల్లు

మడికొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మడికొండ శివాలయం వీధిలోని చింతగట్టు సుజాత-కుమారస్వామిగౌడ్‌ల పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో వారు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశం మేరకు 46వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, సీనియర్ నేత వస్కుల శంకర్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే నాగరాజుతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.


కూలిన ఇంటి వద్ద బాధితులు సుజాత, కుమారస్వామి గౌడ్

చక్రవర్తి ఆస్పత్రిలో అరుదైన చికిత్స

ఆస్పత్రి డైరెక్టర్ తరుణ్ కుమార్ రెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళా రోగికి పక్కటెముకలతోపాటు డయాఫ్రం చిట్లిపోగా అత్యంత అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలను కాపాడినట్లు హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆటోలో ప్రయాణిస్తున్న 22 ఏళ్ల మహిళ ఆటోలో నుంచి కిందజారి పడిపోయిందని తెలిపారు. కడుపులో, ఛాతి భాగంలో బలమైన గాయాలు కాగా, హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించారని డాక్టర్ తరుణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అక్కడి వైద్యులు పరీక్షించిన వెంటనే ఆపరేషన్ చేయాలని, లేకపోతే రోగికి ప్రమాదం ఉంటుందని, ఖర్చు కూడా అధికంగా అవుతుందని చెప్పడంతో భరించలేని స్థితిలో ఉన్న రోగి బంధువులు తమను ఫోన్ సంప్రదించినట్లు పేర్కొన్నారు. వెంటనే తమ ఆస్పత్రికి తరలించి, వెంటనే ఆపరేషన్ చేసి డయాఫ్రమ్ రిపేర్ చేసి ఊపిరితిత్తుల్లో జమ అయిన రక్తస్రావాన్ని తొలగించి రోగి పరిస్థితిని మెరుగుపర్చినట్లు వెల్లడించారు. ఆపరేషన్ పూర్తయిన 24 గంటల్లో రోగి శ్వాస తీరు 100శాతం మెరుగుపడినట్లు తెలిపారు. ఆపరేషన్ చేసిన వైద్య బృందానికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ చేసిన బృందంలో డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ చంద్రిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ తరుణ్ కుమార్‌రెడ్డి

'చలో ఓయూకు తరలిరావాలి'


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్ లోథ్

కేయూ క్యాంపస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నవంబరు 4న రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల చలో ఉస్మానియా వర్సిటీకి తరలిరావాలని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ పిలుపునిచ్చారు. శనివారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వర్సిటీల్లో 1335 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నారని చెప్పారు. 7వ వేతన ఒప్పందం మేరకు బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతో పాటు 3శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని ఓయూలో ర్యాలీ చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో తమను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. తమకు ఉద్యోగ భద్రతకల్పించాలని, యూజీసీ 7వ పేస్కేల్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు దామెర భిక్షపతి, పుల్లా రమేశ్, చందూలాల్, సాయిచరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయాలి'

వడ్డెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఆపరేటర్లు, టైపిస్టు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మసూద్ అలీ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జంక్షన్‌లోని టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లుగా పనిచేసి పదవీ విరమణ పొందిన వారి తో విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ చేసిన వారికి ఆపరేటర్లుగా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు రమేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు బహుమతులు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మడికొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. డ్రాయింగ్‌లో డి.అజయ్ ప్రథమ, ఫోక్ సాంగ్‌లో ఎం.అక్షిత్ ద్వితీయ, స్టోరీ రైటింగ్‌లో ప్రశాంత్ , సంజయ్‌లు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కాగా, గురుకుల పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ బత్తుల కుమారస్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, వెంకన్న, రాధాకృష్ణ, స్వాతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో నీరు నిల్వకుండా చూడాలి

- ఏవో అనురాధ
- పంటల పరిశీలన


ఎల్లాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏవో అనురాధ

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొలం మడులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి అడ్లూరి అనురాధ అన్నారు. గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో శనివారం వరి పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతుల నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని తెలిపారు. పంట పొలాల్లోకి చేరిన వరద నీరు బయటకు వెళ్లేలా చూసుకోవాలన్నారు. వర్షం తగ్గాక కింద పడిన వరిని కట్టలుగా కట్టడం వల్ల నీటిలో తడిసిన గింజ రంగు మారదని తెలిపారు. కోతకు సమయం ఉన్న పంటలో తెగుళ్ల కట్టడికి 1 గ్రాము ప్రోపికొనజోల్ లేదా 0.4 గ్రాముల టేబుకొనజోల్‌తో పాటు ట్రైఫ్లాక్సీస్ట్రాబిన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కోసిన ధాన్యం మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆమె వెంట రైతులు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ

Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8519926489 ACM - 9985411664

నెక్లెస్ నయగారం

ఆభరణాలన్నింటిలో నెక్లెస్‌నే ఎక్కువగా ఇష్టపడుతుంటారు మహిళలు. ఎంత ఖరీదైన హారం వేసుకున్నప్పటికీ మెడలో చిన్న నెక్లెస్ పెట్టుకోనిదే అలంకరణ పూర్తికాదు. ఒకప్పుడు బంగారంతో తయారుచేసిన కంటెలు, పట్టెడలు, నాన్ పట్టీలను మహిళలు ఎక్కువగా ధరించేవారు. కాలక్రమేణా ఎన్నో మార్పులు, చేర్పులతో సరికొత్త నెక్లెస్‌లు రూపుదిద్దుకున్నాయి. యువత మెచ్చే ఫ్యాషన్లకు అనుగుణంగా మల్టీలేయర్, చంకీ చోకర్, పెండెంట్ నెక్లెస్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. వజ్రాలు, ముత్యాలు, జాతిరత్నాలు, కుందనాలు, బీడ్స్‌తో రూపొందించిన రకరకాల సంప్రదాయ నెక్లెస్‌లను కూడా మహిళలు ఆదరిస్తున్నారు. నేడు నెక్లెస్ ఒక నగలా మాత్రమే కాకుండా మహిళల వారసత్వానికి, వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలుస్తూ జాతీయ అంతర్జాతీయ వేదికల మీద సందడి చేస్తోంది. అలాంటి ట్రెండీ నెక్లెస్‌లపై ఓ లుక్కేద్దామా...



కుందన్ నెక్లెస్

మొఘలుల కాలంలో ఈ తరహా నెక్లెస్‌లు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇప్పుడు మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. పండుగలప్పుడు, వివాహాది శుభకార్యాల్లో సంప్రదాయ దుస్తులమీద చక్కని కుందనాల నెక్లెస్ పెట్టుకుంటే గ్రాండ్ లుక్ వస్తుంది.



కాలర్ నెక్లెస్

ఇది మెడను పట్టి ఉంచుతుంది. ఎలాంటి ముఖాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతుంది. గోల్డ్, పెరల్ పోల్కీల తోపాటు కెంపులు, పచ్చలు, ముత్యాలు, బీడ్స్‌తో రూపొందించిన రకరకాల కాలర్ నెక్లెస్‌లను మహిళలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌లపై కూడా ఇవి చక్కగా సూటవుతాయి. సింగిల్ లైన్ కాలర్ నెక్లెస్.. రోజువారీ ధరించడానికి అనువుగా ఉంటుంది. మల్టీ లేయర్లను పార్టీలు, ఫంక్షన్లప్పుడు పెట్టుకుంటే ప్రత్యేకంగా కనిపిస్తారు.



ఆక్సిడైజ్డ్ నెక్లెస్

ఉద్యోగినులు, కాలేజీలకెళ్లే యువతులు ఈ తరహా నెక్లెస్‌లను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీరలు, కుర్తీలు, సల్వార్ సూట్లు, వెస్ట్రన్, సెమీ వెస్ట్రన్ దుస్తుల మీద చక్కగా నప్పుతాయి.

మల్టీ స్ట్రింగ్ నెక్లెస్

ఇది అయిదు లేదా ఆరు వరుసల్లో ఉంటుంది. ఈ నెక్లెస్ ఒక్కటి పెట్టుకుంటే ఏ ఇతర హారాలు వేసుకోనవసరం లేదు. సంప్రదాయ దుస్తుల మీద రిచ్ లుక్ ఇస్తుంది. బంగారు గుండ్లు, పోల్కీలు, ముత్యాలు కుందనాలతో రూపొందించిన మల్టీ స్ట్రింగ్ నెక్లెస్‌లకు డిమాండ్ అధికంగా ఉంటోంది.



సెలబ్రిటీలు కూడా...

భారతీయ ఆభరణాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉంది. భారతీయ శైలిని పాశ్చాత్య శైలితో మేళవించి సరికొత్త డిజైన్లను రూపొందిస్తున్నారు. వీటిని యువత అమితంగా ఇష్టపడుతోంది. ఢిల్లీ, ముంబయి, న్యూయార్క్ నగరాల్లో జీన్స్, టీషర్టులు ధరించి కూడా రకరకాల నెక్లెస్‌లు పెట్టుకుంటున్నారు. కుర్తీల మీద ఆక్సిడైజ్డ్ నెక్లెస్‌లు, షర్టుల మీద ముత్యాల చోకర్లు, మోడరన్ డ్రెస్‌ల మీద లేయర్ నెక్లెస్‌లు ధరించి సరదా తీర్చుకుంటున్నారు యువతులు. ఒకప్పుడు బోసి మెడతో ఫొటోషూట్‌లు తీయించుకోవడానికి ఇష్టపడిన బాలీవుడ్ నటీమణులు, మోడల్స్ నేడు నెక్లెస్‌కు అధిక ప్రాముఖ్యమిస్తున్నారు. దీపిక పదుకునే ఇటీవల ఓ ప్రోగ్రామ్‌లో యాంటిక్ నెక్లెస్ ధరించి కనువిందు చేశారు. కేన్స్ 2025 ఈవెంట్లో డైమండ్ చోకర్ నెక్లెస్ ధరించి అందంగా మెరిశారు ఆలియా భట్. కియారా అద్వానీ, సన్యా మల్హోత్రాలు తరచూ చైన్ నెక్లెస్‌లతో కనిపిస్తున్నారు. సోనమ్ కపూర్ అహూజా ఇటీవల ఓ కార్యక్రమంలో మల్టీ లేయర్ చైన్స్ నెక్లెస్ వేసుకుని వార్తల్లో నిలిచారు. హేలీ బీబర్ తన ఐకానిక్ బబుల్ 'బి' పెండెంట్ చోకర్‌తో కనువిందు చేస్తున్నారు. హాలీవుడ్ సెలబ్రిటీలు సైతం భారతీయ శైలితో కూడిన నెక్‌పీస్‌లు ధరించడానికే ఇష్టపడుతున్నారు. ఇటీవల నికోల్ కిడ్‌మాన్.. రత్నాలతో రూపొందించిన నెక్లెస్ ధరించి 'రెడ్ కార్పెట్' ఈవెంట్లో ప్రత్యేకంగా నిలిచారు. సెలీనా గోమెజ్ కూడా చక్కని నెక్లెస్‌లు ధరించి పలు సంగీత అవార్డుల వేదికలమీద కనిపిస్తుంటారు. ఎమ్మా వాట్సన్ ధరించిన సన్నని గొలుసుల నెక్లెస్ యువతులను బాగా ఆకర్షిస్తోంది.





జీవితంలో అనేక పాఠాలు నేర్చుకున్నా!

సుస్మితా సేన్, లారా దత్తాల తర్వాత మన దేశం నుంచి మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకొన్న మూడో సుందరి హర్నాజ్ సంధు. సుస్మిత, లారాల మాదిరిగానే హర్నాజ్ కూడా బాలీవుడ్‌లోకి తాజాగా రంగ ప్రవేశం చేసింది. ఆమె నటించిన 'బాగీ 4' ఓటీటీలో కూడా దూసుకువెళ్తోంది. బాలీవుడ్ ప్రవేశం గురించి.. తాను చేయదలుచుకున్న పాత్రల గురించి హర్నాజ్ అంతరంగం ఆమె మాటల్లోనే...



"బాగీ 4 విడుదల తర్వాత ప్రపంచవ్యాప్తంగా అనేక మంది నాకు ఫోన్ చేసి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటి దాకా నన్ను అందరూ మిస్ యూనివర్స్‌గా మాత్రమే చూశారు. బాగీ తర్వాత నన్ను ఒక నటిగా గుర్తిస్తున్నారు. ఈ విషయం నాకు చాలా ఆనందం కలిగిస్తోంది. ఇది నా తొలి సినిమా. అయితే దర్శకుడు సాజిద్ నదియవాలా, నా హీరో టైగర్ షరాఫ్, ఇతర నటీనటులు నన్ను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నారు. మన చుట్టూ ఉన్న వ్యక్తులు మనల్ని చాలా ప్రభావితం చేస్తారు. ముఖ్యంగా సినీ రంగంలో అందరూ కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ఏ చిన్న సమస్య ఎదురయినా- అది మొత్తం అందరినీ ప్రభావితం చేస్తుంది. అందుకే ఆడుతూ పాడుతూ పనిచేయాలంటారు. ఈ సినిమా షూటింగ్ అలాగే సాగింది. సెట్‌లో ఉన్న వారందరికీ తాము ఏం చేస్తున్నామో తెలుసు. అందువల్ల ఎటువంటి టెన్షన్ ఎదురవలేదు.

నాకిష్టం...

నాకిష్టమైన నటి ప్రియాంక చోప్రా. నచ్చిన సినిమా 'ముజే షాదీ కరోగి'. నచ్చిన క్యారెక్టర్ 'షోలే' సినిమాలో బసంతి.

జీవితం మారిన క్షణం

2021లో నాకు మిస్ యూనివర్స్ కిరీటం దక్కింది. ఆ క్షణం నుంచి నా జీవితం మారిపోయింది. అప్పటిదాకా నేను చండీగఢ్‌కు చెందిన ఒక మధ్యతరగతి అమ్మాయిని. మిస్ యూనివర్స్ అయిన తర్వాత నేను మన దేశానికి ప్రాతినిధ్యం వహించే అంబాసిడర్‌ను. నేను చేసే ప్రతి పనిని అందరూ చూస్తూ ఉంటారు. అందువల్ల వేసే ప్రతి అడుగు ఆచితూచి వేయాల్సి వచ్చేది. మాట్లాడే ప్రతి మాట ఆలోచించి మాట్లాడాల్సి వచ్చేది. ఇలా ఈ నాలుగేళ్ల సమయంలో నేను నా జీవితంలో అనేక పాఠాలు నేర్చుకున్నాను. ఇక నేను సినిమా నటిని అవ్వాలనేది కూడా బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయమే! నేను సినీ రంగంలోకి వెళ్తానని చెప్పినప్పుడు మా కుటుంబం నాకు మద్దతు ఇచ్చింది. ముఖ్యంగా మా అమ్మ నాకు కొండంత అండగా నిలిచింది. నేను ఆకాశంలో చుక్కలను అందుకొనేంత ఎత్తుకు ఎదగాలనేది ఆమె ఆశ, ఆకాంక్ష. ఆమె ఆశను నిజం చేయటానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాను.

ఆరోగ్యకరమైన జీవనం కోసం

ధ్యానం చేయాలి. తగినన్ని నీళ్లు తాగాలి. మన చుట్టూ పాజిటివ్ ఎనర్జీ ఉన్న వ్యక్తులు ఉండేలా చూసుకోవాలి

ఆరోగ్యకరమైన ఆహారం అంటే...

ఇంట్లో వండిన ఆహారాన్నే తింటా. జపనీస్ ఆహారమంటే ఇష్టం. ఇక పంజాబీ ఫుడ్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నేను తినే ఆహారంలో హై ప్రొటీన్, ఎక్కువ ఫైబర్ ఉండేలా చూసుకుంటా. ఉదయాన్నే లేచిన వెంటనే చియా సీడ్స్‌ను నీళ్లలో నానబెట్టి తింటా. ఇక ప్రతి రోజూ ఒక చిన్న కప్పు ఐస్‌క్రీమ్ తింటా.

అందం కోసం

నా దృష్టిలో మంచి హృదయంతో ప్రశాంతంగా ఉన్నవారు అందంగా కనిపిస్తారు. అందు కోసమే నేను లేచిన వెంటనే మెడిటేషన్ చేస్తాను. చల్లటి నీళ్లతో మొహాన్ని కడుక్కుంటా. మెడిటేషన్ వల్ల రోజంతా నా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చల్లటి నీళ్ల వల్ల చర్మం మెరుస్తూ ఉంటుంది. ఇక నేను బయట దొరికే సౌందర్య సాధనాలను వాడను. మా ఇంట్లో తయారుచేసే ఫేస్‌ప్యాక్‌లనే వాడతాను. దీని వల్ల చర్మం దెబ్బతినకుండా ఉంటుంది.

శిరోజాల కొనలు ఇలా పదిలం

కొంతమందికి శిరోజాల చివర్లు చిట్లిపోతుంటాయి. ఆపైన రంగుమారి నిర్జీవంగా కనిపిస్తుంటాయి. అలాకాకుండా శిరోజాలు నల్లగా మెరుస్తూ ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- చాలామంది శిరోజాలను స్టయిల్‌గా మార్చేందుకు స్ట్రయిట్‌నర్స్, కర్లర్స్ వాడుతూ ఉంటారు. వీటిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల వెంట్రుకల చివర్లు చిట్లిపోతుంటాయి. శిరోజాలను స్టయిల్ చేసుకోవడానికి బదులు చక్కగా దువ్వి జడ లేదా పోనీటెయిల్ వేసుకోవడం మంచిది.
- శిరోజాలకు తగినంత తేమ అందకపోయినా చివర్లు చిట్లిపోతుంటాయి. మంచినీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి. వారానికి రెండుసార్లు తలకు కొబ్బరినూనె రాసుకుంటూ ఉంటే వెంట్రుకల్లో తేమ నిలుస్తుంది.
- రసాయనాలతో కూడిన షాంపూలు ఉపయోగించడం వల్ల కూడా శిరోజాలు చిట్లుతుంటాయి. మైల్డ్ షాంపూ లేదా కుంకుడుకాయ, మందారాకులతో తలస్నానం చేస్తుంటే సమస్య తీరుతుంది.
- తలస్నానం చేసిన తరువాత శిరోజాలను తువాలుతో గట్టిగా రుద్దుతూ తుడవకూడదు. అలా చేయడం వల్ల జుట్టు చిక్కులు పడుతుంది. చిక్కులు తీయడానికి గట్టిగా దువ్వడం వల్ల వెంట్రుకల కొనలు చిట్లిపోతుంటాయి. కాబట్టి తలస్నానం తరువాత నీళ్లు ఇంకిపోయే వరకూ తలకు మెత్తని తువాలును చుట్టి ఉంచుకోవాలి.



- శిరోజాలను బిగించి ముడి లేదా జడ వేయకూడదు. అలాగని జుట్టు విరబోసుకున్నా సమస్య పెరుగుతుంది. శిరోజాలు వదులుగా ఉండేలా అల్లుకోవాలి. దువ్వెనలు, దిండు కవర్లు శుభ్రంగా ఉంచుకోవాలి. రోజూ పోషకాహారం తీసుకోవాలి.
- శిరోజాల చివర్లు చిట్లినప్పుడు కొనలను మాత్రమే ట్రిమ్ చేయించుకోవాలి.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఇన్ వేవ్స్ అండ్ వార్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 03
బారాముల్లా	హిందీ చిత్రం	నవంబర్ 07
అమెజాన్ ప్రైమ్		
రాబిన్‌హుడ్	వెబ్‌సిరీస్	నవంబర్ 02
నైస్ టూ నాట్ మీట్ యూ	వెబ్‌సిరీస్	నవంబర్ 03
జియో హాట్‌స్టార్		
బ్యాడ్ గర్ల్	తమిళ చిత్రం	నవంబర్ 04
ది ఫెంటాస్టిక్ 4	హాలీవుడ్ మూవీ	నవంబర్ 05
సోనీ లివ్		
మహారాణి 4	హిందీ సిరీస్	నవంబర్ 07

కుండీల్లో ఆకుకూరలు

ఇటీవల అందరూ ఆకుకూరలంటే ఆసక్తి చూపిస్తున్నారు. కుండీల్లోనైనా ఆకు కూరలను పెంచాలనుకుంటున్నారు. ఇలా కుండీల్లో పెంచదగ్గ ఆకుకూరల గురించి తెలుసుకుందాం.



మెంతికూర: ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ఎటువంటి మట్టిలోనైనా సులువుగా పెరుగుతుంది. ముందుగా మెంతులను రెండు గంటలపాటు నీళ్లలో నానబెట్టాలి. తరువాత వాటిని టిష్యూ పేపర్‌లో లేదంటే పలుచని గుడ్డలో మూటకట్టి పెడితే ఒక్క రోజులోనే మొలకలు వస్తాయి. మొలకెత్తిన మెంతి గింజలను కుండీల్లో నాటితే వారంలోపే మెంతికూర చేతికి అందుతుంది. కోకోపీట్ కలిపిన మెత్తటి మట్టిలో ఏడాది పొడవునా మెంతికూర చక్కగా పెరుగుతుంది. వంటింటి కిటికీల దగ్గర, బాల్కనీలో కుండీలు పెట్టుకోవచ్చు.



పాలకూర: ఇది కూడా కుండీల్లో బాగా పెరుగుతుంది. పాలక్ సీడ్స్ తెచ్చి కుండీలో చల్లి కొన్ని నీళ్లు చిలకరించాలి. నాలుగు రోజుల్లో మొలకలు వస్తాయి. పది రోజుల్లో పాలకూర గుబురుగా పెరుగుతుంది. ఆకులను మాత్రమే కోసుకోవాలి. ఆర్నెల్లకోసారి మట్టిలో సేంద్రియ ఎరువులు కలుపుతూ ఉంటే నాలుగేళ్ల వరకూ పెద్ద ఆకులతో పాలకూర పెరుగుతూనే ఉంటుంది.



కొత్తిమీర: ఒక గిన్నెలో కొన్ని ధనియాలను తీసుకుని నిండా నీళ్లు పోసి అయిదు గంటలపాటు నానబెట్టాలి. కొత్తిమీర బాగా పెరగాలంటే మట్టి మరీ మెత్తగా ఉండకూడదు. అందుకే కుండీలోని మట్టిలో కొద్దిగా ఇసుక, కంపోస్టు కలపాలి. తరువాత నానిన ధనియాలు చల్లి నీళ్లు చిలకరించాలి. వారంలో కొత్తిమీర చేతికి అందుతుంది. రోజూ కావాల్సినంత కొత్తిమీరను చేత్తో తుంచుకోవాలి. దీన్ని తుంచుతున్న కొద్దీ కొత్త ఇగుళ్లు వస్తూనే ఉంటాయి.



తోటకూర: ఇది ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో లభ్యమవుతుంది. కుండీలోని మట్టిలో కొద్దిగా వేపపిండి కలపాలి. తరువాత తోటకూర గింజలు చల్లి కొన్ని నీళ్లు చిలకరించాలి. మూడు రోజుల్లోనే మొలకలు వస్తాయి. రోజూ మట్టి తడిసేలా నీళ్లు పోస్తూ ఉంటే తోటకూర చక్కగా పెరుగుతుంది.



బచ్చలి కూర: కుండీలో గింజలు చల్లి పెంచుకోవచ్చు. కొమ్మ తెచ్చి పెట్టినా కూడా త్వరగానే నాటుకుంటుంది. ఈ మొక్కకు ఎక్కువగా ఎండ అవసరం లేదు. నీడలో బాగా పెరుగుతుంది.



చుక్క కూర: ఒకసారి గింజలు తెచ్చి చుక్కకూరను పెంచితే దానినుంచి గింజలు వస్తూనే ఉంటాయి. ఈ మొక్కకి ద్రవరూపంలో ఎరువులు ఇస్తూ ఉండాలి. ఇది చాలా వేగంగా పెరిగే మొక్క.

సోఫా కవర్ కొత్తగా!

కాలక్రమేణా సోఫా కవర్ మీద దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. రకరకాల మరకలు పడుతుంటాయి. తరచూ సోఫా కవర్‌ను ఉతకడం సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి సోఫా కవర్‌ను కొత్తగా మెరిసేలా చేయవచ్చు. ఆ వివరాలు...

- సోఫా కవర్‌పై టీ, కాఫీ, జ్యూస్ మరకలు పడితే ముందుగా వాటిని పొడిగుడ్డతో తుడవాలి. చిన్న గిన్నెలో ఒక చెంచా లిక్విడ్ డిటర్జెంట్ లేదా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి కొన్ని నీళ్లు చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో పలుచని గుడ్డను ముంచి దానితో మరకల మీద మెల్లగా తుడవాలి. తరువాత తడిగుడ్డతో అద్దితే మరకలు పూర్తిగా పోతాయి.
- జిడ్డు, నూనె, మేకప్ మరకలు ఏర్పడితే వాటిమీద కార్న్‌ఫ్లోర్, ఫేస్ పౌడర్, బేకింగ్ సోడాలలో ఒకదాన్ని కొద్దిగా చల్లాలి. ఇరవై నిమిషాల తరువాత పాత టూత్‌బ్రష్‌తో రుద్దితే మరకలు తొలగిపోతాయి.



- సోఫా కవర్ మీద ఏవైనా మొండి మరకలు ఏర్పడితే... చిన్న దూది ఉండ మీద రెండు చుక్కల శానిటైజర్ లేదా ఆల్కహాల్ వేసి దానితో రుద్దితే చాలు. మరకలు మాయమవుతాయి.
- వెడల్పాటి గిన్నెలో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తీసుకోవాలి. అందులో ఒక చెంచా బేకింగ్ సోడా, ఒక చెంచా షాంపూ వేసి బాగా కలపాలి. చేతి రుమాలును గుండ్రంగా మడిచి ఆ మిశ్రమంలో ముంచాలి. దానితో సోఫా కవర్‌ను తుడవాలి. తరువాత ఫ్యాన్ వేసి గాలికి ఆరనివ్వాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే మరకలన్నీ పోయి సోఫా కవర్ కొత్తగా కనిపిస్తుంది.

ప్రస్తుతం బంగారానికి ప్రత్యామ్నాయం ప్లాటినమే!

బంగారం ధర రోజు రోజుకు పెరిగిపోతోంది. అదే సమయంలో బంగారానికి ప్రత్యామ్నాయంగా కొందరు భావించే ప్లాటినం ధర స్థిరంగానే ఉంది. ప్రస్తుతం ఒక గ్రాము బంగారం ధరతో మూడు గ్రాముల ప్లాటినం కొనవచ్చు. పెరుగుతున్న బంగారం నగల ధరల వల్ల ఎక్కువ మంది యువతీయువకులు ప్లాటినం వైపు మొగ్గు చూపుతున్నారంటున్నారు ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ డిప్యూటీ కంట్రీ మేనేజర్ **పల్లవి శర్మ**. ప్లాటినం గురించి ఆమె చెప్పిన విశేషాలివే..





మన దేశంలో ప్లాటినం మార్కెట్ ఎలా ఉంది? మన మహిళలు ప్లాటినం ఆభరణాలు కొంటున్నారా?

మన దేశంలో ప్లాటినం ఆభరణాలను కొనేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా యువతీయువకులు ఈ ఆభరణాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఇక్కడ కొన్ని ఆసక్తికరమైన అంశాలను చెబుతాను. ప్లాటినం ఆభరణాలను (అంటే ఉంగరాలు, బ్రాస్‌లెట్స్ వంటివి) పురుషులు ఎక్కువగా కొంటారు. జంటగా ఇద్దరు ఒకే విధమైన ఆభరణాలు కొనాలనుకున్నవారు కూడా ప్లాటినం వైపే మొగ్గు చూపుతారు. అయితే ఈ మధ్యకాలంలో మహిళలు కూడా ప్లాటినం ఆభరణాల వైపు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లే అమ్మాయిలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీనికి ప్రధానమైన కారణం- ప్లాటినంలో 95 శాతం స్వచ్ఛత ఉండటం. ఇక రెండోది వజ్రాలను పొదిగితే చాలా అందంగా కనిపించటం. ఈ ఏడాది రెండో త్రైమాసిక ఫలితాలను చూస్తే- గత ఏడాది కన్నా 15 శాతం అమ్మకాలు పెరిగాయి.



మన దేశంలో బంగారాన్ని శుభశుచకంగా భావిస్తారు. అలాంటి బంగారంతో ప్లాటినం పోటీ పడగలదా?

మన దేశ సంస్కృతి సంప్రదాయాల్లో బంగారం ఒక కీలకమైన పాత్ర పోషిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ముఖ్యంగా పెళ్లిళ్లలో అందరం బంగారు నగలను ధరించటానికే ఇష్టపడేవారు. అయితే ఈ మధ్యకాలంలో యువతీయువకుల అభిరుచులు మారుతున్నాయి. పెళ్లిళ్లలో పెట్టుకొనే నగలను లాకర్‌లో పెట్టి భద్రపరచాలని అనుకొనేవారి సంఖ్య తగ్గుతోంది. ఆ ఆభరణాలను పెళ్లి తర్వాత ప్రతి రోజు ధరించాలనుకుంటున్నారు. తల్లితండ్రుల అభిరుచుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. బంగారానికి ప్రత్యామ్నాయం కావాలని భావించేవారందరూ ప్లాటినం నగలను కొనుగోలు చేస్తున్నారు. ప్లాటినం తెల్లగా ఉంటుంది. దీనితో కూడా రకరకాల ఆభరణాలు డిజైన్లు అందుబాటులోకి వస్తున్నాయి.

> ప్లాటినం ఆభరణాల స్వచ్ఛత 95 శాతం ఉంటుంది. అందువల్ల ఒక వేళ వీటిని తిరిగి విక్రయించినా ఎక్కువ సొమ్ము లభిస్తుంది. ప్రస్తుతం దేశంలోని అన్ని ప్రముఖ దుకాణాలలోను ప్లాటినం ఆభరణాలు లభిస్తున్నాయి.

బంగారపు ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి కదా... దీని ప్రభావం ప్లాటినంపై ఉందా?



తప్పకుండా ఉంది. బంగారం, వెండిల ధరలు పెరగటం వల్ల ఆభరణాలు కొనే సమయంలో వినియోగదారులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. బంగారం కన్నా తక్కువ ధర ఉండటం వల్ల కొందరు వినియోగదారులు ప్లాటినం ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ప్లాటినం ధర పెరుగుతుందనే భావన వారిలో ఉంది.

బాలికపై ముగ్గురి లైంగిక దాడి

'మీ తమ్ముడు పడిపోయాడు దెబ్బలు తగిలాయ్ రా' అని చెప్పి తీసుకెళ్లి దుశ్చర్య

కొణిజర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలానికి చెందిన ఓ బాలికపై ముగ్గురు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ ముగ్గురిలో ఇద్దరు మైనర్లు(16 ఏళ్ల వయస్సు వారు) కాగా మరొకరు మేజర్(18 ఏళ్ల వాడు). రోడ్డుపై ఒంటరిగా వెళుతున్న బాలికను ఆపి.. "మీ తమ్ముడు కింద పడిపోయాడు. వెంటనే ఇంటి రా" అని చెప్పి తనతో తీసుకెళ్లిన ఓ బాలుడు తన స్నేహితులు మరో ఇద్దరితో కలిసి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరగ్గా.. బాధిత బాలిక తల్లిదండ్రులు శనివారం పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగు చూసింది. ఆపై, నిందితులు పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొణిజర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధిత బాలిక ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతోంది. బాలిక తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లగా.. ఆ బాలిక తన నాయనమ్మ, తాతయ్యతో కలిసి తమ ఇంటికి సమీపంలోని ప్రార్థనా మందిరానికి శుక్రవారం సాయంత్రం వెళ్లింది. అయితే, మరుగుదొడ్డికి వెళ్లేందుకు బాలిక ప్రార్థనామందిరం నుంచి ఇంటికి ఒంటరిగా బయలుదేరగా.. నిందితుల్లోని ఓ మైనర్ ఆమెను మార్గమధ్యలో ఆపాడు. మీ తమ్ముడు కిందపడిపోయాడు, దెబ్బలు తగిలాయి, త్వరగా రా.. అంటూ ఆమెను నిందితుల్లో ఒకరైన యువకుడి ఇంటికి తీసుకెళ్లాడు. నిందితుల్లోని యువకుడు, మరో బాలుడు అప్పటికే అక్కడ ఉన్నారు. అనంతరం ముగ్గురూ కలిసి బాలికపై లైంగిక దాడి చేశారు. వారి నుంచి తప్పించుకొని రాత్రి తన ఇంటికి చేరుకున్న బాలిక.. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి తిరిగొచ్చిన తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పింది. దీంతో వారు శనివారం ఉదయం కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు ఓ యువకుడు, ఇద్దరు మైనర్లపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కాగా, నిందితులు ముగ్గురూ ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

ఐదంతస్తుల భవనం కూల్చివేత

- ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం.. హైడ్రా ఉక్కుపాదం
- నకిలీ పత్రాలతో అనుమతులు
- నిర్మాణం పూర్తి.. కూల్చివేసిన హైడ్రా


పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌ను కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

అమీన్‌పూర్, హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల సరిహద్దులోని మియాపూర్ పరిధిలోని హుడాకు చెందిన భూమిలో రూ.20 కోట్ల విలువైన 800 గజాల స్థలాన్ని కబ్జా చేసి, తప్పుడు పత్రాలు సృష్టించి ఐదంతస్తుల భారీ అపార్ట్‌మెంట్‌ను నిర్మించినట్లు హైడ్రా గుర్తించింది. శనివారం ఆ భవనాన్ని హైడ్రా అధికారులు దగ్గరుండి కూల్చివేయించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పీజేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీ పక్కనే.. మేడ్చల్ జిల్లా శేరిలింగంపల్లి మండలానికి చెందిన సర్వే నంబరు 101లో ప్రభుత్వ భూములు విస్తరించి ఉన్నాయి. పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ భూమిలోని స్థలానికి.. అమీన్‌పూర్‌కు చెందిన 307, 308 పట్టా నంబర్లు వేసి డాక్యుమెంట్లను తయారు చేశారు. సదరు ప్లాటుకు హెచ్‌ఎండీఏ ఎల్‌ఆర్‌ఎస్ తుది ప్రొసీడింగ్ జారీ చేసిందని మరో ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించారు. తప్పుడు పత్రాలను అమీన్‌పూర్ మునిసిపాలిటీకి సమర్పించి టీఎస్‌బీపాస్ ద్వారా ఐదంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు పొందారు. అనంతరం ఐదంతస్తుల భారీ అపార్ట్‌మెంట్‌ను నిర్మించారు. అందులో కొన్ని ప్లాట్ల అమ్మకం కూడా పూర్తిచేసినట్లు తెలిసింది. కాగా కూల్చివేతల సందర్భంగా హైడ్రా సిబ్బందిని అడ్డుకునేందుకు నిర్మాణదారులు యత్నించగా వారిని పోలీసులు అరెస్టు చేశారు.

మణికొండలో 300 కోట్ల భూమి..

మణికొండలో కబ్జాల చెరలో ఉన్న ప్రభుత్వ భూమికి, మరో రెండు పార్కులకు హైడ్రా విముక్తి కల్పించింది. తద్వారా సుమారు రూ.300 కోట్ల విలువైన భూమిని కాపాడింది. మణికొండలో పంచవటి కాలనీలో వెస్టర్న్ ప్లాజాకు చేరువలో ఎకరా భూమికి పత్రాలు లేకుండా తమ పూర్వీకులదని చెప్పి కబ్జా చేసిన వారిని హైడ్రా ఖాళీ చేయించింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ వెస్టర్న్ ప్లాజాకు చెందిన వారు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్‌వేసి, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. మణికొండ వెంకటేశ్వర కాలనీలో 1600 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. 1992లో లేఔట్ వేసినప్పుడు పార్కులకు కేటాయించిన ఈ స్థలంలో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారు. పార్కు స్థలంలో బై నంబర్లు వేసుకొని కబ్జాలు చేశారంటూ హైడ్రా ప్రజావాణికి కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా 1600 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకొని పార్కు స్థలంగా పేర్కొంటూ బోర్డులు పెట్టింది. దీని విలువ 25 కోట్లు ఉంటుందని అంచనా. తిరుమల గిరిహిల్స్‌లో 6150 గజాల పార్కు స్థలం కబ్జాకు గురికాగా, తాత్కాలికంగా వేసిన షెడ్లు కాంపౌండ్ వాల్ తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసింది. మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ. 120 కోట్లు వరకూ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

తలను కోసి.. వివస్త్రను చేసి

- నిజామాబాద్‌లో గుర్తుతెలియని మహిళ దారుణ హత్య
- తల, ఎడమచేతి వేళ్లు, కుడిచేతి మణికట్టు లేకుండా వివస్త్రగా పడి ఉన్న మృతదేహం

నవీపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మిట్టాపుర్ శివారులో ఓ గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. మహిళను హత్య చేసిన దుండగులు మృతదేహాన్ని బాసరకు వెళ్లే రహదారి పక్కన ఉన్న ఓ ఖాళీ స్థలంలో వివస్త్రగా పడేశారు. తల, ఎడమ చేతి వేళ్లు, కుడి చేతి మనికట్టు వరకు లేకుండా మృతదేహం ఉంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్సై తిరుపతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో పలు ఆధారాలను సేకరించిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సభ్యులు.. మృతదేహ మిగిలిన భాగాలను దుండగులు సమీప ప్రాంతాల్లో పడేశారా అనే అనుమానంతో డ్రోన్ల సహాయంతో గాలించారు. అయినప్పటికీ వాటి ఆచూకీ లభించలేదు. మహిళ వయసు సుమారు 35 సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మహిళపై లైంగిక దాడికి పాల్పడి, ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసినట్లు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం పది పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సరికొత్త ప్రపంచంలోకి ...



ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల'. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబరు 25న విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో ప్రభాస్ ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడు, అసురులుకి మధ్య జరిగిన ఓ భీకర యుద్ధం.. ఈ కథకి మూలం' అంటూ నటుడు సాయికుమార్ వాయిస్ ఓవర్‌తో మొదలైన ఈ ట్రైలర్‌లోని సంభాషణలు, విజువల్స్, మేకింగ్, సంగీతం, పోరాట ఘట్టాలు అలరించేలా ఉన్నాయి. ఆది సాయికుమార్ పాత్ర చాలా శక్తిమంతంగా కనిపిస్తోంది. విజువల్ వండర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని మేకర్స్ తెలిపారు.

పెద్ది ప్రేయసి



రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'పెద్ది' చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్లను విడుదల చేశారు మేకర్స్. రామ్ చరణ్ ప్రేయసిగా అచ్చియ్యమ్మ అనే పాత్రలో ఫైర్‌బ్రాండ్‌గా ఆమె కనిపించనుందని మేకర్స్ పేర్కొన్నారు. జాన్వీ లుక్స్ చూస్తుంటే ఇందులో ఆమె పాత్ర చిత్రణ మాస్‌గా ఉంటూ దేనికీ భయపడని అమ్మాయిగా కనిపించనుందని తెలుస్తోంది. ఇందులో రామ్‌చరణ్ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా మార్చి 27న ఈ చిత్రం విడుదలవుతోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, బాలీవుడ్ నటులు బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పెద్ది' తొలి పాటను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు సమాచారం.

రష్మిక పారితోషికం తీసుకోలేదు

ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలిద్దరూ మీడియాతో మాట్లాడారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌లో ఇమిడే కథ కాదు. అయినా బాగా నచ్చడంతో రిస్క్ తీసుకున్నామని ధీరజ్ తెలిపారు. 'ఈ సినిమా ప్రతి ఒక్కరి ప్రేమకథకు కనెక్ట్ అవుతుంది. రాహుల్ రవీంద్రన్ సినిమాను తెరకెక్కించిన తీరు సెన్సార్ సభ్యులకు నచ్చి, 'నేషనల్ అవార్డ్ దక్కుతుంద'ని ప్రశంసించారు. ఈ సినిమాకు రష్మిక ఇప్పటివరకూ ఇంకా పారితోషికం తీసుకోలేదు. ఆమె మా పైన చూపిన ఔదార్యానికి గుర్తుగా రెట్టింపు పారితోషికం ఇస్తాం' అని ధీరజ్ చెప్పారు.



కథకు కనెక్ట్ అయ్యాం

'ది గర్ల్‌ఫ్రెండ్' స్టోరీకి మేం బాగా కనెక్ట్ అయ్యాం అని విద్య కొప్పినీడి అన్నారు. 'ఈ సినిమా ప్రేక్షకుల్లో ఆలోచన రేకెత్తిస్తుంది. ఇది మహిళా ప్రాధాన్య చిత్రం కాదు. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో రాసిన బలమైన ప్రేమకథ. ప్రేక్షకులకు తమకు తెలిసిన వారి ప్రేమకథలు గుర్తుకొచ్చేలా ఈ సినిమా ఉంటుంది. అందుకే విజయం విషయంలో మేం ఎలాంటి టెన్షన్ లేకుండా ఉన్నాం' అని విద్య తెలిపారు.



గెలుపు కాదు పోరాటమే గొప్ప

శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మించిన హై-స్పీడ్ స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్'. ఈనెల 6న విడుదలవుతోంది. శనివారం జరిగిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ 'భారతీయ చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ ఫిల్మ్ మాదేనని గర్వంగా చెబుతున్నా. నా సినీ కెరీర్‌లో ఈ చిత్రం ఓ టర్నింగ్ పాయింట్. ఇందులో కనిపించిన స్టంట్స్ ఏవీ సీజీ కాదు. ఒరిజినల్ బైకర్స్‌తో ఇండోనేషియా వెళ్లి రిస్కీగా షూట్ చేసివచ్చాం. ఇంత గొప్ప సినిమా తీయాలంటే నిర్మాతలకు ధైర్యం ఉండాలి. వంశీ అన్నకు థాంక్స్. ఇది నా సినిమా అని గర్వపడే ప్రాజెక్ట్' అని చెప్పారు. రాజశేఖర్ మాట్లాడుతూ 'నా మనసుకు నచ్చిన సబ్జెక్ట్ బైకర్. అభిలాష్ ప్రతి ఫ్రేమ్‌ను అద్భుతంగా డిజైన్ చేశారు. ఈ సినిమాకు పెట్టిన ఖర్చు చూసి నాకు భయం వేసేది. కానీ వంశీ గారు మాత్రం చాలా కూల్‌గా ఉన్నారు. శర్వా నా నటనను మెచ్చుకోవడం నాకు అవార్డుతో సమానం' అని చెప్పారు. అభిలాష్‌రెడ్డి మాట్లాడుతూ 'ఇక్కడ గెలవడం గొప్ప కాదు చివరి దాకా పోరాడడం గొప్ప అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. రేసింగ్ సినిమాలు చూసిన ఎగ్జైట్‌మెంట్‌కు మించి ఈ చిత్రం ఉంటుంది. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అని తెలిపారు.

చిత్రీకరణ పూర్తి



సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తోన్న చిత్రం 'గోట్'. జైశ్నవ్ ప్రొడక్షన్స్, మహాతేజ క్రియేషన్స్ బేనర్లపై మొగుళ్ల చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ ముగిసింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నేను నిర్మించిన వాటిల్లో మంచి చిత్రంగా నిలుస్తుంది. త్వరలోనే టీజర్, పాటలు విడుదల చేస్తాం. మరిన్ని అప్డేట్స్‌తో త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని అన్నారు. రాజేంద్రన్, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

కొత్త తరహా కథతో...



నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ దేవ్ ప్రధాన పాత్రధారులుగా పార్థసారధి కొమ్మోజు తెరకెక్కించిన చిత్రం 'సందిగ్ధం'. తీర్థ క్రియేషన్స్ బేనర్‌పై సంధ్య తిరువీధుల నిర్మించారు. ఇటీవలె నిర్వహించిన వేడుకలో నిర్మాత అశోక్ కుమార్ టీజర్ విడుదల చేశారు. పార్థసారధి మాట్లాడుతూ 'ఇలాంటి కథ ఇంత వరకూ రాలేదని చెప్పొచ్చు. ఆద్యంతం ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు. హీరో నిహాల్ మాట్లాడుతూ 'ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

ఇండియా జాయ్‌లో.. ప్రధానాకర్షణగా దేశీటూన్స్



'ఇండియా జాయ్' ఫెస్టివల్ 8వ ఎడిషన్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగింది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల సమ్మేళనంగా ఈ వేడుక సాగింది. ఈ కాన్‌క్లేవ్‌లో 'దేశీ టూన్స్' అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ ఏడాది థీమ్ అయిన 'ద పవర్ ఆఫ్ ఒరిజినల్స్' ద్వారా మన మూలాలకు చెందిన అనేక విభిన్న కథల్ని దేశీ టూన్స్ ఈ వేదికపై ఆవిష్కరించి, భారతీయ కథల వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటింది. హైదరాబాద్ యానిమేషన్ హబ్‌గా మారుతున్న తరుణంలో ఇలాంటి వేడుకలు నిర్వహించడం మంచి పరిణామం అని తెలంగాణ వీఎఫ్‌ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు (టీవీఏజీఏ) రాజీవ్ చిలకా పేర్కొన్నారు. 'మన ఊహాశక్తి, పనితనంతో ప్రపంచ యానిమేషన్ రంగానికి నాయకత్వం వహించే దిశగా మనం ఎదుగుతున్నాం' అని దర్శకుడు నాగ్ అశ్విన్ అన్నారు. 'దేశీ టూన్స్ భారతదేశ సృజనాత్మక శక్తిని సరైన సమయంలో ఆవిష్కరిస్తోంది' అని మరో దర్శకుడు అశ్విన్ కుమార్ చెప్పారు.







అమ్మాయిలూ అస్సలు వదలొద్దు

మహిళల ప్రపంచ కప్ ఫైనల్ నేడు

కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ.. అమోఘమైన ప్రదర్శనతో తుది సమరంలో నిలిచిన భారత మహిళలు.. అందలాన్ని అందుకునేందుకు మిగిలింది ఒక్క అడుగే..
మెగా టోర్నమెంట్‌లో మన ఘనతను చాటి చెప్పాలన్నా.. మహిళల క్రికెట్ చరిత్రలో చిరకాలం మన విజయాన్ని స్మరించుకోవాలన్నా.. కావాల్సింది ఇంకొక్క మ్యాచే!
గ్రూప్ దశలో మూడు ఓటములు బాధించినా, న్యూజిలాండ్‌పై ఘన విజయంతో సెమీస్‌లో అడుగుపెట్టాం.. చాంపియన్ ఆస్ట్రేలియాను అలవోకగా చిత్తుచేసి ఫైనల్‌కు దూసుకొచ్చాం.
ఇక.. హర్మన్‌సేన ముందున్నది సాధారణ ప్రత్యర్థి కాదు.. టోర్నీలో సూపర్‌ఫామ్‌తో అదరగొడుతోన్న పటిష్ఠ దక్షిణాఫ్రికా. అందునా, గ్రూప్ దశలో మనపై గెలిచి జోరుమీదున్న ఆ జట్టుపై ప్రతీకారం తీర్చుకునేందుకు.. ఎనిమిదేళ్ల క్రితం అందినట్లే అంది చేజారిన విశ్వకిరీటాన్ని ఒడిసి పట్టేందుకు.. స్వదేశంలో ప్రేక్షకుల కేరింతల మధ్య సగర్వంగా వన్డే ప్రపంచ కప్‌ను ముద్దాడేందుకు.. ఆ అద్భుత క్షణాలను తనివితీరా ఆస్వాదించేందుకు.. ఇంతకుమించిన తరుణం, అద్భుతమైన అవకాశం, అరుదైన సందర్భం ఇక రాదు! అందుకే.. అమ్మాయిలూ.. మీకు ఆకాశమే హద్దు.. అవకాశం అస్సలు వదలొద్దు!!

ఆల్ ది బెస్ట్ టీమిండియా!!!



మధ్యాహ్నం 3 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

మ్యాచ్ రద్దయితే..!

వర్ష ఛాయలు ఉండడంతో మ్యాచ్ ఎలా జరుగుతుందనేది ఆందోళన కలిగిస్తోంది. అయితే, సాధ్యమైనంత వరకు ఆదివారం మ్యాచ్‌ను ముగించడానికే ప్రయత్నిస్తారు. డక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం కనీసం 20 ఓవర్లకైనా కుదించి ఫలితం రాబట్టేందుకు చూస్తారు. అలా కాని పక్షంలో సోమవారమైన రిజర్వు డేన ఎక్కడైతే ఆట నిలిచిందో అక్కడి నుంచి మిగతా మ్యాచ్‌ను కొనసాగిస్తారు. ఒకవేళ రిజర్వు డేన కూడా ఆట సాధ్యం కాకపోతే మ్యాచ్‌ను రద్దు చేసి.. ఇరుజట్లనూ సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

పిచ్/వాతావరణం

మ్యాచ్ జరిగే డీవై పాటిల్ స్టేడియం వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం. అయితే, మంచు కురిసే అవకాశం ఉండడంతో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవచ్చు. వర్షం మ్యాచ్‌కు ఆటంకం కలిగించే పరిస్థితులున్నాయి. కానీ, రిజర్వు డే ఉంది. ఆసీస్ భారీ స్కోరును భారత్ ఛేదించిన పిచ్‌పైనే ఫైనల్ కూడా జరగనుండడం హర్మన్‌సేనకు సానుకూలాంశం.

నవీ ముంబై: అద్భుత పోరాటాలు.. నాటకీయ మలుపులు.. ఉత్కంఠ విజయాలు.. ఇలా సాగిన మహిళల ప్రపంచకప్‌లో కొత్త చాంపియన్‌కు రంగం సిద్ధమైంది. ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత జట్టు.. కలల కప్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఆదివారం జరిగే మెగా టైటిల్ ఫైట్‌లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఎన్నో ఏళ్లుగా ప్రపంచ క్రికెట్‌ను ఏలుతున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లేకుండా జరుగుతున్న తొలి ఫైనల్ కావడంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి మరింతగా పెరిగింది. ఇక.. 2017 ఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో 9 పరుగులతో ఓటమి భారత జట్టును వెంటాడుతూనే ఉంది. ఈసారి గెలుపు రుచి చూడాలని హర్మన్ బృందం బలంగా కోరుకొంటోంది. సొంతగడ్డపై ఆడుతుండడంతోపాటు రెండుసార్లు ఫైనల్ ఆడిన అనుభవం ఉన్న టీమిండియా మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. భారత్ టోర్నీలో తొలిసారిగా 2005లో ఫైనల్ చేరింది. మరోవైపు చిరస్మరణీయ ప్రదర్శనతో తొలిసారి ఫైనల్ బెర్త్ పట్టేసిన అండర్ డాగ్ సౌతాఫ్రికా.. కచ్చితంగా కప్పు నెగ్గాలన్న పట్టుదలతో ఉంది.

నాకౌట్ పంచ్‌తో..

టోర్నీలో హ్యాట్రిక్ ఓటములతో నాకౌట్ అవకాశాలు గల్లంతయ్యే ప్రమాదం నుంచి భారత జట్టు పుంజుకొన్న తీరు వావ్ అనిపించింది. ముఖ్యంగా సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాపై రికార్డు ఛేదన గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. తీవ్ర ఒత్తిడి.. బలమైన బౌలింగ్ వనరులున్న కంగారూలను కసిగా కొట్టడం అంటే సామాన్యమైన విషయం కాదు. జెమీమా రోడ్రిగ్స్ (127) జీవిత కాలం గుర్తుండి పోయే ఇన్నింగ్స్‌తోపాటు కెప్టెన్ హర్మన్ (89) జోరందుకోవడంతో భారత్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. గాయపడిన ఓపెనర్ ప్రతీక స్థానంలో జట్టులోకి వచ్చిన షఫాలీ, డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టుకు అదిరే ఆరంభాన్ని అందించాల్సిన అవసరం ఉంది. జెమీమా, హర్మన్, రిచా, దీప్తి రాణిస్తే భారత్‌కు తిరుగులేదు. బౌలింగ్‌లో పేసర్లు క్రాంతి గౌడ్, రేణుక ఆరంభంలోనే బ్రేక్ ఇస్తే ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే చాన్సుంది. టోర్నీలో మెరుగ్గా రాణిస్తున్న స్పిన్నర్లు శ్రీచరణి, దీప్తి అదే తరహా ప్రదర్శనను కొనసాగించాలి. అయితే, ధారాళంగా పరుగులిస్తున్న రాధా యాదవ్ స్థానంలో స్నేహ్ రాణాను ఆడించే అవకాశాలున్నాయి. భారత ఫీల్డింగ్ ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం కూడా ఉంది.

తెగువే ఆయుధం..

టోర్నీలో తడబడుతూ సాగినా కీలక సమయంలో గేర్ మార్చి అంతిమ సమరానికి చేరిన దక్షిణాఫ్రికా బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ లారా వొల్వార్ట్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. మరిజానె కాప్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా మారింది. ఓపెనర్ తన్జిమ్ బ్రిట్స్ ఫామ్‌లోకి వస్తే ఆపడం కష్టం. క్లో ట్రయన్, నడిన్ డి క్లెర్క్ ఫినిషర్లుగా రాణిస్తున్నారు. అయాబొంగా ఖకా, ఎమ్‌లబా, డి క్లెర్క్‌తో సఫారీల బలం కూడా ప్రత్యర్థికి దీటుగానే ఉంది. అయితే, స్పిన్ ఎదుర్కోవడంలో బలహీనత ఆ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. కానీ, సెమీస్‌లో ఇంగ్లండ్‌పై చూపిన తెగువతో జట్టు మరోసారి అదరగొట్టాలనుకొంటోంది.



గెలిస్తే రూ. 125 కోట్లు?

వరల్డ్ చాంపియన్‌గా నిలిస్తే భారత జట్టుకు భారీగా నజరానా ఇవ్వాలని బీసీసీఐ ఆలోచిస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన రోహిత్ సేనకు ఇచ్చిన రీతిలోనే భారీ బహుమతి అందజేసే అవకాశముంది. గతేడాది పొట్టికప్ నెగ్గిన టీమిండియా, సహాయ సిబ్బందికి కలిపి బోర్డు రూ. 125 కోట్ల బహుమతిని ప్రకటించింది. లింగ సమానత్వం పాటిస్తున్న నేపథ్యంలో కప్పు నెగ్గితే హర్మన్ సేనకు కూడా ఆ స్థాయి మొత్తం అందించాలని బోర్డు భావిస్తోంది.

జట్లు (అంచనా)

భారత్: స్మృతి మంధాన, షఫాలీ, జెమీమా, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్/స్నేహ్ రాణా, క్రాంతి, శ్రీచరణి, రేణుక సింగ్.

దక్షిణాఫ్రికా: లారా వొల్వార్ట్ (కెప్టెన్), తన్జిమ్ బ్రిట్స్, అన్నెక్ బోష్/మసబటా క్లాస్, సునె లుస్, మరిజానె కాప్, సినాలో జఫ్టా (వికెట్ కీపర్), అన్నెరి డెరెక్‌సన్, క్లో ట్రయన్, డి క్లెర్క్, ఖకా, ఎమ్‌లాబా.

బ్యాటర్లు చెలరేగాలి

- ఆస్ట్రేలియాతో భారత్ మూడో టీ20 నేడు
- హాజెల్‌వుడ్‌కు విశ్రాంతి

మధ్యాహ్నం 1.45 నుంచి..

హోబర్ట్: పేసర్ హాజెల్‌వుడ్ బౌన్స్‌తో బెంబేలెత్తించడంతో ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరిగిన రెండో టీ20లో భారత ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేశారు. అయితే త్వరలో యాషెస్ సిరీస్ నేపథ్యంలో ఆసీస్ జట్టు.. టీమిండియాతో జరిగే మిగిలిన మూడు టీ20ల నుంచి హాజెల్‌వుడ్‌కు విశ్రాంతి ఇచ్చింది. మరి.. దీనిని సద్వినియోగం చేసుకొని సూర్యకుమార్ బృందం.. ఆదివారం జరిగే మూడో మ్యాచ్‌లో చెలరేగుతారేమో చూడాలి. మరోవైపు ఎడమ చేతి పేసర్ అర్ష్‌దీప్‌కు జట్టులో చోటు కల్పించక పోవడం విమర్శలకు దారి తీస్తోంది. పేసర్లకు అనుకూలించే మెల్‌బోర్న్ పిచ్‌పై ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా ఆడడాన్ని విశ్లేషకులు తప్పుబట్టారు. మూడో మ్యాచ్ వేదిక బెల్లరీవ్ ఓవల్ పిచ్ స్వింగ్ బౌలింగ్‌కు అనుకూలిస్తుంది. దాంతో ఒక స్పిన్నర్‌ను తప్పించి పేసర్‌ను తుది జట్టులో తీసుకుంటారా లేదా అనేది చూడాలి.

టెన్నిస్‌కు బోపన్న గుడ్‌బై

న్యూఢిల్లీ: వెటరన్ స్టార్, గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన నలుగురు భారత ఆటగాళ్లలో ఒకడైన రోహన్ బోపన్న ప్రొఫెషనల్ టెన్నిస్‌కు శనివారం వీడ్కోలు పలికాడు. దరిమిలా రెండున్నర దశాబ్దాలకుపైగా సాగిన అతడి డబుల్స్ కెరీర్‌కు తెరపడింది. 45 ఏళ్ల బోపన్న ఆడిన చివరి టోర్నీ గతవారం జరిగిన పారిస్ మాస్టర్స్. ఆ టోర్నీలో రోహన్ తొలి రౌండ్‌లోనే ఓడాడు. 'ఆటకు వీడ్కోలు. కానీ ఇదే ముగింపు కాదు' అని బోపన్న ఉద్వేగభరిత పోస్ట్ చేశాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌తో భారత్‌కు చివరిసారి ఆడేశాడు. 2023లో డేవిస్ కప్‌నకు గుడ్‌బై చెప్పాడు.



రికార్డుల వీరుడు..

కర్ణాటకలోని కూర్గ్‌కు చెందిన బోపన్న డబుల్స్ ఆటగాడిగా ప్రసిద్ధుడు. 2000 సంవత్సరంలో ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అడుగుపెట్టిన అతడు పలు డేవిస్ కప్ పోటీలు, గ్రాండ్‌స్లామ్‌లు, ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. లేటు వయసులో రికార్డు ప్రదర్శనలతో అలరించిన బోపన్న.. 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్, 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిళ్లు సాధించాడు. 2023లో ఇండియన్ వెల్స్ గెలుపుతో 43 ఏళ్ల వయస్సులో ఏటీపీ మాస్టర్స్ టైటిల్ నెగ్గిన ఆటగాడిగా.. గతేడాది డబుల్స్‌లో నెంబర్ వన్ ర్యాంక్‌తో ఈ ఘనత సాధించిన అతిపెద్ద వయసు ఆటగాడిగానూ రికార్డులకెక్కాడు.

రిత్విక్ అదిరెన్

చెస్ వరల్డ్ కప్

మర్గావ్: ప్రపంచ కప్ చెస్ తొలి రౌండ్ మొదటి గేమ్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ మెరుగైన ప్రదర్శన చేశాడు. శనివారం జరిగిన తొలి గేమ్‌లో 2024 వరల్డ్ జూనియర్ చాంపియన్ నొగెర్బెక్ కజిబెక్ (కజకిస్థాన్)ను రిత్విక్ నిలువరించాడు. మిగతా తెలుగు ఆటగాళ్లు లలిత్ బాబు, కార్తీక్ వెంకట్రామన్ తొలి రౌండ్ మొదటి గేములోనూ ఫలితం తేలలేదు. ఆదివారం మొదటి రౌండ్ రెండో గేములు జరుగుతాయి. ఇక.. గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, హరికృష్ణలకు మొదటి రౌండ్‌లో బై లభించింది. దాంతో రెండో రౌండ్‌తో వారు బరిలో దిగుతారు.

ఆసుపత్రి నుంచి శ్రేయాస్ డిశ్చార్జ

న్యూఢిల్లీ: భారత వైస్-కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ సిడ్నీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఆస్ట్రేలియాతో గతనెల 25న జరిగిన మూడో వన్డేలో క్యాచ్ పట్టే యత్నంలో అయ్యర్ గాయపడిన సంగతి తెలిసిందే. పొత్తి కడుపులో గాయంతో అంతర్గతంగా రక్తస్రావం అయ్యింది. అందుకు చిన్నపాటి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం అయ్యర్ పూర్తిగా కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి శనివారం డిశ్చార్జ్ అయ్యాడని బీసీసీఐ తెలిపింది. ప్రయాణం చేసేందుకు అనువుగా ఫిట్‌నెస్ సాధిస్తే అతడు భారత్ వచ్చేస్తాడని పేర్కొంది. కాగా, శ్రేయాస్ దాదాపు రెండు నెలలు ఆటకు దూరం కానున్నాడు.

హైదరాబాద్ రానున్న మెస్సీ!



కోల్‌కతా: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చే అవకాశముంది. కేరళలో జరగాల్సిన స్నేహపూర్వక మ్యాచ్ రద్దవడంతో ఆ అవకాశం హైదరాబాద్‌కు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మెస్సీ ప్రమోటర్లు తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో స్నేహపూర్వక మ్యాచ్‌లో మెస్సీ ఆడే చాన్సుంది. వచ్చేనెల 12న కోల్‌కతా చేరుకోనున్న మెస్సీ.. 13న హైదరాబాద్ రానున్నట్టు తెలుస్తోంది.

బిజినెస్ ప్లస్

ఆరోగ్య బీమా తీసుకుంటున్నారా..!

పాలసీ ఎంపికే కీలకం



ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు పెద్దలు. ప్రస్తుత ప్రపంచంలో ఆరోగ్యం మరింత ముఖ్యం. అన్నీ ఉన్నా సరైన ఆరోగ్యం లేకపోతే అన్నీ తిప్పలే. ఇల్లూ ఒళ్లూ గుల్లవుతుంది. సరైన ఆరోగ్య బీమా పాలసీని ఎంచుకోవడం ద్వారా ఆర్థిక ఇబ్బందులను కొంత వరకు అధిగమించవచ్చు. మరి సరైన ఆరోగ్య పాలసీని ఎంచుకోవడం ఎలా? అయితే ఈ స్టోరీ చదవండి.

ఇన్‌క్యూర్డ్ క్లెయిమ్ నిష్పత్తి

ఆరోగ్య బీమా పాలసీ ఇచ్చే కంపెనీ సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఇన్‌క్యూర్డ్ క్లెయిమ్ నిష్పత్తి (ఐసీఆర్) ఒక గీటురాయి. ఈ ఐసీఆర్ ద్వారా బీమా కంపెనీ ఒక ఆర్థిక సంవత్సరంలో తన నికర ప్రీమియం వసూళ్లలో ఎంత మొత్తాన్ని క్లెయిమ్‌లుగా చెల్లిస్తోందనే విషయం తెలుస్తుంది. ఉదాహరణకు ఒక బీమా కంపెనీ ఐసీఆర్ 85 శాతం అనుకుందాం. అంటే ఆ కంపెనీ నికర ప్రీమియంగా వసూలు చేసే ప్రతి రూ.లక్షలో రూ.85,000 క్లెయిమ్స్‌గా చెల్లిస్తోందని అర్థం. కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే వ్యక్తులు, కనీసం 70 నుంచి 90 శాతం ఐసీఆర్ ఉన్న బీమా కంపెనీలనే ఎంచుకుంటే మంచిది.

క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో

ప్రస్తుతం మార్కెట్లో అనేక బీమా కంపెనీలు ఆరోగ్య బీమా పాలసీలను మార్కెట్ చేస్తున్నాయి. ప్రతి కంపెనీ లేదా ఆ కంపెనీ ఏజెంట్ మా కంపెనీ పాలసీ మంచిదంటే, మా కంపెనీ పాలసీ మంచిదని మాటలతో మభ్య పెడుతుంటారు. వారి మాటలు గుడ్డిగా నమ్మి పాలసీ తీసుకుంటే ఇక అంతే. క్లెయిమ్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు చుక్కలు కనిపిస్తాయి. ఆ తిప్పలు వద్దనుకుంటే, పాలసీ తీసుకునే ముందే ఆ కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి (సీఎస్ఆర్) తెలుసుకుని మరీ పాలసీ తీసుకోవడం మంచిది. ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చే క్లెయిమ్స్‌లో ఎంత శాతం క్లెయిమ్స్‌ని కంపెనీ సెటిల్ చేసిందనే విషయాన్ని సీఎస్ఆర్ తెలుపుతుంది. కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే వ్యక్తులు కనీసం 90 శాతం కంటే ఎక్కువ సీఎస్ఆర్ ఉన్న బీమా కంపెనీల పాలసీలను ఎంచుకోవవం మంచిది.

పాలసీ షరతులు

ప్రతి ఆరోగ్య బీమా పాలసీలో కొన్ని షరతులు, నిబంధనలు ఉంటాయి. మనం తీసుకునే ప్లాన్, బీమా కంపెనీని బట్టి ఇవి మారుతుంటాయి. వాటిని తెలుసుకుని పాలసీ తీసుకోవడం పాలసీదారుల బాధ్యత. లేకపోతే క్లెయిమ్స్ సమయంలో చిక్కులు తప్పవు. ఆ షరతులు ఏంటంటే?

రూమ్ రెంట్

ఆరోగ్య బీమా పాలసీలో రూమ్ రెంట్‌పై పరిమితులు ఉంటాయి. ఇది పాలసీ మొత్తంలో ఇంత శాతం లేదా ఇంత నిర్ణీత మొత్తమని ఉంటుంది. పాలసీ తీసుకునే ముందే, ప్రతి పాలసీదారుడు ఈ పరిమితులు తెలుసుకోవాలి. ఉదాహరణకు రూ.10 లక్షల పాలసీలో రూమ్ రెంట్ రోజుకి ఒక శాతం అనుకుందాం. అంటే ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తి హాస్పిటల్‌లో చేరితే రోజువారీ రూమ్ రెంట్ పాలసీ విలువైన రూ.10 లక్షల్లో ఒక శాతం అంటే రూ.10,000 మించకూడదు.

వెయిటింగ్ పీరియడ్

ప్రతి ఆరోగ్య బీమా పాలసీ కవరేజీకి కనీసం నెల రోజుల సమయం ఉంటుంది. అంటే పాలసీ తీసుకున్న నెల రోజుల్లోపు వచ్చే ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ లభించదు. అలాగే బీమా పాలసీ తీసుకున్న ఒకటి నుంచి మూడేళ్ల వరకు అప్పటికే ఉన్న కొన్ని అనారోగ్య సమస్యలకు కూడా కవరేజీ వర్తించదు. కొన్ని బీమా కంపెనీలు అధిక ప్రీమియంతో ఇప్పటికే ఉన్న వ్యాధులకు కూడా కవరేజీ కల్పిస్తున్నాయి.

కో-పేమెంట్ లేదా డిడక్షన్ ఆప్షన్

ఈ రెండు ఆప్షన్లలో దేన్ని ఎంచుకున్నా ప్రీమియం తగ్గుతుంది. అయితే పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు పాలసీదారుడి జేబుకు చిల్లు పడుతుంది. ఉదాహరణకు 20 శాతం కో-పేమెంట్ ఆప్షన్‌ను ఎంచుకుంటే, హాస్పిటల్ బిల్లులో 20 శాతం పాలసీదారుడు, మిగతా 80 శాతం బీమా కంపెనీ చెల్లించాలి. అలాగే నిర్ణీత మొత్తాన్ని డిడక్షన్ ఆప్షన్‌గా ఎంచుకుంటే ఆ మొత్తాన్ని పాలసీదారుడు చెల్లిస్తే, మిగతా మొత్తాన్ని బీమా కంపెనీ భరిస్తుంది.

నెట్‌వర్క్ ఆస్పత్రులు

కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే ప్రతి వ్యక్తి ఆ బీమా కంపెనీ జాబితాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులు మీకు దగ్గరలో ఉన్నాయో లేదో తెలుసుకోవాలి. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి ఈ ఆస్పత్రుల్లో చేరితే పాలసీ పరిమితికి లోబడి పైసా కూడా జేబు నుంచి ఖర్చు చేయకుండా బయటపడొచ్చు. అంటే ఈ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందుకోవచ్చన్న మాట. మీకు క్లెయిమ్ చేసే అవసరం లేకుండా ఆస్పత్రే మీ బిల్లును బీమా కంపెనీ నుంచి సెటిల్ చేసుకుంటుంది.

మినహాయింపులు

ప్రతి ఆరోగ్య బీమా పాలసీలో కొన్ని మినహాయింపులు ఉంటాయి. సాధారణంగా ఇప్పటికే ఉన్న వ్యాధులు, ఔట్ పేషెంట్ ట్రీట్‌మెంట్స్, స్థూలకాయానికి సంబంధించిన చికిత్సలు, కాస్మెటిక్ సర్జరీలు, వంధ్యత్వం, సాహస క్రీడలతో ఏర్పడే గాయాలు, దంత సంరక్షణ, ప్రసూతి చికిత్సలు ఈ మినహాయింపుల పరిధిలోకి వస్తాయి. అయితే ఈ మినహాయింపులు బీమా కంపెనీలను బట్టి మారుతుంటాయి. పాలసీ తీసుకునే ముందే వీటిని చెక్ చేసుకోవాలి.

ప్రీ-పోస్ట్ హాస్పిటలైజేషన్ కవరేజీ

హాస్పిటల్‌లో చేరడానికి ముందు లేదా చేరిన తర్వాత జరిపే బ్లడ్ టెస్టులు, ఎక్స్-రే, సీటీ స్కాన్, ఈసీజీ, ఎంఆర్ఐ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రీ హాస్పిటలైజేషన్ ఖర్చుల పరిధిలోకి వస్తాయి. కొన్ని బీమా కంపెనీలు నెల నుంచి రెండు నెలల ముందు జరిపే ఈ పరీక్షలకు కూడా కవరేజీ కల్పిస్తున్నాయి. ఇక హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యాక ఔషధాలు, ఫాలో అప్ కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఫిజియోథెరపీ, కోలుకోవడానికి అవసరమైన ఇతర వైద్య సేవల ఖర్చులు పోస్ట్ హాస్పిటలైజేషన్ ఖర్చుల పరిధిలోకి వస్తాయి. చాలా ఆరోగ్య బీమా కంపెనీలు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక రెండు నెలల నుంచి ఆరు నెలల వరకు అయ్యే ఈ ఖర్చులకు కవరేజీ కల్పిస్తున్నాయి.

వీలైనంత ఎక్కువ కాలానికి ప్రీ హాస్పిటలైజేషన్, పోస్ట్ హాస్పిటలైజేషన్ ఖర్చులకు కవరేజీ కల్పించే బీమా కంపెనీల పాలసీలను ఎంచుకుంటే మంచిదని నిపుణుల సూచన. లేకపోతే ఆరోగ్య బీమా పాలసీ ఉన్నా పెద్ద మొత్తంలో జేబులోని డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

అక్టోబరులో 4.6% వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: అక్టోబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.6 శాతం వృద్ధితో రూ.1.96 లక్షల కోట్లకు చేరింది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో పండగ సీజన్‌లో కొనుగోళ్లు జోరందుకోవడం ఇందుకు దోహదపడింది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సగటు వృద్ధి రేటు 9 శాతంగా ఉంది. సెప్టెంబరు 22 నుంచి 375 ఉత్పత్తులపై జీఎస్‌టీ రేట్లు తగ్గడం గత నెల ఆదాయ వృద్ధిని పరిమితం చేసింది. ఈ ఆగస్టులో జీఎస్‌టీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ.1.86 లక్షల కోట్లుగా, సెప్టెంబరులో 9.1 శాతం పెరుగుదలతో రూ.1.89 లక్షల కోట్లుగా నమోదైంది.

నికర ఆదాయం రూ.1.69 లక్షల కోట్లు

స్థానిక విక్రయాలకు సంకేతమైన దేశీయ స్థూల ఆదాయం గత నెలలో 2 శాతం పెరుగుదలతో రూ.1.45 లక్షల కోట్లుగా ఉంది. దిగుమతుల నుంచి పన్ను రాబడి 13 శాతం వృద్ధితో రూ.50,884 కోట్లకు పెరిగింది. గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు 39.6 శాతం పెరిగి రూ.26,934 కోట్లకు చేరాయి. రిఫండ్లు మినహాయించగా, జీఎస్‌టీ నికర ఆదాయం 0.2 శాతం పెరుగుదలతో రూ.1.69 లక్షల కోట్లుగా ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో.. : గత నెల తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.5,726 కోట్లకు చేరగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వసూళ్లు 9 శాతం తగ్గి రూ.3,490 కోట్లుగా నమోదయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	115
వరంగల్	107	గుంటూరు	121
కరీంనగర్	107	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	123
విశాఖపట్నం	111	అనంతపురం	123
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,000 ▲	1,12,750 ▲	1,66,000 ▲
విజయవాడ	1,25,000 ▲	1,18,000 ▲	1,52,200 ▼
విశాఖపట్నం	1,24,370 ▲	1,13,000 ▲	1,66,000 ▲
రాజమండ్రి	1,23,000 ▼	1,12,750 ▼	1,50,000 ▲
ప్రొద్దుటూరు	1,21,300 ▲	1,11,600 ▲	1,52,500 ▼
ముంబై	1,20,770 ▲	1,10,625 ▲	1,49,125 ▲


వాహన విక్రయాల్లో రికార్డు

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో అక్టోబరులో పోటెత్తిన అమ్మకాలు

న్యూఢిల్లీ: ఈ పండగ సీజన్‌లో ప్యాసింజర్ వాహన కంపెనీలకు భారీ లాభాల పంట పండింది. దేశంలో అతి పెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీ ఇండియాతో పాటు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్, కియా ఇండియా గత నెలలో రికార్డు స్థాయి దేశీయ విక్రయాలను నమోదు చేశాయి. స్కోడా ఆటో ఇండియా, టయోటా కిర్లోస్కర్ సేల్స్ కూడా భారీగా పెరిగాయి. దసరా నవరాత్రుల తొలి రోజు (సెప్టెంబరు 22) నుంచి తగ్గించిన జీఎస్‌టీ రేట్లు అమల్లోకి రావడంతో పండగ సీజన్‌లో కస్టమర్ల కొనుగోళ్లు పోటెత్తడం ఇందుకు దోహదపడింది. అక్టోబరులో కంపెనీ 2,42,096 యూనిట్ల రిటైల్ విక్రయాలు జరిపిందని, 2024 అక్టోబరుతో పోలిస్తే సేల్స్ 20 శాతం పెరిగాయని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. ఇది కంపెనీ చరిత్రలో అత్యధిక నెలవారీ విక్రయాలని అన్నారు. నవరాత్రుల తొలి రోజు మొదలుకొని 40 రోజుల పండగ సీజన్‌లో కంపెనీకి 5 లక్షల కార్ల బుకింగ్స్ లభించాయని, రిటైల్ సేల్స్ 4.1 లక్షల యూనిట్లుగా నమోదైనట్లు బెనర్జీ వెల్లడించారు. మరిన్ని విషయాలు..

- గత నెలలో మారుతి సుజుకీ దేశీయ టోకు విక్రయాలు (ప్యాసింజర్, కమర్షియల్ వాహనాలు) వార్షిక ప్రాతిపదికన 10.75 శాతం వృద్ధితో ఆల్‌టైం రికార్డు స్థాయి 1,80,675 యూనిట్లకు చేరాయి. అందులో ప్యాసింజర్ వాహనాల దేశీయ టోకు విక్రయాలు 10.48 శాతం పెరుగుదలతో 1,76,318 యూనిట్లుగా ఉన్నాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా ఎస్‌యూవీల టోకు విక్రయాలు 31 శాతం వృద్ధితో 71,624 యూనిట్లకు చేరాయి. కంపెనీ చరిత్రలో ఇవే అత్యధిక ఎస్‌యూవీ విక్రయాలు.
- టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్ టోకు విక్రయాలు 26.6 శాతం పెరుగుదలతో 61,295 యూనిట్లకు చేరాయి.
- హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దేశీయ విక్రయాలు మాత్రం వార్షిక ప్రాతిపదికన 3.2 శాతం తగ్గి 53,792 యూనిట్లకు పరిమితం అయ్యాయి. కియా ఇండియా విక్రయాలు 30 శాతం పెరిగి 29,556 యూనిట్లకు చేరాయి.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) టోకు అమ్మకాలు 39 శాతం పెరిగి 42,892 యూనిట్లకు చేరగా.. స్కోడా ఆటో రికార్డు స్థాయిలో 8,252 కార్లను విక్రయించింది. నిస్సాన్ మోటార్ దేశీయంగా 2,402 కార్లను విక్రయించింది. హోండా కార్స్ దేశీయ అమ్మకాలు 15.3 శాతం వృద్ధితో 6,934 యూనిట్లకు పెరిగాయి.

వాణిజ్య వాహనాలు: కమర్షియల్ వెహికిల్స్ విషయానికొస్తే, అశోక్ లేలాండ్ వాహనాల దేశీయ టోకు విక్రయాలు 16 శాతం పెరుగుదలతో 16,314 యూనిట్లకు పెరిగాయి. టాటా మోటార్స్ దేశీయ టోకు అమ్మకాలు 7 శాతం వృద్ధితో 35,108 యూనిట్లుగా నమోదయ్యాయి.


హరీశ్ రావును పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ డీకే అరుణ

హరీశ్‌కు మంత్రి తుమ్మల పరామర్శ

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. అలాగే ఎంపీలు డీకే అరుణ, సురేశ్‌కుమార్ షెట్కార్, నగేశ్, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, పితాని సత్యనారాయణ తదితరులు హరీశ్‌రావును పరామర్శించి.. ఆయన తండ్రి సత్యనారాయణ రావు మృతిపట్ల సంతాపం తెలిపి, చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సామాజిక తెలంగాణే జాగృతి లక్ష్యం: కవిత



సుభాష్‌నగర్ (కరీంనగర్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణే లక్ష్యంగా తెలంగాణ జాగృతి పనిచేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కరీంనగర్ జిల్లాలో రెండురోజులపాటు జాగృతి ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో ఆమె మాట్లాడారు. తాను ఎవరో వదిలిన బాణాన్ని కాదని, తెలంగాణ ప్రజల బాణాన్ని అని తెలిపారు. పేదవాడికి నేటికీ నాణ్యమైన విద్య, వైద్యం అందడంలేదని ఆవేదన చెందారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నల్లచట్టాలు అమలు చేయడం వల్ల కార్మికులు ఎంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలకు రైతులు పంట నష్టపోయారని, వారికి ప్రభుత్వం ఎకరానికి రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు అర్హత సాధించిన నాలుగు సంస్థలు

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి ఐదు సంస్థలు టెక్నికల్ బిడ్లు వేయగా.. అందులో నాలుగు సంస్థలు అర్హత సాధించినట్లు తెలిసింది. వాటిలో ఒకటి ఐఐటీ మద్రాస్, ఆర్వీ కన్సల్టెన్సీ, ఐప్రీసాస్(స్విస్ సంస్థ) జేవీ కాగా.. మరొకటి పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్న ఆఫ్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(ముంబై), నిప్పాన్ కోయి ఎంఎన్‌సీ(జపాన్)తో పాటు మరో సంస్థ ఉంది. సోమవారంకల్లా ఈ సంస్థల ఫైనాన్షియల్ బిడ్ల దాఖలుకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) కోరనున్నారు. ఇప్పటికే ఐఐటీ మద్రాస్‌తో కూడిన జేవీకే పనులు అప్పగించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. టెక్నికల్ బిడ్లలో అర్హత సాధించిన నాలుగు సంస్థల నుంచి ఆర్ఎఫ్‌పీ కోరి.. ఫైనాన్షియల్ బిడ్లను స్వీకరించిన తర్వాత తుది పరిశీలన అనంతరం సంస్థను ఎంపిక చేసుకోనున్నారు.

న్యాయ వ్యవస్థ పరిరక్షణ బాధ్యత అందరిదీ

- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్
- భూపాలపల్లి, ములుగుల్లో కోర్టు భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన
- పాల్గొన్న జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ రాజేశ్వర్‌రావు


భూపాలపల్లిలో కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ రాజేశ్వర్‌రావులు

భూపాలపల్లి (కృష్ణ కాలనీ)/ములుగు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం అందించడమే కర్తవ్యంగా న్యాయస్థానాలు పనిచేస్తున్నాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. పౌరుడి ప్రాథమిక హక్కుల పరిరక్షణకు పని చేస్తున్నాయని తెలిపారు. అందువల్ల న్యాయ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. భూపాలపల్లి, ములుగుల్లో నిర్మించనున్న కోర్టు భవన సముదాయాలకు ఆయన శనివారం వర్చువల్‌గా హైదరాబాద్ నుంచి శంకుస్థాపన చేశారు. భూపాలపల్లి ఎస్పీ కార్యాలయం, ములుగు కలెక్టరేట్‌ల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ ఎన్.రాజేశ్వరరావులు నేరుగా హాజరయ్యారు. భూపాలపల్లిలోని కృష్ణకాలనీలో నిర్మించనున్న కోర్టు భవన సముదాయానికి సర్వమత ప్రార్థనల నడుమ ఇద్దరు న్యాయమూర్తులు శంకుస్థాపన చేశారు. ములుగులోని గట్టమ్మ దేవాలయం సమీపంలో నిర్మించనున్న కోర్టు భవనాలకు జస్టిస్ ఈవీ.వేణుగోపాల్, ఎన్.రాజేశ్వర్‌రావు భూమి పూజ చేశారు.

రిజర్వేషన్ల కోసం బీసీలు ఉద్యమించాలి

- బాపూఘాట్ వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధన కోసం సకల జనులు ఉద్యమించినట్టుగా బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించేందుకు సకల బీసీలు ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలు కావాలని కాంక్షిస్తూ తెలంగాణ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద జరిగిన భజనలు, ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం చట్టపరంగా, న్యాయపరంగా చేయాల్సినవి చేసి గవర్నర్ ద్వారా బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రానికి పంపినట్టు తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలయ్యేలా అందరి మనసులు మారాలని ప్రార్థనలు చేసినట్టు పేర్కొన్నారు.

ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు

బతికున్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో అధికారుల చర్య

నెహ్రూసెంటర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవల ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు పడింది. సీహెచ్.వెంకన్న (సెక్యూరిటీ గార్డు), రాజన్న (శానిటేషన్ సూపర్‌వైజర్)లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారిని విధుల నుంచి తొలగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మురళీ నాయక్ ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, విధులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. నర్సులు కాలక్షేపం చేస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పనిచేయిస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి ఆరోపణలు మరోసారి వస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఆదివారం నుంచి విధుల్లో ఉన్నప్పుడు ఉద్యోగులెవరూ సెల్‌ఫోన్ ఉపయోగించవద్దని, అత్యవసరమైతే స్మార్ట్ ఫోన్‌లకు బదులుగా కీప్యాడ్ ఫోన్‌లను వినియోగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

మావోయిస్టుల కీలక డేటా ధ్వంసం!

(మొదటిపేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మావోయిస్టులకు సంబంధించిన సమాచారం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధ్వంసం కావడాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇందులో భాగంగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేసులో బీజేపీ ఇంప్లీడ్ అయిందని ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో నివేదిక ఇచ్చింది. దాదాపు 15 రోజుల కిందట ఈ నివేదికను సుప్రీంకు నివేదించినట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. ఆ నివేదికలో ఏముందన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.

బీజేపీ హైకమాండ్ వద్ద సమగ్ర నివేదిక !

తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సమగ్ర సమాచారం బీజేపీ జాతీయ నాయకత్వం వద్ద ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆ పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. అధినాయకత్వానికి చేరిన ఎఫ్ఎస్ఎల్ నివేదికలో పలు కీలక అంశాలను పేర్కొన్నారు. అందులో, "మావోయిస్టుల పేర్లతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రముఖులు, జడ్జిలు, సినీతారలు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతోపాటు ఆనాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ కేంద్ర పార్టీ నాయకత్వంతో మాట్లాడిన అంశాలను కూడా ఎస్ఐబీ అధికారులు ట్యాప్ చేశారు. ఈ ట్యాపింగ్ ద్వారానే గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఒక అభ్యర్థికి సంబంధించి రూ.7 కోట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు అభ్యర్థులను, సినీ తారలను బెదిరించి వందల కోట్లు వసూలు చేశారు. ఆ డబ్బును అప్పటి ప్రభుత్వ పెద్దలు, హవాలా ద్వారా విదేశాలకూ తరలించినట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు, రిటైర్ అయిన ప్రభాకర్‌రావును ఎస్ఐబీ చీఫ్‌గా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించడం వెనుకా భారీ స్కెచ్ ఉంది. కేంద్ర హోంశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఆయన నియామకం జరిగింది. ఎన్నికల సర్వేలతోపాటు ఫలితాలు వెలువడే సమయంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోతోందని నిర్ధారణ కావడంతో ఎస్ఐబీ తన వద్ద ఉన్న డేటాను ధ్వంసం చేసింది. ఇందులో మావోయిస్టులకు సంబంధించిన కీలక డేటాఉంది" అని నివేదికలో పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడమే లక్ష్యం..

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో తమ పార్టీ నాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని బీజేపీ కీలక నేత ఒకరు వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే హైకోర్టులో బీజేపీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసు దర్యాప్తునకు సిట్ పరిధి సరిపోదని, ఇది జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో కూడా ముడిపడి ఉందని పిటిషన్‌లో పేర్కొంది. అంతేకాకుండా.. సుప్రీంకోర్టులో కొనసాగుతున్న ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ రద్దు కేసును నిన్నమొన్నటి దాకా పట్టించుకోని తమ పార్టీ జాతీయ నాయకత్వం.. ఈ కేసును సీబీఐకి ఇవ్వాలని కోరుతూ తాజాగా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ఇందులో భాగమేనని బీజేపీ కీలక నేత వివరించారు. పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఎదుట గత ఆగస్టు 8న బండి సంజయ్ హాజరైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు కూడా సీబీఐ దర్యాప్తు కోరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జూబ్లీ హిల్స్‌లో యువతంత్రం

మొత్తం ఓటర్లలో మూడోవంతు వారే.. గెలుపోటముల్లో 18-35 మధ్య వయస్కులే కీలకం

- వీరిలో దాదాపు 85 % విద్యావంతులే
- నడి వయసు వారూ ఇక్కడ నిర్ణయాత్మకమేవారిని మచ్చిక చేసుకునేందుకు పార్టీల పావులు



బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్..! ఇక్కడ గెలుపు కోసం మూడు పార్టీలూ నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్నాయి. కానీ, ఇక్కడ అభ్యర్థుల తలరాతను రాసేది మాత్రం యువతే! ఇందుకు కారణం మొత్తం ఓటర్లలో మూడోవంతు యువతరమే! వీరంతా 35 ఏళ్లలోపు వయస్కులే! మరో ముఖ్య విషయం ఏమిటంటే.. యువతలో దాదాపు 85 శాతం విద్యావంతులే! అందుకే, విద్యార్థులు, ఉద్యోగులను తమవైపు తిప్పుకొనేందుకు అన్ని పార్టీలూ కసరత్తు ముమ్మరం చేశాయి. తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల కమిషన్ పేర్కొంది. వీరిలో 18-35 సంవత్సరాల మధ్య వయస్కులు సుమారు 1,30,042 మంది ఉన్నట్టు తేలింది. వీరిలో కొత్తగా ఓటు వచ్చిన 18-19 మధ్య వయస్కులు 12,396 మంది. ఇక, 20 నుంచి 29 ఏళ్ల వయసున్న వారు 72,544 మంది. 30 నుంచి 35 వయసు ఉన్నవారు 45,102 మంది. మొత్తంగా 18-35 మధ్య వయసు ఉన్నవారు 32.4 శాతం. ఆ తర్వాత 36-40 మధ్య వయస్కులు 46,716 మంది. వీరు మొత్తం ఓటర్లలో 11.6 శాతం. అందుకే, ఇప్పుడు అన్ని పార్టీలూ యువతపై కన్నేశాయి! ఇప్పటికే ఓ పార్టీ ఐటీ నిపుణులతో సమావేశమైంది. సోషల్ మీడియాలో యువత యాక్టివ్‌గా ఉంటున్న నేపథ్యంలో.. వారే లక్ష్యంగా చేసుకొని ప్రచారం చేస్తోంది. మరో పార్టీ.. యువతను ఆకర్షించడమే లక్ష్యంగా ఏదైనా వేడుక చేయాలని యోచిస్తోంది. యువతను ఆకట్టుకోవడంతోపాటు ఓటింగ్‌కు తీసుకు రావడంపై ఆయా పార్టీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఏయే ప్రాంతాల్లో ఏ వయసు ఓటర్లు ఎక్కువగా ఉన్నారో ఇప్పటికే జాబితాను కూడా సిద్ధం చేసుకున్నాయి.

వయసుల వారీగా ఓటర్ల సంఖ్య (సుమారుగా)

వయసు	ఓటర్లు
18-19	12,396
20-29	72,544
30-35	45,102
36-40	46,716
40-49	86,146
50-59	67,702
60-69	38,236
70-79	18,211
80 పైబడినవారు	6,052

మధ్య వయస్కులూ కీలకమే!

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపోటముల్లో మధ్య వయస్కులు కూడా అత్యంత కీలకం. ఎందుకంటే, 40 ఏళ్లు దాటిన వాళ్లు కూడా ఇక్కడ ఎక్కువే. నియోజక వర్గంలో 40-59 మధ్య వయసు కలిగిన ఓటర్లు 1,53,848 లక్షల మంది. మొత్తం ఓటర్లలో వీరి శాతం 38.3 శాతం. ఇక, 60 నుంచి 80 ఏళ్లు పైబడిన వారు 62,499 మంది ఉండగా.. మొత్తం ఓటర్లలో వీరు 15.5 శాతం. అంతేనా.. నియోజకవర్గంలో 40-59 మధ్య వయసు ఉన్న వారిలో చాలా వరకు ఉద్యోగస్తులేనని అధికారులు నిర్ధారించారు. గెలుపోటముల్లో మధ్య వయస్కుల పాత్ర కూడా కీలకం కావడంతో పార్టీలు వారిని ఆకట్టుకునేందుకు పావులు కదుపుతున్నాయి. వారికి పార్టీ అమలు చేసిన చేస్తున్న పథకాలను వివరిస్తున్నాయి. ముఖ్యంగా మహిళలను ఆకట్టుకునేందుకు అధికార పార్టీ ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు గురించి చెబుతుంటే.. బీఆర్ఎస్ తమ హయాంలో అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ గురించి ప్రచారం చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాలను బీజేపీ వివరిస్తోంది. ఇక, యువత ఆలోచనలు విభిన్నంగా ఉంటాయి. స్థానికత, అధికారంలో ఎవరు ఉన్నారు!? పార్టీ పనితీరు తదితర అంశాలను ఓటు వేసే ముందు సాధారణ ఓటరు పరిగణనలోకి తీసుకుంటే.. విశాలమైన రోడ్లు, ఇబ్బందుల్లేని మంచినీటి సరఫరా, ట్రాఫిక్ తదితర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై యువత ఆలోచిస్తారని, ఈ దిశగా వారిని ఆకట్టుకునేందుకు పార్టీలు పావులు కదుపుతున్నాయని ఓ పార్టీ నాయకుడు తెలిపారు. అలాగే, ఓటు ఎలా వేయాలనే అంశంపై యువతకు అవగాహన కల్పించేందుకు డమ్మీ యంత్రంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్

ఇండియాజాయ్-2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐటీకి రాజధానిగా మాత్రమే కాక భారత్ క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చి దిద్దాలన్నదే తమ సర్కారు సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టీవీఏజీఏ) సంయుక్తాధ్వర్యంలో 'ఇండియాజాయ్ - 2025' పేరుతో హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీలో 2 రోజులు జరిగే 'ఇండియాస్ ప్రీమియర్ మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ కాంగ్రెగేషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. సాంకేతికత, సృజనాత్మకతలను కలగలిపే హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరంగా ప్రపంచానికి మార్గ నిర్దేశం చేస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేందుకు ప్రభుత్వంతో కలిసి క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈ-స్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత సంస్థలకు విజ్ఞప్తి చేశారు. క్రియేటివిటీలో వైవిధ్యం, స్థిరత్వం, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రించేదిగా కాకుండా 'కో క్రియేటర్'గా మీకు అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ జీఎంపై సర్కారు సీరియస్

- విచారణకు మంత్రి అడ్లూరి ఆదేశం
- గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక ఆధారంగా చర్యలు

హైదరాబాద్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ (జీసీసీ) జనరల్ మేనేజర్ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ పంపినట్లు సమాచారం. ఆయన నివేదిక ఆధారంగా సీతారాం నాయక్‌పై చర్యలుంటాయని మంత్రి అడ్లూరి చెప్పారు. ఈ విషయమై సీఎంఓ వర్గాలు కూడా ఆరా తీశాయి. జీసీసీలో అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేయడంతోపాటు, ఆర్టీఐ ద్వారా తనకవసరమైన సమాచారం కోసం పిటిషన్ దాఖలు చేయడానికెళ్లి తనపై దాడి చేశారని పోలీసులకు బాధితుడు, నగరభేరి లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేశ్‌నాయక్ ఫిర్యాదు చేశారు. దీంతో జీఎం సీతారాం నాయక్‌పై కేసు నమోదు కాగా, శనివారం ఆంధ్రజ్యోతిలో 'అక్రమాలపై ఫిర్యాదు ఇవ్వబోతే దాడి' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయం ప్రభుత్వ పెద్దల వద్దకు చేరడంతో జీసీసీ జీఎం సీతారాం నాయక్.. బాధితుడితో రాజీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. డిసెంబరులోనే తనకు రిటైర్మెంట్ ఉందని దీన్ని పెద్దదిగా చేయకుండా ముగింపు పలకాలని రాజీ కుదిర్చేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయి కుల, ఉద్యోగ సంఘాల నేతలను రంగంలోకి దింపి సీతారాం నాయక్ రకరకాలుగా బుజ్జగించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని బాధితుడు రాజేశ్‌నాయక్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తనకు న్యాయం చేయాలని కోరనున్నట్లు చెప్పారు.

మద్యం దుకాణం దక్కించుకున్న పీఈటీపై వేటు

- సస్పెండ్ చేసిన విద్యాశాఖ అధికారి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన మద్యం టెండర్లలో పాల్గొని వైన్‌షాప్ దక్కించుకున్న ఓ ప్రభుత్వ పాఠశాల పీఈటీని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్‌లోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న పుష్ప మద్యం దుకాణానికి టెండరు దాఖలు చేసింది. లక్కీ డిప్‌లో ఆమెకు దుకాణం దక్కింది. ఈ విషయంపై మద్యం టెండర్లలో పాల్గొన్న పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు.. ఆధారాలు సేకరించారు. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ డీఈవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పామాయిల్‌లో మలేసియాకు దీటుగా..

అప్పారావుపేట ఫ్యాక్టరీలో 20శాతం ఓఈఆర్.. ఇది దేశంలోనే అత్యధిక అయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేటు

- ఓఈఆర్ ఆధారంగానే పామాయిల్ ధర
- రైతులకు మరింత లబ్ధి.. పెరిగిన రేటు ప్రకారం ప్రస్తుత ధరపై టన్నుకు అదనంగా రూ.500
- మంత్రి తుమ్మల సహకారంతోనే సాధ్యం: అయిల్ ఫెడ్ ఛైర్మన్


అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో అధికారులను సన్మానిస్తున్న ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్, రైతు సంఘ నాయకులు

అశ్వారావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలోని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేటు (ఓఈఆర్)ను సాధించింది. ప్రాసెస్ చేసిన గెలల బరువు మేరకు నూనె బరువు శాతాన్ని ఈ ఓఈఆర్ సూచిస్తుంది. ఫ్యాక్టరీల్లో సాధించిన ఓఈఆర్ ఆధారంగానే పామాయిల్ గెలల ధరలను ప్రభుత్వం నిర్ణయిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఫ్యాక్టరీల్లో క్రషింగ్ అయ్యే గెలలన్నింటికీ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో వచ్చే ఓఈఆర్ శాతాన్ని ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుంది. ప్రస్తుతం పెరిగిన ఓఈఆర్ శాతం ప్రకారం టన్నుకు ప్రస్తుత ధరపై అదనంగా రూ.500 ధర రానుంది. కాగా పామాయిల్‌లో మలేసియాతో సమానంగా దేశంలోనే అత్యధిక ఓఈఆర్‌ను సాధించడం రాష్ట్ర ఆయిల్‌ఫెడ్‌కు గర్వకారణంగా అభివర్ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది, రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ అధికారులు, ఉద్యోగులను రాఘవరెడ్డి సత్కరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణ, ప్రోత్సాహంతోనే ఈ ఖ్యాతిని సొంతం చేసుకోగలిగామని ఆయిల్‌ఫెడ్ అధికారులు, పామాయిల్ రైతు సంఘం ప్రతినిధులు సంబరాలు జరుపుకొంటున్నారు.

3.30 లక్షల టన్నుల గెలల క్రషింగ్

రాష్ట్రంలోనే తొలిసారిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో పామాయిల్ తోటలను వేశారు. ప్రస్తుతం లక్ష ఎకరాల్లో తోటలు విస్తరించి ఉండగా వాటిలో దాదాపు 60వేల ఎకరాల తోటలుదిగుబడినిస్తున్నాయి. పామాయిల్ గెలలను క్రషింగ్ చేయడానికి అశ్వారావుపేట, అప్పారావుపేటల్లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ ఫ్యాక్టరీలను నిర్మించారు. ఈ ఫ్యాక్టరీల్లో వచ్చే ఆయిల్ రికవరీ శాతాన్ని బట్టే ప్రస్తుతం దేశంలో పామాయిల్ ధరలను నిర్ణయిస్తారనేది తెలిసిందే. కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా పామాయిల్ తోటల విస్తరణ, కొత్త ఫ్యాక్టరీల నిర్మాణాలతో ఆయిల్‌ఫెడ్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో తొలిసారిగా లక్ష టన్నులు గెలలు, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో 2.30 లక్షల టన్నులు మొత్తం 3.30 లక్షల టన్నుల గెలలను రికార్డు స్థాయిలో క్రషింగ్ చేశారు. ఉత్పత్తి సామర్థ్యమే కాకుండా దేశంలోనే అత్యధిక ఓఈఆర్ 20.01ను దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ సాధించి అరుదైన రికార్డును సొంతం చేసుకుంది.

ఆయిల్‌ఫెడ్‌కే గర్వకారణం

దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ దేశంలోనే అత్యధికస్థాయిలో 20.01శాతం ఓఈఆర్ శాతాన్ని సాధించడం ఆయిల్‌పెడ్‌కు ఎంతో గర్వకారణం. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతర పర్యవేక్షణ, సహకారం, కృషితోనే ఇదంతా సాధ్యమైంది. 3.30 లక్షల అత్యధిక టన్నుల గెలలను క్రషింగ్ చేయడం కూడా మరో అరుదైన సంఘటన. ఇందుకోసం కృషి చేసిన ఆయిల్‌ఫెడ్ అధికారులు, ఉద్యోగులు, సహకరించిన రైతులకు అభినందనలు.

- జంగా రాఘవరెడ్డి, టీజీ ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్


మంత్రి తుమ్మల సహకారాన్ని రైతులు మరువలేరు

పామాయిల్ సాగును ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు తోటల విస్తరణ, ధరల నిర్ణయం, ఫ్యాక్టరీల నిర్మాణం, రాయితీలను అందించడంతో పాటు అనేక విధాలుగా మంత్రి తుమ్మల సహకరించారు. ఆయన సహకారాన్ని రైతులు మరువలేరు.

- ఆలపాటి రామచంద్ర ప్రసాద్, రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షుడు

కడియం సమక్షంలో రైతుల ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగేందుకు యత్నించిన ముగ్గురు.. అడ్డుకున్న పోలీసులు వరంగల్ జిల్లా ధర్మసాగర్‌లో ఘటన
- ఇరిగేషన్ అధికారుల తీరు వల్లే నష్టపోయామంటూ రైతుల ఆవేదన


పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

ధర్మసాగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వరదలకు ధ్వంసమైన పంటలను పరిశీలించేందుకు వెళ్లిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అక్కడ రైతుల గుండెకోత కళ్లకు కట్టింది. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామంలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరి పొలాలను, ధ్వంసమైన దేవునూర్ బ్రిడ్జి, రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా.. ఇరిగేషన్ అధికారుల తీరుతోనే చేతికొచ్చిన దశలో పంటలు నీటమునిగాయని, ఫలితంగా పంటలకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో దేవునూర్ గ్రామానికి చెందిన రైతులు నార్లగిరి సమ్మయ్య, చిట్టి రవి పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారి చేతుల్లోంచి పురుగుల మందు డాబ్బాలను లాక్కుని సర్దిచెప్పడంతో ఆ రైతులు శాంతించారు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు మోరే మహేందర్ తాను మూడెకరాల్లో సాగుచేసిన వరిపంట పూర్తిగా పనికిరాకుండా పోయిందంటూ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ వర్షం వల్ల రైతులు నష్టపోతే వారి అదృష్టం బాగోలేదని అనుకోవొచ్చు.. కానీ దేవాదుల ప్రాజెక్టు గేట్లు తెరవడం వల్ల రైతుల పంటలు మునిగిపోయాయని.. దీనికి పరిహారం ఎవరు చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. దేవాదుల వరద వల్ల రైతుల పంటలు నష్టపోకుండా ఉండాలంటే వాగును వెడల్పు చేయాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులను గుర్తిస్తే ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పనులను చేపట్టాలని ఆదేశించారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందించాలని అధికారులకు సూచించారు. దేవునూర్ బ్రిడ్జి మరమ్మతు, రోడ్డు పనులను 15 రోజుల్లో పూర్తిచేసి నిలిచిపోయిన రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు.



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎస్పీఆర్ హిల్స్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బీఆర్ఎస్, బీజేపీ ఒకే తాను ముక్కలు

» గత పార్లమెంట్ ఎన్నికల నుంచి పొత్తు: పొంగులేటి

బోరబండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ నాయకులకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటు అడిగే హక్కులేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకే తాను ముక్కలేనని ఎద్దేవా చేశారు. గత పార్లమెంటు ఎన్నికల నుంచి ఆ పార్టీల మధ్య పొత్తు ఉందని ఆరోపించారు. గతంలో దివంగత సీఎల్పీ మాజీనేత పీజేఆర్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన తర్వాత ఇంతవరకు మళ్లీ అటువంటి అభివృద్ధే జరగలేదని అన్నారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని బీఆర్ఎస్ నేతలు.. కేవలం 20 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ సరిపోల్చడం వారి అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఉపఎన్నికల తర్వాత తాను ప్రత్యేకంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి వచ్చి పేదలకు ఇండ్లపట్టాలు, ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతల చెంప చెళ్లుమనేలా కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వందమంది మైనార్టీ యువకులకు, మరో వంద మంది మహిళలకు మంత్రి పొంగులేటి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆలయాల్లో ఏర్పాట్లపై దృష్టి సారించండి

» భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చినా ఇబ్బందులు రావద్దు

» కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు కీలక సూచనలు చేశారు. ఆలయాల్లో భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ హరీశ్‌ను ఆదేశించారు. కార్తీక దిపోత్సవం ప్రత్యేక పూజలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో జరుగుతున్న నేపథ్యంలో భక్తుల రద్దీ మేరకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట కారణంగా మృతి చెందిన భక్తుల కుటుంబాలకు మంత్రి సురేఖ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోలిండియా గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి: కిషన్‌రెడ్డి

సాంకేతికత, సృజనాత్మక ఆవిష్కరణలను వినియోగించుకుని కోలిండియా సంస్థ భవిష్యత్తులో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం కోలిండియా లిమిటెడ్ 51వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలో కార్యక్రమం జరిగింది. కిషన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. దేశ విద్యుత్ రంగంలో భద్రత సాధించేందుకు కోలిండియా కార్మికులు, ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని ప్రశంసించారు. మన దేశ విద్యుత్ వ్యవస్థకు బొగ్గు వెన్నెముక లాంటిదని, దేశానికి కోలిండియా ఎనలేని సేవలు అందిస్తోందని చెప్పారు. 2030 నాటికి విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, ఆ మేరకు విద్యుత్ ఉత్పత్తికి బొగ్గును అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో బొగ్గు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. బొగ్గు వెలికితీత పూర్తయిన గనులను సరైన పద్ధతిలో మూసేసి, ఆ ప్రాంతాన్ని పర్యావరణహితంగా రూపుదిద్దే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

రూ.900 కోట్లు ఇవ్వకుంటే రేపటి నుంచి కాలేజీలన్నీ బంద్

» బకాయిల విడుదలకు నేటి వరకే డెడ్‌లైన్.. లేకుంటే సమ్మె

» యూనివర్సిటీలు పరీక్షలన్నీ వాయిదా వేయాలి

» 6న లక్షన్నర మందితో హైదరాబాద్‌లో సమావేశం

» ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘాల సమాఖ్య

న్యాయపరంగా రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతీ) తీవ్రంగా విమర్శించింది. రూ.7,500 కోట్ల బకాయిలు ఇవ్వకుండా గత కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీలు నడవకుండా చేస్తున్నట్టు ఫాతీ అధ్యక్షుడు, అరోరా విద్యాసంస్థల చైర్మన్ నిమ్మగడ్డ రమేష్ బాబు ఆరోపించారు. గతంలో మంత్రులు ఇచ్చిన హామీ మేరకు ఆదివారంలోగా రూ.900 కోట్లు విడుదల చేయకుంటే సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. సమ్మె ప్రారంభమైతే వివిధ యూనివర్సిటీల పరీక్షలు జరగవని, పరీక్షలు వాయిదా వేసుకోవాలని వర్సిటీలను కోరుతున్నామన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఫాతీ అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెలో భాగంగా ఈ నెల 6న లక్షన్నర మంది కాలేజీల సిబ్బందితో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేస్తామని, 10న 10 లక్షల మంది విద్యార్థులతో ఆందోళన నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల నివాసాల ముట్టడి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బకాయిలు ఇప్పించే బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలని కోరారు. ఫాతీ వైస్ చైర్మన్ ఆల్హాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రైవేటు కాలేజీలపై విజిలెన్స్ విచారణ అంటే బ్లాక్ మెయిల్ చేయడమేనంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలను భయపెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పి. కిషన్



సుభాష్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ పి. కిషన్ ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని వి. కన్వెన్షన్‌లో కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

సాగర్ 10 గేట్ల ద్వారా నీటి విడుదల

» భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి ప్రవాహం

నాగార్జున సాగర్/భద్రాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు 10క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589.80 అడుగులు ఉంది. ఎగువ నుంచి 1,17,860 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, ఎగువన కురిసిన వర్షాలతో రెండు రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 28 అడుగులు దాటి ప్రవహిస్తోంది. స్నాన ఘట్టాలపైకి సైతం నీరు చేరింది. మూడు రోజుల క్రితం 15 అడుగులున్న నీటిమట్టం మేడిగడ్డ నుంచి 4 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదలడంతో క్రమంగా పెరుగుతూ వచ్చింది. శుక్రవారం 19 అడుగులకు, శనివారం సాయంత్రం 28 అడుగులకు చేరింది. ఆదివారానికి తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్‌లో బీజేపీ వాళ్లకు అవకాశమిచ్చారు. ఈ ఒక్కసారి నన్ను నమ్మండి.. ఒక్క అవకాశమివ్వండి. నవీన్‌యాదవ్‌కు ఓటు వేయండి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత, మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది. నగరంలో ఏ పని చేయాలన్నా నా వెంట ఉండి.. నాతోపాటు పరుగెత్తేటోడు రావాలి" అని ఓటర్లనుద్దేశించి రేవంత్ అన్నారు.

అన్ని సమస్యలకు వారే కారణం..

జూబ్లీహిల్స్‌లో గతంలో ఎప్పుడూ సమస్యలు లేవన్నట్లుగా, ఇప్పుడే సమస్యలు వచ్చినట్లుగా బీఆర్ఎస్ నేతలు ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు లేకపోవడానికి, తాగునీరు రాకపోవడానికి, ఇళ్లపై ఎక్స్‌టెన్షన్ వైర్లు ఉండడానికి పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కారణం కాదా? అని ప్రశ్నించారు. వాళ్లు చెప్పే అబద్ధాలు, లేవనెత్తుతున్న సమస్యలకు వారే కారణమన్నారు. పదేళ్లు అధికారంలో వాళ్లుంటే.. తాము వచ్చి రెండేళ్లు కూడా కాలేదని గుర్తు చేశారు. ఈ కొద్ది సమయంలోనే ఈ ప్రాంతంలో 14,159 రేషన్‌కార్డులు ఇచ్చామని తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎక్కడో పోయేవని, ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుంటే పేదోళ్లు తింటున్నారని అన్నారు. పేదల బస్తీల్లో ఇళ్లకు ఉచిత కరెంటు ఇస్తున్నామని, 67 లక్షల మహిళా సంఘాలకు పెత్తనం ఇచ్చామని, వెయ్యి ఆర్టీసీ బస్సులు, జిల్లాల్లో పెట్రోల్ బంకులు నడిపే బాధ్యతలు ఇచ్చామని వివరించారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అమ్మడానికి హైటెక్ సిటీలో ఇందిరా బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉచిత బస్సుతో ఆడబిడ్డలకు రెండు, మూడు వేలు మిగులుతున్నాయని తెలిపారు. మెట్రోరైలు, ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్టు, హైటెక్ సిటీని కాంగ్రెస్ తీసుకొచ్చిందని, హైదరాబాద్‌లో వైఎస్సార్, చంద్రబాబు చేసిన అభివృద్ధి తప్ప.. కేసీఆర్ ఏమి చేశారో చెప్పాలని అన్నారు. మైనారిటీల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు. "వారికి అన్యాయం చేసినది నువ్వు కాదా? మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ కల్పిస్తే.. మోదీతో జత కట్టి ట్రిపుల్ తలాక్‌కు, 370 ఆర్టికల్‌కు, పౌరసత్వ సవరణ చట్టానికి రాజ్యసభ, లోక్‌సభలో మీ పార్టీ ఓట్లేసి మద్దతిచ్చింది నిజం కాదా?" అని రేవంత్ నిలదీశారు.



బోరబండ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

ఆడబిడ్డను మంచిగా చూసుకోలేనోడు..

చెల్లెలు సునీతమ్మను గెలిపించి కన్నీళ్లు తుడవాలంటూ కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఆయన తీరు సొంత చెల్లెలికి అన్నం పెట్టలేడుగానీ.. చిన్నమ్మ బిడ్డకు బంగారు గాజులు చేపిస్తా అన్నట్లుగా ఉందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తోడబుట్టిన చెల్లెలికి ఆస్తి ఇవ్వాల్సి వస్తుందని ఇంట్లో నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. "నాన్న సంపాదించిన వేల కోట్ల అక్రమ ఆస్తుల్లో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఇంట్లో నుంచి వెళ్లగొట్టావు. అలాంటి నువ్వు.. మాగంటి సునీతమ్మను మంచిగా చూసుకుంటావా.? సునీతమ్మను ముందర నిలబెట్టి ఓట్లు వేయించుకొని గెలవాలని ప్రయత్నం చేస్తున్నారు. సిగ్గుంటే మీ చెల్లెలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు" అని రేవంత్ అన్నారు. ఇక్కడ మట్టి ఉంది, బురద ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని, మరి రెండుసార్లు కేంద్ర మంత్రి అయ్యి మట్టిలేని సీసీ రోడ్డు వేసేందుకు నిధులేమైనా తెచ్చారా? అని రేవంత్ ప్రశ్నించారు. పోలింగ్‌కు ఇంకా పది రోజుల సమయం ఉందని, ప్రధాని మోదీ దగ్గరికెళ్లి ఏమి తెస్తారో తీసుకురావాలని సవాల్ విసిరారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డి బట్టలు చించుకుంటున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఆయనకేం బాధ? ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? అని ప్రశ్నించారు. మంత్రి పదవేమన్నా కిషన్‌రెడ్డి బాబు జాగీరా? అని ధ్వజమెత్తారు.

బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు..

బోరబండ చౌరస్తాకు దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డి పేరు పెట్టాల్సిందిగా ఇక్కడి వారు సూచించారని సీఎం రేవంత్ తెలిపారు. విజయోత్సవ ర్యాలీకి వచ్చి ఈ చౌరస్తాకు పీజేఆర్ బోరబండ చౌరస్తా అని పేరు పెట్టడంతోపాటు పీజేఆర్ విగ్రహాన్ని కూడా పెట్టిస్తానని ప్రకటించారు. ఈ ప్రాంత సమస్యలు పరిష్కరించడానికి మళ్లీ వస్తానని చెప్పారు. అవసరమైన నిధులు ఇస్తానని, పట్టాలున్నవారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా అవకాశమిస్తానని హామీ ఇచ్చారు. అవతలి పార్టీవారు మాత్రం ఏం చేసినా, ఎన్ని ఓట్లేసినా రారని, దొంగల్లా దొరక్కుండా పోతారని ఆరోపించారు. ఇప్పుడు ఓట్లున్నాయని వచ్చారే తప్ప.. 20 నెలల్లో వారి ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చారా? ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, పక్కన మంత్రి పొన్నం

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే..

» ఆ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం

» అందుకే బీజేపీ ప్రాధాన్యం లేని అభ్యర్థిని నిలబెట్టింది

» కేటీఆర్‌పై ఈసీ కేసు నమోదు చేయాలి: మహేశ్ గౌడ్

హైదరాబాద్/యూసుఫ్‌గూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్‌లో బీజేపీ ప్రాధాన్యం లేని అభ్యర్థిని పోటీకి నిలబెట్టిందని ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కాంగ్రెస్ తాత్కాలిక కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ-బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని దుయ్యబట్టారు. ఓ సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, కేటీఆర్ ఉద్యోగాల ఆశ చూపి కాలం గడిపారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలవడానికి బీఆర్ఎస్ సహకరించిందని, బీఆర్ఎస్ రుణం తీర్చుకోవడానికి ఇప్పుడు బీజేపీ ప్రాధాన్యం లేని అభ్యర్థిని జూబ్లీహిల్స్‌లో నిలబెట్టిందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో కేసీఆర్ పాత్ర ఉందన్నారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవి నుంచి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు కేసీఆర్ బీజేపీకి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ వాళ్లు ఇచ్చే రూ.5 వేలు తీసుకోండి.. బీఆర్ఎస్‌కి ఓటేయండి?' అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్య అని, ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో అధిక శాతం అమలు చేసే ఇప్పుడు ఓట్లు అడుగుతున్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని.. అమాయకులైన నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర బీఆర్ఎస్‌దని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, బీసీ రిజర్వేషన్లు కోరుకునే నాయకులు, పార్టీల ప్రతినిధులు, బీసీలంతా ఉమ్మడిగా ఢిల్లీ వెళ్లి ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు సూచించారు. గాంధీభవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్ని రోజులు శ్రమించినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పుడు కాకపోతే ఇక ఎప్పటికీ బీసీ రిజర్వేషన్లు సాధ్యం కాదని చెప్పారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్..

» గందరగోళం సృష్టించేందుకే సీఎం వ్యాఖ్యల వక్రీకరణ: దుద్దిళ్ల



హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మెజారిటీని పెంచుకునేందుకు కాంగ్రెస్ పనిచేస్తుంటే.. బీజేపీ, బీఆర్ఎస్ మాత్రం తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పోటీ పడుతున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు. స్వార్థ రాజకీయాల కోసం బీఆర్ఎస్, బీజేపీ అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లారెడ్డిగూడలోని శాలివాహననగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో మీడియాతో ఆయన మాట్లాడారు.. ప్రజలకు మంచి చేసే ఏ ఒక్క ప్రధాన సంక్షేమ పథకాన్ని కాంగ్రెస్ సర్కారు ఆపబోదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి యుద్ధం చేసి గెలిచిన చక్రవర్తిలా ఫీల్ అవుతున్నారని కేటీఆర్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 'నేను రాజు కాదు అని ప్రజల సొమ్ముకు ధర్మకర్తను మాత్రమే' అని ఎన్నోసార్లు రేవంత్ స్పష్టం చేశారని గుర్తుచేశారు. ప్రతిపక్షాల జూటా మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రజల ఆశలు, ఆకాంక్షలే అజెండాగా ముందుకెళ్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన మాదిగ దండోరా, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా, టీఎమార్పీఎస్, ఓయూ టీజీఆర్ఎస్ఏ తదితర దళిత సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.



రహమత్‌నగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్.. రెండూ దగా పార్టీలే

» ప్రజలను మభ్యపెడుతున్న ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలి

» మజ్లిస్ మెప్పు కోసమే.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ దగా పార్టీలేనని.. గద్దె ఎక్కకముందు ఒక మాట, గద్దెనెక్కాక మరో మాటగా ఆ పార్టీల వ్యవహారశైలి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఒకరు పదేళ్లు మోసం చేస్తే.. మరొకరు రెండేళ్లుగా మభ్యపెడుతూనే ఉన్నారని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ ఉప ఎన్నిక కేవలం ఒక అసెంబ్లీ స్థానానికో, హైదరాబాద్ నగరానికో పరిమితం కాదని.. యావత్ తెలంగాణను ప్రభావితం చేస్తుందని చెప్పారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. శనివారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. రహ్మత్‌నగర్, వినాయకనగర్, నవీన్‌నగర్, ఎస్పీఆర్ హిల్స్, ఇతర బస్తీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లు అడిగే ముందు ఇక్కడ 2 గంటలు పాదయాత్ర చేయాలని, ప్రజలు ఏం చెబుతారో చూడాలని సవాల్ చేశారు. జూబ్లీహిల్స్‌లో డ్రైనేజీ, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని విమర్శించారు. మజ్లిస్ అసదుద్దీన్ కనుసన్నల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పనిచేస్తున్నాయని.. వారి మెప్పు కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని ఆరోపించారు.

నేడు మరోసారి బీజేపీ మహా పాదయాత్ర

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'కార్పెట్ బాంబింగ్' పేరిట బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఆదివారం మరోసారి మహా పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్రపార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ జిల్లాల నుంచి తరలివచ్చే నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొంటారు. గత మంగళవారం మొదటిసారిగా ఈ మహాపాదయాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ వ్యాప్తంగా 50 కేంద్రాల్లో సాయంత్రం 4 గంటలకు ముఖ్యనేతలు పాదయాత్రలు ప్రారంభిస్తారు. రాత్రి 9 వరకు కొనసాగిస్తారు.

కాంగ్రెస్‌తో ఫేక్ బంధం.. బీజేపీతో పేగు బంధం

(మొదటిపేజీ తరువాయి)

తిట్టిన వ్యక్తి, సెటిల్‌మెంట్లు, బ్లాక్ మెయిలింగ్‌లు చేసిన వ్యక్తి సెంటిమెంట్ గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి గల్లంతవడం ఖాయమని, ఓటమి భయంతోనే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని రేవంత్ బెదిరిస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్ రాకపోతే 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌కు మద్దతుగా శనివారం రాత్రి రహమత్‌నగర్‌లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. "ఒక్క సీటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. 14 మంది మంత్రులు గల్లీ గల్లీలో తిరుగుతున్నారు. ఎన్నికల్లో ఓట్లు వేయకపోతే పథకాలు రద్దు చేస్తామని రేవంత్ ధమ్కీ ఇస్తున్నారు. అసలు రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిందేమిటి? ఏం చేశారని రద్దు చేస్తారు. పింఛన్ల పెంపు, యువతులకు స్కూటీలు, తులం బంగారం, ఇందిరమ్మ ఇళ్లు అని మాట ఇచ్చి తప్పారు. ఇచ్చింది ఒక్కటే మహిళలకు ఫ్రీ బస్సు అది కూడా మగవాళ్లకు చార్జీలు డబుల్ వసూలు చేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు. మాగంటి గోపీనాథ్ ఎస్పీఆర్ హిల్స్‌లో కోట్ల విలువైన భూమిని కాపాడారని, ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిపిస్తే ఆ స్థలంలో స్టేడియం కట్టి గోపీనాథ్ పేరు పెడమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో 4 లక్షల మంది బీఆర్ఎస్‌కు ఓటేస్తే, రాష్ట్రంలోని 4 కోట్ల మందికి మేలు జరుగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బకొడితేనే వాళ్లు ఇచ్చిన హామీలు అమలవుతాయన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే పక్కనే ఉన్న తెలంగాణ భవన్‌లోంచి తాము వెంటనే వచ్చి అండగా నిలబడతామని చెప్పారు.



రహమత్‌నగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నేతలు

తెలంగాణ టీడీపీకి చెందిన పలువురు నేతలు శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను మళ్లీ తెచ్చుకోవాలంటే జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలని, ధైర్యం ఉంటే ఒపీనియన్ పోల్‌కు సిద్ధం కావాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ రూ.4 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో రూ.44 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు.

ఓట్ల కోసం దేశాన్నే అవమానిస్తారా?

సైనికుల వీరోచిత పోరాటాన్ని మరచిపోయారా?.. ప్రజలే అణుబాంబులుగా మారడం ఖాయం

» రేవంత్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ధ్వజం

» కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి దేశాన్నే అవమానపరిచేలా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా విమర్శించారు. 'ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల వీరోచిత పోరాటాన్ని మరచిపోయారా? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్ల కోసం దేశాన్నే అవమానిస్తారా? సైనికులను అవమానించడం ఎక్కడి సంస్కారం?' అని నిలదీశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ డైరెక్షన్‌లో సీఎం రేవంత్, రేవంతుద్దీన్‌గా మారిపోయారని మండిపడ్డారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఇంటింటి ప్రచారం కోసం చేపట్టిన కార్పెట్ బాంబింగ్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు రాంచందర్‌రావు తెలిపారు. ప్రజల మద్దతుతో ఏ బాంబింగ్ అయినా చేస్తామని హెచ్చరించారు. ప్రజలే కాంగ్రెస్ పాలిట అణుబాంబులుగా మారడం ఖాయమన్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు అందబోవంటూ సీఎం రేవంత్, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కారణంగా తమ ప్రాంతం మరో పాతబస్తీ అవుతుందేమోనని జూబ్లీహిల్స్ సెగ్మెంటులో స్థానికులు ఆందోళన చెందుతున్నారని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 111 జీవోతో లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించిన రేవంత్, ఇప్పుడు ఆ భూములను ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని ఎంపీ రఘునందన్‌రావు నిలదీశారు. కాంగ్రెస్‌కు ఎంఐఎం తోకపార్టీ అని బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్ విమర్శించారు.



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేస్తున్న రాంచందర్‌రావు, చిత్రంలో ఏలేటి, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వరరావు తదితరులు

అభయ హస్తం కాదు... భస్మాసుర హస్తం

'కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో 420 హామీలు, 13 ముఖ్య వాగ్దానాలు ప్రకటించింది. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పింది. కానీ దాదాపు 1000 రోజులు గడుస్తున్నా, ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయింది. పేదలపై కాంగ్రెస్ పెట్టిన ఈ హస్తం అభయ హస్తం కాదు... భస్మాసుర హస్తం' అని బీజేపీ తన చార్జిషీట్‌లో తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెస్ మేనిఫెస్టో.. బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు అని ఆరోపించింది.

సీఎం రేవంత్‌పై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

సీఎం రేవంత్‌రెడ్డి సైనికుల పోరాటాన్ని అవమానపరిచారని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ ఎన్నికల సంఘానికి బీజేపీఫిర్యాదు చేసింది. సీఎం ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఆరోపించింది. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఉప నేత పాయల్ శంకర్‌తో పాటు పార్టీ నాయకుల బృందం శనివారం ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసింది.

వాన్స్‌.. ఉష బంధం బీటలు?

అమెరికాలో పెద్ద ఎత్తున ఊహాగానాలు.. ఉష క్రైస్తవంలోకి రావాలంటూ ఇటీవల జేడీ వాన్స్‌ వ్యాఖ్యలు

- అదే వేదికపై ఎరికాతో గాఢాలింగనం
- ఉషకు విడాకులిస్తారని విశ్లేషణలు

న్యూయార్క్‌, నవంబరు 1: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌, ఆయన సతీమణి, ఆంధ్రప్రదేశ్‌ మూలాలున్న చిలుకూరి ఉష మధ్య బంధం బీటలు వారుతోందా? దానికి సంకేతంగానే ఇటీవల వాన్స్‌.. తమ వేర్వేరు మత నేపథ్యాల గురించి బహిరంగంగా వ్యాఖ్యానించారా? ట్రంప్‌కు అత్యంత బలమైన మద్దతుదారుగా వ్యవహరించి ఈ మధ్య హత్యకు గురైన చార్లీకిర్క్‌ భార్య ఎరికా కిర్క్‌ ఇదే అదనుగా వాన్స్‌తో చెట్టాపట్టాలకు సిద్ధపడుతున్నారా? అమెరికాలో సోషల్‌ మీడియాలో ఇప్పుడే ఇదే అంశం జోరుగా షికారు చేస్తోంది. అక్టోబరు 29వ తేదీన మిసిసిపీ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వాన్స్‌ వ్యాఖ్యలు, అదే వేదిక మీద వాన్స్‌, ఎరికా కిర్క్‌ గాఢ ఆలింగనం దృశ్యాలు, అనంతరం ఎరికా మాటలు.. ఈ ఊహాగానాలకు బలం చేకూర్చాయి. ఆ కార్యక్రమంలో ఓ యాంకర్‌ అడిగిన ప్రశ్నకు జేడీ వాన్స్‌ సమాధానమిస్తూ.. దాదాపుగా ప్రతి ఆదివారం చర్చికి తనతోపాటు ఉష కూడా వస్తుందని, అయితే, తాను క్రైస్తవం పట్ల పూర్తి అంకితభావంతో ఉన్నట్లుగా.. ఆమె కూడా ఏదో రోజు క్రైస్తవంలోకి మారుతుందని ఆశిస్తున్నానన్నారు. అదే వేదిక మీద ఉన్న ఎరికా కిర్క్‌.. హత్యకు గురైన తన భర్తను గుర్తు చేసుకుంటూ.. ఆయన స్థానం ఎవరూ భర్తీ చేయలేరని అంటూనే.. ఆయనలో ఉన్న కొన్ని లక్షణాలు వాన్స్‌లో కనిపిస్తున్నాయని చెప్పారు. ఇదే సందర్భంగా ఎరికా, వాన్స్‌ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. దీంతో ఇక సోషల్‌ మీడియాలో ఊహాగానాలు చెలరేగాయి.



ఎరికాను ఆలింగనం చేసుకుంటున్న వాన్స్‌(ఫైల్‌)



ఎరికా

రాజకీయ కోణం

ఈ అంశం వెనుక ఓ రాజకీయ కోణం కూడా ఉంది. ట్రంప్‌కు, వాన్స్‌కు అమెరికాలో ప్రస్తుతం శ్వేతజాతీయవాదుల మద్దతు బలంగా ఉంది. వాన్స్‌ కూడా వారిని సమర్థిస్తూ మాట్లాడుతుంటారు. అయితే, ఆయన భార్య వేరే దేశానికి చెందిన వ్యక్తి కావటం, ఆమె మతం కూడా వేరు కావటంపై కొంతకాలంగా ఈ శ్వేతజాతీయులు గుర్రుగా ఉన్నారు. ఇతర దేశీయులు, ఇతర మతస్థులు ముఖ్యంగా శ్వేతజాతీయేతరులు అమెరికాలో ఉండటం అంటే.. అమెరికన్ల అవకాశాల్ని కొల్లగొట్టటమేనని వీరి వాదన. అమెరికా, యూరప్‌ దేశాల్లో ప్రణాళికబద్ధంగా ఇది జరుగుతోందని.. శ్వేతజాతీయుల స్థానాన్ని వీరు భర్తీ చేస్తున్నారంటూ 'గ్రేట్‌ రిప్లేస్‌మెంట్‌ థియరీ' అనే ఓ సిద్ధాంతాన్ని కూడా ప్రచారంలో పెట్టారు. ఏకంగా ఉపాధ్యక్షుడి భార్యే శ్వేతజాతీయేతర వ్యక్తి కావటం చూసి వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే, శ్వేతజాతీయతకు మద్దతుగా వాన్స్‌ మాట్లాడటాన్ని కూడా వీరు వ్యతిరేకిస్తున్నారు. 'భారతీయురాలు భార్యగా ఉన్న వాన్స్‌కు శ్వేతజాతికి మద్దతుగా మాట్లాడే హక్కు లేదు' అంటూ నిక్‌ ఫ్యూంటెస్‌ అనే ఓ ప్రముఖ జాత్యంహకారి గత ఏడాది నుంచి మాటల దాడి చేస్తున్నాడు. అనేక మంది అతనికి వత్తాసు పలుకుతున్నారు. మరోవైపు, అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్ష పదవి చేపట్టటానికి వీల్లేదు. దీంతో ట్రంప్‌ 2028లో దిగిపోయాక.. రిపబ్లికన్‌ పార్టీ అభ్యర్థిగా తాను పోటీ పడాలని జేడీ వాన్స్‌ భావిస్తున్నారు. అయితే, భార్య ఉష జాతీయత కారణంగా తనకు శ్వేతజాతీయుల మద్దతు లభించదేమోనన్న సందేహాలు వాన్స్‌కు ఉన్నాయని.. అందుకే ఆమె నుంచి విడిపోయే అవకాశాలు ఉన్నాయని కొందరి విశ్లేషణ. దీనికి తాజాగా ఎరికా కిర్క్‌ మాటలు, వాన్స్‌తో ఆమె ఆలింగనం మరింత ఆజ్యం పోశాయి. జేడీ వాన్స్‌, ఉష ఇక విడిపోవటమే తరువాయని, కొన్ని నెలల్లోనే ఇది జరుగుతుందని అంటున్నారు. ఉషకు త్వరలోనే విడాకులిచ్చి ఎరికాను వాన్స్‌ వచ్చే ఏడాది చివరికి పెళ్లాడుతారంటూ న్యూయార్క్‌ టైమ్స్‌కు చెందిన షానన్‌ వాట్స్‌ పేర్కొన్నారు. పదవిలో ఉండగానే విడాకులు తీసుకునే తొలి ఉపాధ్యక్షుడిగా వాన్స్‌ నిలుస్తారంటూ ట్రాన్స్‌జెండర్‌ కార్యకర్త అరి డ్రెనెన్‌ ట్వీట్‌ చేశారు.

మతస్వేచ్ఛ ఉండాలి: హిందూ అమెరికన్‌ ఫౌండేషన్‌

ఈ అంశంపై 'హిందూ అమెరికన్‌ ఫౌండేషన్‌' స్పందిస్తూ.. క్రైస్తవంతోపాటు హిందూమతం గురించి కూడా తెలుసుకోవాలని వాన్స్‌కు సూచించింది. హిందువులకు తమ మతాన్ని ఆచరించే హక్కు ఉంటుందన్న అంశాన్ని గుర్తించి మద్దతివ్వాలని కోరింది. వాన్స్‌ మద్దతుదారులు మతస్వేచ్ఛకు తీవ్ర వ్యతిరేకంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. 'మీ మద్దతుదారుల్లో కొందరు మతస్వేచ్ఛను విశ్వసించటం లేదు. కానీ, అమెరికాకు పునాదిగా ఉన్న భావనల్లో మతస్వేచ్ఛ కూడా ఒకటి. అది హిందువులకూ వర్తిస్తుంది' అని పేర్కొంది.

దేశానికి త్వరలో మావోయిస్టు హింస నుంచి విముక్తి



- ఛత్తీస్‌గఢ్‌ రజత్‌ మహోత్సవ్‌లో ప్రధాని మోదీ

రాయ్‌పూర్‌, నవంబరు 1: దేశం, ఛత్తీస్‌గఢ్‌ మావోయిస్టుల హింస నుంచి విముక్తి పొందే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య గత 11 ఏళ్లలో 125 నుంచి మూడుకు పరిమితం అయ్యిందని ఆయన పేర్కొన్నారు. నవ రాయ్‌పూర్‌లో ఛత్తీ స్‌గఢ్‌ రాష్ట్రం ఏర్పడి 25 ఏళ్లు అయిన సందర్భంగా శనివారం నిర్వహించిన 'ఛత్తీస్‌గఢ్‌ రజత్‌ మహోత్సవ్‌'లో ఆయన మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా మావోయిస్టుల హింసతో నలిగిపోయిన ఈ రాష్ట్రం నేడు దాన్నుంచి విముక్తి చెందడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమన్నారు. మావోయిస్టు సిద్ధాంతం గిరిజన ప్రాంతాల్లో కనీస అవసరాలు కూడా తీరకుండా చేసిందన్నారు. ఏళ్లుగా గిరిజన గ్రామాలకు రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. "ఆఖరికి ఉన్నవాటిని కూడా బాంబులతో పేల్చివేశారు.. వైద్యులను, ఉపాధ్యాయులను చంపారు.. మరోవైపు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన వారు తాము ఏసీ గదుల్లో ఉంటూ.. మిమ్మల్ని పట్టించుకోలేదు." అని ప్రధాని విమర్శించారు. కొద్ది నెలలుగా రూ.లక్షలు, కోట్ల రివార్డులు ఉన్నవారు సహా పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. వారు నేడు భారత రాజ్యాంగాన్ని ఆమోదించి శాంతి బాట పట్టారని ఆయన తెలిపారు.

వైద్య విద్యకు చలో జార్జియా!

- క్యూ కడుతున్న భారతీయ విద్యార్థులు
- రష్యా- ఉక్రెయిన్‌ యుద్ధం ప్రభావం

న్యూఢిల్లీ, నవంబరు 1: రష్యా- ఉక్రెయిన్‌ యుద్ధం ప్రభావంతో విదేశాల్లో వైద్య విద్యను చదవాలనుకొనే భారతీయ విద్యార్థులు ఇప్పుడు జార్జియాకు క్యూ కడుతున్నారు. ఆర్బీఐకి చెందిన లిబరలైజ్డ్‌ రెమిటెన్స్‌ స్కీమ్‌(ఎల్‌ఆర్‌ఎస్‌) డేటా ప్రకారం.. జార్జియాలో ట్యూషన్‌ ఫీజులు, తదితరాలకు 2024-25లో భారతీయులు 50.25 మిలియన్‌ డాలర్లు వెచ్చించారు. 2018-19లో చేసిన 10.33 మిలియన్‌ డాలర్ల వ్యయంతో పోలిస్తే ఇది దాదాపు ఐదురెట్లు ఎక్కువ. ఇక ఉక్రెయిన్‌లో భారతీయుల చెల్లింపులు 2018-19లో 14.80 మిలియన్‌ డాలర్ల నుంచి 2025 నాటికి 2.40 మిలియన్‌ డాలర్లకు పడిపోయాయి. యుద్ధానికి ముందు 2020-21, 2021-22 సంవత్సరాల్లో భారతీయ విద్యార్థుల టాప్‌-10 గమ్యస్థానాల్లో ఉక్రెయిన్‌ కూడా ఒకటి. అప్పట్లో వారు ఈ దేశంలో 39.12 మిలియన్‌ డాలర్ల వరకూ ఫీజుల రూపంలో చెల్లించారు. 2022 ఫిబ్రవరిలో రష్యా దాడి అనంతరం 2022-23లో ఇది 10.6 మిలియన్‌ డాలర్లకు తగ్గింది. అదే ఏడాది విదేశాల్లో విద్య కోసం భారతీయులు డబ్బులు పంపిన టాప్‌-15 దేశాల జాబితాలో జార్జియా చోటు దక్కించుకుంది. మరోవైపు ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్న దేశాల జాబితాలో రష్యా ర్యాంకు కూడా మెరుగుపడుతోంది. 2018-19లో 23వ స్థానంలో ఉన్న రష్యా 2024-25నాటికి 11వ స్థానానికి చేరుకుంది.

జార్జియా ఎందుకంటే..

యూరప్‌కు దగ్గరగా ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే ట్యూషన్‌ ఫీజులు, జీవన వ్యయాలు తక్కువగా ఉండటం, సరళమైన నివాస చట్టాలు, సులభ వీసా ప్రక్రియ, ఉపాధి అవకాశాలు, యూరోపియన్‌ ప్రమాణాలతో కూడిన వైద్య విద్య తదితర కారణాలతో భారతీయ విద్యార్థులకు జార్జియా ఆకర్షణీయ ఎంపికగా మారుతోంది.

అమెరికాలో పౌరసత్వ రుజువుగా బర్త్‌ సరిఫికెట్‌ ఒక్కటే సరిపోదు!

వాషింగ్టన్‌, నవంబరు 1: అమెరికాలో జన్మతః పౌరసత్వం రద్దుపై అధ్యక్షుడు ట్రంప్‌ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్‌ ఆర్డర్‌ అమల్లోకి వస్తే.. సోషల్‌ సెక్యూరిటీ నంబర్‌ (ఎస్‌ఎస్‌ఎన్‌) దరఖాస్తులకు జనన ధ్రువీకరణ పత్రాలను రుజువుగా పరిగణించరు. దరఖాస్తుదారు తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా అమెరికా పౌరులేనని గానీ, బిడ్డ జన్మించిన సమయంలో వారు చట్టబద్ధమైన ఇమిగ్రేషన్‌ హోదా కలిగి ఉన్నారని గానీ ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. జన్మతః పౌరసత్వాన్ని రద్దుచేసే లక్ష్యంతో జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని బోస్టన్‌, శాన్‌ఫ్రాన్సిస్కోల్లోని అప్పీలు కోర్టులు తీర్పు చెప్పాయి. దేశవ్యాప్తంగా ఈ ఆదేశాల అమలును నిలిపివేశాయి. దీంతో ట్రంప్‌ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఎగిరే కారును తెచ్చేస్తున్నా..

- ఈ ఏడాదిలోనే డెమో చూపిస్తా : ఎలాన్‌ మస్క్‌

న్యూఢిల్లీ, నవంబరు 1: ఎన్నో ఏళ్ల క్రితం రాజేంద్రప్రసాద్‌ హీరోగా నటించిన 'బామ్మ మాట బంగారు బాట'అనే సినిమా గుర్తుందా? ఆ సినిమాలో రకరకాల విన్యాసాలు చేస్తూ గాల్లోకి ఎగిరే సూపర్‌ కారు మన దగ్గర కూడా ఉంటే బాగుంటుందని అనుకుంటుంటారు. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే.. గాల్లో ఎగిరే అలాంటి ఓ సూపర్‌ కారును మార్కెట్‌లోకి తీసుకువస్తున్నానంటూ టెస్లా సీఈవో ఎలాన్‌ మస్క్‌ ప్రకటించారు. ది జో రోగన్‌ ఎక్స్‌పీరియన్స్‌ అనే పాడ్‌కాస్ట్‌లో ఎగిరే కారు విషయాన్ని ఆయన వెల్లడించారు. 2014 నుంచి ఎగిరే కార్ల గురించి మాట్లాడుతున్న మస్క్‌.. తాము అభివృద్ధి చేస్తున్న ఎగిరే కారు ప్రొటోటైప్‌ను ఈ ఏడాదిలోనే ప్రదర్శిస్తామని తాజా పాడ్‌కాస్ట్‌లో ప్రకటించారు. టెస్లా నుంచి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న రోడ్‌స్టర్‌ సెకండ్‌ జనరేషన్‌ స్పోర్ట్స్‌ కారు గురించి పాడ్‌కాస్టర్‌ రోగన్‌ ప్రశ్నించగా.. మస్క్‌ ఎగిరే కారు గురించి మాట్లాడారు. టెస్లా తీసుకొచ్చే ఎగిరే కారుకు రెక్కలు ఉంటాయా?, హెలికాప్టర్‌లా గాల్లోకి ఎగిరే వీటీఓఎల్‌(వర్టికల్‌ టేకాఫ్‌ అండ్‌ ల్యాండింగ్‌) వాహనమా? అని రోగన్‌ ప్రశ్నించగా.. మస్క్‌ స్పష్టమైన సమాధానం చెప్పలేదు. కానీ, తమ ఆవిష్కరణ ఊహలకు అందని విధంగా ఉంటుందని, జేమ్స్‌బాండ్‌ సినిమాల్లో బాండ్‌ ఉపయోగించిన కార్లన్నింటి లోని ఫీచర్లను ఒకచోటుకు చేరేస్తే ఎలా ఉంటుందో అంతకు మించి ఉంటుందని చెప్పారు. అయితే, ఈ ఎగిరే కారుకు మించిన ఎన్నో అద్భుత ఆవిష్కరణలను మస్క్‌ గతంలోనూ ప్రకటించారు. వాటిని ప్రపంచానికి పరిచయం చేయడాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ ఎగిరే కారును మస్క్‌ ఈ ఏడాదిలో చూపిస్తారో లేదో చూడాలి మరి.

కేరళకు మరో ఖ్యాతి

- అత్యంత పేదరికాన్ని రూపుమాపిన రాష్ట్రంగా రికార్డు

తిరువనంతపురం, నవంబరు 1: దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా నిలిచిన కేరళ మరో ఖ్యాతి దక్కించుకుంది. దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన మొట్టమొదటి రాష్ట్రంగా నిలిచింది. శనివారం కేరళ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ ఈ విషయాన్ని ప్రకటించారు. "దుర్భర పేదరికం లేని తొలి రాష్ట్రంగా కేరళను మార్చడంలో విజయం సాధించాం"అని విజయన్‌ పేర్కొన్నారు. పేదల కోసం 5,400కు పైగా ఇళ్లు మంజూరు చేశామని, ఇవి పూర్తి/నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. 5,522 ఇళ్లకు మరమ్మతులు చేయించామని, ఇళ్ల స్థలాలు లేని 2,713 మంది పేదలకు స్థలాలు కేటాయించామని వెల్లడించారు. 21,263 మందికి కొత్తగా రేషన్‌, ఆధార్‌ కార్డులు, పింఛన్‌ మంజూరు చేశామని తెలిపారు. కాగా విజయన్‌ ప్రకటనను కాంగ్రెస్‌ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్‌ తప్పుపట్టింది. దుర్భర పేదరికాన్ని నిర్మూలించామన్న ప్రకటన 'పచ్చి మోసం' అని ప్రతిపక్ష నేత వీడీ సతీశన్‌ విమర్శించారు. ఈ సమావేశాన్ని పూర్తిగా బాయ్‌కాట్‌ చేస్తున్నట్టు ప్రకటించారు.

కేరళలో మతపరంగా ఓబీసీ రిజర్వేషన్లు

- అభ్యంతరం తెలిపిన ఎన్‌సీబీసీ

న్యూఢిల్లీ, నవంబరు 1: కేరళలో ఓబీసీ కోటా కింద ముస్లింలు, క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించడంపై జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌ (ఎన్‌సీబీసీ) అభ్యంతరం తెలిపింది. రాజకీయ ప్రయోజనం పొందడానికే మత ఆధారిత రిజర్వేషన్లు కల్పిస్తున్నారని ఆ కమిషన్‌ ఛైర్మన్‌ హన్స్‌రాజ్‌ గంగారాం అహిర్‌ ఆరోపించారు. ఏ సర్వే ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చారో 15రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానమివ్వాలని ఆదేశించారు.

సాయుధ పోరాటం.. 'విఫల మార్గం'

- పరిస్థితులు మారాయి.. ప్రధాన స్రవంతిలో కలవండి
- మావోయిస్టులకు మల్లోజుల వీడియో సందేశం

గడ్చిరోలి, నవంబరు 1: మావోయిస్టులు ఆయుధాలను వీడి.. ప్రధాన స్రవంతిలో కలిసి పనిచేయాలని ఇటీవల పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్‌ భూపతి ఓ వీడియో సందేశంలో కోరారు. ఎవరైనా ఆయుధాలను వీడాలని భావిస్తుంటే సంప్రదించాలంటూ తనది, లొంగిపోయిన మరో మావోయిస్టు నేత రూపేష్‌ ఫోన్‌ నంబర్లు ఇచ్చారు. సాయుధ పోరాటాన్ని 'విఫల మార్గం'గా పేర్కొన్న ఆయన... మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచిపెట్టాలన్నారు. పరిస్థితులు మారాయని, ప్రజల మధ్య ఉండి చట్ట పరిధిలో పనిచేయాలని కోరారు. తమ చర్యల వల్ల ప్రజల నుంచి దూరమైన విషయాన్ని వారు గుర్తించాలని సూచించారు. సాయుధ పోరాటాన్ని వీడడానికి సుముఖంగా లేని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మొండి వైఖరిని అవలంబిస్తోందని, మార్పులను గ్రహించడం లేదని విమర్శించారు. తాను, తనతో పాటు లొంగిపోయిన నక్సలైట్లను ద్రోహులంటూ విమర్శిస్తున్న వ్యక్తులు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని పేర్కొన్నారు. మేధావులు, ప్రజాస్వామ్య ప్రేమికులు, ముఖ్యంగా గిరిజనుల మేలు కోరేవారు తమ నిర్ణయాన్ని అర్థం చేసుకుని, మద్దతు ఇవ్వాలని కోరారు. గడ్చిరోలి పోలీసులు శనివారం పత్రికా ప్రకటనతో పాటు మల్లోజుల వీడియోను విడుదల చేశారు. ఆయన గత నెల 14న 60 మంది మావోయిస్టులతో, రూపేష్‌ అలియాస్‌ సతీష్‌ గత నెల 17న 200 మంది మావోయిస్టులతో కలిసి పోలీసులకు లొంగిపోయారు.

గంగలో స్నానం చేసి శాకాహారిగా మారా

- పాతికేళ్ల నాటి సంగతి గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి

వారాణసి, నవంబరు 1: గంగానదిలో స్నానమాచరించిన తాను మాంసాహారాన్ని పూర్తిగా వదిలేశానంటూ పాతికేళ్ల నాటి సంగతిని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ గుర్తు చేసుకున్నారు. అప్పట్లో మాంసాహారిగా ఉన్న తాను తొలిసారి కాశీ వచ్చి... గంగానదిలో స్నానం చేసి శాకాహారిగా మారానని తెలిపారు. ఆ తర్వాత తన జీవితంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. వారాణసిలో కొత్తగా నిర్మించిన ఒక సత్రాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి రాధాకృష్ణన్‌ శుక్రవారం ప్రారంభించారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎందుకు నిషేధించాలి: హోసబలే

జబల్‌పూర్‌, నవంబరు 1: రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ను నిషేధించాలన్న కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే తీవ్రంగా స్పందించారు. ప్రజలే ఆర్‌ఎస్‌ఎస్‌ను ఆమోదించారని, అలాంటప్పుడు దీనిని ఎందుకు నిషేధించాలని ప్రశ్నించారు. "దేశ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్‌ నిరంతరం కృషి చేస్తోంది. ప్రజలే దీనిని ఆమోదించారు. జాతి కోసం పాటుపడుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించి ఏం సాధిస్తారు?" అని ఖర్గేను ఉద్దేశించి అన్నారు.

ఆ నేరం ప్రేమది.. కామానిది కాదు!

- పోక్సో కేసు దోషి పదేళ్ల శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 1: పోక్సో కేసు దోషికి విధించిన శిక్షను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు అరుదైన తీర్పునిచ్చింది. ఆ వ్యక్తి బాధితురాలినే వివాహం చేసుకోవడం.. ఓ బిడ్డ జన్మించడం.. వారు ప్రశాంత కుటుంబ జీవితాన్ని గడుపుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంది. ఈ నేరం ప్రేమతో జరిగిందని.. కామంతో కాదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 142 కింద సంక్రమించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి నిందితుడి శిక్షను రద్దు చేస్తూ నిర్దోషిగా విడుదల చేసింది. బాలికను కిడ్నాప్‌ చేసి.. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి చెన్నై ట్రయల్‌ కోర్టు 2018లో పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పును మద్రాస్‌ హైకోర్టులో నిందితుడు సవాల్‌ చేశాడు. బాధితురాలిని తాను వివాహం చేసుకున్నానని.. బిడ్డతో సంతోషంగా ఉన్నామని పేర్కొన్నాడు. అయితే హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేయడంతో నిందితుడు 2021లో సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. బాధితురాలు కూడా కోర్టు ముందు అఫిడవిట్‌ దాఖలు చేస్తూ.. తాను సదరు వ్యక్తితోనే జీవితాంతం కలిసి ఉండాలనుకుంటున్నట్లు స్పష్టం చేసింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్‌ దీపాంకర్‌ దత్తా, జస్టిస్‌ అగస్టిన్‌ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. నిందితుడికి విధించిన శిక్షను రద్దు చేసింది. భార్యాబిడ్డలను విడిచిపెట్టకుండా జీవితాంతం గౌరవంగా చూసుకోవాలని అతడికి షరతు విధించింది.



అంకతి రాజు



రాఘవేంద్రరావు

డీఆర్‌డీఎల్‌ డైరెక్టర్‌గా అంకతి రాజు బాధ్యతల స్వీకరణ

అల్వాల్‌, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్‌) హైదరాబాద్‌ నూతన డైరెక్టర్‌గా విశిష్ట శాస్త్రవేత్త అంకతి రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ, ఐఐటీ ముంబై నుంచి ఏరోనాటికల్‌ ఇంజనీరింగ్‌ పట్టాలను పొందారు. రక్షణ పరిశోధనలో చేసిన కృషికి అంకతి రాజుకు డీఆర్‌డీవో అగ్ని అవార్డ్‌ ఫర్‌ ఎక్స్‌లెన్స్‌ ఇన్‌సెల్ఫ్‌ రిలియన్స్‌, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. మరోవైపు.. హైదరాబాద్‌ అడ్వాన్స్‌డ్‌ సిస్టమ్స్‌ ల్యాబొరేటరీ (ఏఎస్‌ఎల్‌) డైరెక్టర్‌గా డాక్టర్‌ ఎం.రాఘవేంద్రరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాఘవేంద్రరావు ఎన్‌ఐటీ భోపాల్‌ నుంచి మెకానికల్‌ ఇంజనీరింగ్‌, ఎంఐటీ చెన్నై నుంచి ఏరోనాటికల్‌ ఇంజనీరింగ్‌లో ఎంటెక్‌, ఎన్‌ఐటీ వరంగల్‌ నుంచి డాక్టరేట్‌ పీహెచ్‌డీ పొందారు.

ఇస్రో 'భారీ' ప్రయోగం

- 4,410 కిలోల అత్యంత బరువైన సీఎమ్‌ఎస్‌-3 ఉపగ్రహం నేడు కక్ష్యలోకి..



సూళ్లూరుపేట/తిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) భారీ ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. 4,410కిలోల అత్యంత బరువైన సీఎమ్‌ఎస్‌-3 (సమాచార) ఉపగ్రహాన్ని ఆదివారం కక్ష్యలోకి చేర్చనుంది. భారత భూభాగం నుంచి గతంలో ఎన్నడూ ఇంత బరువైన ఉపగ్రహాన్ని పంపిన చరిత్ర లేదు. దీంతో 'బాహుబలి'గా పిలిచే అత్యంత శక్తివంతమైన రాకెట్‌ ఎల్‌వీఎమ్‌ 3-ఎమ్‌ 5ను ఇస్రో సిద్ధం చేసింది. ఉపగ్రహాన్ని 'బాహుబలి' ద్వారా కక్ష్యలోకి చేర్చే మిషన్‌ ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలవుతుంది. రాకెట్‌ భూమి నుంచి నింగిలోకి ఎగిరిన 16.09 నిమిషాలకు జియో ట్రాన్స్‌ఫర్‌ ఆర్బిట్‌లోకి (జీటీవో) ఉపగ్రహాన్ని ప్రవేశపెడుతుంది. మూడు దశల్లో ఇది సాగుతుంది. సైనిక సమాచార అవసరాల కోసం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీనిని రూపొందించారు. ఈ ప్రక్రియ కు సంబంధించిన కౌంట్‌డౌన్‌ తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్‌ అంతరిక్ష కేంద్రం (షార్‌) రెండో ప్రయోగ వేదిక వద్ద శనివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలైంది. 24 గంటలపాటు ఇది కొనసాగుతుంది. రాకెట్‌కు ఇంధనాన్ని నింపే ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేసిన శాస్త్రవేత్తలు, అన్ని భాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్‌ వి.నారాయణన్‌, షార్‌ డైరెక్టర్‌ ఈఎస్‌ పద్మకుమార్‌ కౌంట్‌డౌన్‌ ప్రక్రియను పరిశీలించారు. లాంచింగ్‌ ఆథరైజేషన్‌ బోర్డు (ల్యాబ్‌) శనివారం మరోసారి సమావేశమై, ఈ ప్రయోగానికి తన ఆమోదం తెలిపింది.

తిరుమల, చెంగాళమ్మ ఆలయాల్లో పూజలు

ఎల్‌వీఎమ్‌ 3-ఎమ్‌ 5 ప్రయోగం భారత సమాచార రంగంలో కీలక ఘట్టంగా నిలవనున్నదని ఇస్రో ఛైర్మన్‌ వి.నారాయణన్‌ తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన, ఉపగ్రహ నమూనాను శ్రీవారి పాదాల వద్ద ఉంచి పూజలు జరిపించారు. అనంతరం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అమ్మవారి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

బాహుబలి.. విశేషాలు..

'బాహుబలి' ఎత్తు 43.5 మీటర్లు. ఇది 4,000 కిలోల వరకు ఉన్న ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్‌ ఆర్బిట్‌ వరకు (జీటీవో), 8,000 కిలోల వరకు ఉన్న ఉపగ్రహాన్ని లో ఎర్త్‌ ఆర్బిట్‌ వరకు (ఎల్‌ఈవో) మోసుకుపోగలదు. 'బాహుబలి' ద్వారా అమలుచేసిన అతిపెద్ద మిషన్లలో ఇది ఐదవది కానుంది. ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్‌-3 మిషన్‌ ఇందులో ఒకటి. నిజానికి, బాగా బరువైన ఉపగ్రహాన్ని ఇస్రో గతంలోనూ కక్ష్యలోకి చేర్చింది. అయితే, వాటిని భారత భూభాగం నుంచి కాకుండా.. విదేశాల నుంచి చేపట్టింది. ఇస్రో 2018లో ఫ్రెంచి గయానానుంచి 5,854 కిలోల బరువు ఉన్న జీశాట్‌-11 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చింది. కాగా, సీఎమ్‌ఎస్‌-3 అనేది బహుళ సమాచార ఉపగ్రహం. భారత డిజిటల్‌, బ్రాడ్‌కాస్ట్‌ వ్యవస్థల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన ఈ శాటిలైట్‌ను భూమిమీదా, సముద్రంలోనూ సేవలు అందించేలా సిద్ధంచేశారు. సమాచార సేవలను విస్తరిస్తూ, విపత్తు నిర్వహణ వ్యవస్థలకు మద్దతుగా భారత భూభాగంతోపాటు సమీప సముద్ర ప్రాంతాల్లోని పరిస్థితిని కూడా ఇది విశ్లేషించగలదు.

బిహార్‌లో అధికారం ఎన్‌డీఏదే

- సీఎంగా తేజస్వీ వైపు మొగ్గు
- ఎన్డీఏకు 120-140 సీట్లు
- 70-81 సీట్లతో అతిపెద్ద పార్టీగా బీజేపీ
- ఒపీనియన్‌ పోల్‌ అంచనా

న్యూఢిల్లీ, నవంబరు 1: బిహార్‌లో ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారంలోకి రానుందని ఓపీనియన్‌ పోల్‌ సర్వేలో వెల్లడయింది. జేవీసీ పోల్‌ సంస్థ నిర్వహించిన సర్వే ఫలితాలను శనివారం ప్రకటించింది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఎన్‌డీఏకు 120-140 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అత్యధికంగా బీజేపీ 70-81 సీట్లు సంపాదించి అతిపెద్ద పార్టీగా నిలుస్తుందని తెలిపింది. జేడీ(యూ)కు 42-48కి సీట్లు వచ్చే అవకాశం ఉంది. మహాకూటమిలోని ఆర్జేడీకి 69-78, కాంగ్రెస్‌కు 9, సీపీఐఎంఎల్‌కు 12 వరకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌ కిశోర్‌ ఆధ్వర్యంలోని జన్‌ సురాజ్‌ పార్టీ కేవలం ఒక్క సీటును మాత్రమే దక్కించుకునే సూచనలు ఉన్నాయి. సీఎం అభ్యర్థి విషయానికొస్తే ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ అయితే బాగుంటుందని అత్యధికంగా 33% మంది అభిప్రాయపడ్డారు. నీతీశ్‌ కొనసాగాలని 29% మంది కోరుకున్నారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి అయిన బీజేపీ నేత సామ్రాట్‌ చౌదరివైపు కేవలం 9% మందే మొగ్గు చూపారు. మొత్తంగా ఎన్‌డీఏకు 41-43%, మహాకూటమికి 39-41% ఓట్లు వచ్చే అవకాశం ఉంది.

20 ఏళ్లుగా మీ కోసమే సేవ

మరో అవకాశం ఇస్తే.. మరింత అభివృద్ధి

సీఎం నితీశ్‌ వీడియో సందేశం



పాట్నా, నవంబరు 1: బిహార్‌లో మరో ఐదు రోజుల్లో తొలి దశ ఎన్నికల పోలింగ్‌ జరగనుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, జేడీయూ నేత నితీశ్‌ కుమార్‌ శనివారం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మూడు నిమిషాల వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత రెండు దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తున్నానని, నిజాయతీగా, కష్టపడి పనిచేశానని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించి మరో అవకాశం ఇవ్వాలని, బిహార్‌ను టాప్‌ రాష్ట్రాల సరసన చేరేలా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా, ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కూడా ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకొనే ప్రసక్తే లేదని జన్‌ సురాజ్‌ పార్టీ వ్యవస్థాపకుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్‌ కిషోర్‌ తేల్చిచెప్పారు. పాట్నాలో ఓ జాతీయ మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని కావాలంటే తాను రాతపూర్వకంగా కూడా చెప్తానన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.